ఆంధ్రసచిత్రవార పత్రిక

2-12-66




35 పైసలు

ఇది మీకు తెలియదా?
ఎవరూ చెప్పలేదా?

చదివే అలవాటు వల్ల అనేక కొత్త విషయాలు తెలుస్తాయి. అనుభవం, విజ్ఞానం ఎక్కువయి జీవితం ప్రతిభ ప్రజ్ఞలతో అనేక విధాల అభివృద్ధి అవుతుంది. అయితే నిత్యజీవిత తాపత్రయాలతో వందల కొలది ఖర్చుపెట్టి, ప్రతిదీ కొని చదివే తీరిక ఉండదు. దానితో తెలుసుకోవలసిన అనేక మంచి విషయాలు తెలియకుండా పోతాయి. మీకీ శ్రమ లేకుండా ఆ లోటును భర్తీచేయటానికి ప్రతి సంవత్సరం అన్ని మంచి పత్రికలు, పుస్తకాలు, సంవత్సరమంతా అదే వృత్తిగా చదివి, వాటిలో అనుభవాన్ని, అనందాన్ని, విజ్ఞానాన్ని, ఆశ్చర్యాన్ని ఎక్కువచేసే అనేక గొప్ప విషయాలు ఏరికూర్చి, "తెలుసుకోదగ్గవి" అనే పుస్తక రూపంలో సంవత్సరానికో భాగంగా తెలుగులో ప్రచురింపబడుచున్నది. చివరకు మిగిలేది, మనతో వచ్చేది, మనం చదివి తెలుసుకొనే విజ్ఞానం మాత్రమే. మొదటి భాగం తయారుగా ఉన్నది. ఇందులో మీరు వెంటనే తెలుసుకోదగ్గ అనేక రకాల అద్భుత విషయాలున్నాయి. పది సామాన్య జన్మలలో రాని అనుభవ ఆనందాలను, దీన్నొక్కసారి కాలక్షేపంగా చదివినంతలో పొందగలరు. కుటుంబంలో అందరికి ఉపయోగిస్తుంది. మీ యింట్లో విద్యార్థులకు కూడా ఎంతో లోకజ్ఞానం తెస్తుంది. చదవటం మొదలిడితే పూర్తి అయ్యేవరకూ మానరు. చదువులో యిదివరకు మీరు చవిచూడని ఎన్నో గొప్ప రుచులు చూపిస్తుంది. దానెత్తు బంగారం అయినాసరే యిచ్చి, కొని చదవదగ్గ విషయాలందున్నాయి. ఒక సంవత్సర శ్రమ ఫలితం. రచన : **ఎ. యస్. మూర్తి, ఎం.ఏ.** 320 పేజీలు. ధర పోస్టు ఖర్చులతో సహా రూ. 5/- ఇది మీరు చదివేక, మీ మనస్సాక్షిగా మీరనుకొన్నట్లు లేదనుకొంటే, మీకు పుస్తకం అందిన మూడు రోజుల్లో తిరిగి పంపిస్తే, ధరలో పోస్టు ఖర్చు రూ. 1 పోను, మిగతా రూ. 4 యదార్థంగా మీకు వెంటనే తిరిగి పంపబడును. ప్రతి పేజీలోను రత్నాలలాంటి అనేక అమూల్య విషయాలున్నాయి. ఇవే మీరు స్వంతంగా తెలుసుకోవాలంటే అనేక వందల రెట్లు ఖర్చు శ్రమ అగును. అలాంటి శ్రమ లేకుండా యిది మీకు అమర్చిపెట్టినట్లు అందుబాట్లో ఉంది. ముందుగా డబ్బు పంపే పనిలేదు. **దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర**కు ఉత్తరం వ్రాస్తే పోస్టు ఖర్చులతో సహా రూ. 5 లకు వి. పి. పోస్టులో పంపబడును. ఇది మీరు త్వరపడవలసిన చక్కటి అవకాశం.

Swastik


తప్పక చూడండి!
రవీంద్ర ఆర్ట్స్ ప్రొడక్షన్స్
డాక్టర్ ఆనంద్
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి. మధుసూదనరావు
నిర్మాత. డి.వి.రెడ్డి


తప్పక చూడండి!
బి.ఏ.యస్ వారి
మోహినీ భస్మాసుర
నిర్మాత. దర్శకుడు: బి ఏ సుబ్బారావు
సంగీతం · కథ మాటలు · ఆర్ట్ · ఛాయాగ్రహణం · ట్రిక్స్ · ఎడిటింగ్ · నృత్యం
యస్.రాజేశ్వరరావు · గబ్బిట వెంకటరావు · వాలి · · ఎల్లప్ప · · రవికాంత్ · మార్తాండ్ · రాజా. జయరాం.

ఉత్తరాలు

బీహార్ క్షామనివారణ కమిటీ

బీహార్ అసోసియేషన్ (43 బ్రాడియాస్ స్ట్రీట్, మద్రాసు-1) కార్యదర్శి తాము 'బీహార్ క్షామ నివారణ కమిటీ' ఒకటి ఏర్పరచి క్షామ బాధితులకు తగిన విరాళాలు సేకరిస్తున్నట్లు మాకు రాస్తున్నారు. దేశ ప్రజలందరూ ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నారు.— సం.

ముఖచిత్రం

16—9—66 తేది ముఖచిత్రము వినాయకచవితి ప్రత్యేకసంచిక చూడ ముచ్చటగా యున్నది. కథలు చాల బాగున్నవి. చిత్రలహరిలో కొత్త నటీనటులతో అందముగా ఆకర్షణీయముగా మాకు చాల ఆనందమైనది. ఇంత మంచి చిత్రాలతో మరియు మంచి కథలతో ప్రత్యేకసంచిక అందించిన రచయితలకు మరియు మీ సంపాదకవర్గానికి నా ధన్యవాదాలు.

ఖాన్‌బాషిద్, (లక్ష్మెట్టిపేట్)

* * *

4—11—66 సంచిక అట్టపై నా అభిమాన నటి గీతాంజలి ముఖచిత్రం చాలా బావుంది. దానిమ్మచెట్టు కథ ఒక మోస్తరుగావుంది. ఈమధ్య పత్రికలో మంచి కథలు ప్రచురించకపోవటంనే పాఠకులకు నిరుత్సాహమవుతోంది. మంచి కథలు చిత్రించమని ప్రార్థన.

క్రొత్త సీరియల్ సుప్రభాతం మొదట్లోనే ఇంత బావుంది. ముందుకు వెళ్ళే కొద్దీ ఇంకా ఎంత బావుంటుందో అని పత్రికకోసం నిరీక్షిస్తున్నాము. రచయిత రంగధామ్‌గారికి నా హృదయ పూర్వక అభినందనలు. విచిత్రంగా మారిపోతున్న స్త్రీల పేర్లు నా మనస్సుకు ఎంతో నచ్చింది. ఈకాలంలో ఇల్లాంటివి ఎన్నోచోట్ల చూస్తున్నాము. ఇల్లాంటివి చూసి అయినా మారితే అది గొప్ప విషయమే.

ఇవటూరి సుసీలాలక్ష్మి (ఏలేటిపాడు)

కథలు

శ్రీ ద్విబాష్యం నూరీడు రచించిన "ఊహలు—అనుభవాలు" అనే కథను 28—10—66 వారపత్రికలో చదివాను. ఆరు సంవత్సరాల పిల్లవాడికి ప్రేమలో అంత జ్ఞానం వుందంటే నమ్మతగిందికాదు. మొదట్లో చిన్నపిల్లవాడు సరదాగా అనగలడు. దానినే పెద్దవాడయిం తర్వాత కూడా ఆ అమ్మాయినే గుర్తుంచుకొని, ఆ విషయాన్నే మనస్సులో పెట్టుకొని, ఇరవై సంవత్సరాలు వచ్చిందాకా, ఆరవ సంవత్సరంలో జరిగిన సంఘటనను గుర్తుంచుకొనడమనేది సహజంగాలేదు. ఆరు సంవత్సరముల పిల్లవాడు, అయిదు సంవత్సరముల వరకూ ఆఅమ్మాయిని గుర్తుంచుకొని, ఆఅమ్మాయి కోసం పరితపించడమనేది జరిగే సంఘటన కాదని గట్టిగా చెప్పగలను.

"ఏకా" (హైదరాబాదు)

* * *

'కమలాకాంత్' గారు వ్రాసిన "సత్యం వధ" కథ చాలా బాగుంది.

కాని, కథలో రెండు చిన్న పొరపాట్లు మాత్రం జరిగినవి. ఒకటి, "డబుల్ డెక్కర్" లో ఎక్కి కూర్చొని "అని వ్రాసారు అసలు 'ఎయిట్' నంబర్ రూటుకు 'డబుల్ డెక్కర్స్' లేవు. 'సెవన్'కు మాత్రమే.

రెండవది 25 వ పేజీ, మూడవ కాలం మొదటి పేరాలో "రహత్ మహల్"లో ఒక గుయ్యారం లాంటి గది తీసుకొని వుంటున్నారు" అని వ్రాశారు. "రహత్ మహల్" అనేది హైదరాబాదులోని ఒక సినిమాథియేటర్ పేరు. అందులో గది తీసుకొని ఉండటం ఏమిటి!?. "రహత్ మహల్"లో అనుటకు బదులు, 'రహత్ మహల్ దగ్గర' అని కాని, లేక 'ముషిరాబాద్'లో అని కాని ఉండాల్సింది.

ఈ పొరపాట్లు తప్పితే, కథ చాలా బాగుంది. రచయితకు నా అభినందనలు.

వేలేటి రామచంద్రరావు (హైదరాబాదు)

* * *

7—10—66 వ సంచికలో 'ఒరి తెగించిన ఆడది' వర్ణింతగానో ఆకర్షించింది. రచయిత యర్రంసెట్టి శాయిగార్కి నా ధన్యవాదాలు. ఇదే సంచికలో చిరుద్యోగ వర్షం రెండవ కథ చాలా బాగుంది. అర్ధాంగి అయిపోయింది. క్రొత్త సీరియల్ ఏమిటా అని ఎదురు చూస్తున్నాము. త్వరలో సీరియల్ ప్రారంభించమని కోరుతున్నాను.

ఎం. ఎస్. మూర్తి, (పిఠాపురం)

సీరియల్స్

ఆమ్రపాలి అత్యంత ఆకర్షణీయంగా సాగుతున్నది. మహావీరుడయిన బింబిసారుడు ఒక గొప్పచక్రవర్తి అని మాత్రమే చరిత్రలో చదివేముకాని యింత నిర్భాగ్యుడయిన ప్రేమికుడని యీకథ చదివితేనే కాని విశదాన్యంగా ఎవరికీ తెలియదు. యిద్దరు ప్రేమికులు పరస్పరంగా అనురక్తులయినప్పటికీ పరిస్థితుల ప్రభావం వలన వారి సమాగమం అసాధ్యమయినప్పుడు వారనుభవించే వేదన ఎలా వుంటుందో రచయిత చక్కగా వర్ణిస్తున్నారు. సంజయుని ప్రోద్బలం వలన పాలిని కలువ బోయిన బింబిసారుడు ఆమెను క్షమాభిక్ష కోరడం, ఆమె చేత తిరస్కరింపబడడం అత్యంత హృదయ విదారకంగా వున్నాయి. తనని దాదాపు మరచిపోయిన బింబిసారుణ్ణి పుత్త్రికలు జహాకరించి పాలి అతణ్ణి రెచ్చగొట్టడం, తనను కలుపవచ్చిన అతణ్ణి తిరస్కరించడంతో పాఠకులకు ఆమ్రపాలి మీద ఉన్న సానుభూతి కూడా పోతున్నది. ఆమె యీ చర్యలకు అర్థమేమిటో? ఏమైనా యింత చక్కటి కథను తెలుగులో కూడ సినిమాగా తీస్తే బాగుంటుంది.

రచయిత తమ భావాన్ని హృద్యంగమంగా ప్రకటించగలిగినప్పటికీ, వారు సరయిన భాష ఉపయోగించ లేకపోతున్నారు. ఇది కాస్త లోపమే.

బి. ఎస్. రావు., బి. యమ్. రావు. (భద్రాచలం)

వ్యాసాలు

"కమ్యూనిష్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షులు కామరాజ్" అను శీర్షికలో ఈ వారం 21—10—66 పత్రికలో 14 వ పేజీలో "కామరాజ్ రష్యా పర్యటనలో రెండవ రోజే ఒక అద్భుత విషయం జరిగింది. ఆ రోజు తష్కెంటు వెంటనే భారత దేశానికి తిరిగి వచ్చారు. అవును! అయిన తిరిగి వచ్చారు" అని ఉంది "కాశ్మీర్‌నుంచి నేయి మైళ్ళ లోపున వున్న సోవియట్ భూమిలోని తాజిక్ రిపబ్లిక్‌కు వచ్చారు కామరాజ్" అని కంటిన్యూ చేశారు. అర్థంకాలేదు ఆ సందర్భం. పత్రికా ముఖంగా వివరిస్తారని ఆశిస్తాను. పత్రిక చాలా బాగుంటోంది.

సుందరరామమూర్తి (వరంగల్లు)

* జవాబు : తాజిక్ రిపబ్లిక్ ప్రజలక్కు, కాశ్మీర్ ప్రజలకు ఎంత మాత్రం భేదం లేదని, తాజిక్ రిపబ్లిక్‌లో ప్రవేశించగానే భారత భూభాగమైన కాశ్మీర్‌లో ప్రవేశించినట్లు తోచిందని ఉత్ప్రేక్షించారు రచయిత. ఇంత అలంకారికంగా చెప్పినదాన్ని గ్రహించని పాఠకుణ్ణి మనం చేసేదేమి? (వి. రా.)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు .
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 2—12—66

పరాభవనామ: సం॥ కార్తీకమాసం॥ బ॥ పంచమి

సంపుటము : 59 సంచిక . 12

*

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

చందా వివరాలు :

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేనని, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలో మాట

నిరీక్షణ, అర్ధాంగి సీరియల్ నవలలను ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు అందించిన శ్రీమతి ఉన్నవ విజయలక్ష్మిగారు రాసిన మరొక సీరియల్ "అంతస్తులు — అభిమానాలు" ఈ సంచికలో ప్రారంభం అవుతున్నది...

* * *

కొన్ని అనివార్య కారణాలవల్ల ఈ వారం "కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్" ప్రచురణ సాధ్యంకాలేదు...

* * *

ఇటీవల మద్రాసు నగరంలో పెంచిన "టాక్సీ ఫేర్" డ్రైవర్లపై ఎలాంటి ప్రభావాన్ని చూపిందో ఈ సంచికలోని 19 వ పేజీలో ప్రచురించిన ఇంటర్వ్యూ విశదం చేస్తుంది...

* * *

విదేశాలనుంచి ఆహార సహాయాన్ని పొందేదేశాలు తమ తమ దేశాలలో స్వయంసమృద్ధిని సాధించుకోడం ఎంత అవసరమో అమెరికా వ్యవసాయశాఖ మంత్రి శ్రీ ఆర్విల్ ఫ్రీమన్ తమ వ్యాసంలో విశదీకరించారు...

* * *

సినిమా తారల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పాఠకులకు ఈ సంచికలోని 52 వ పేజీలో ఒక తారను గురించిన వివరాలు లభ్యమవుతాయి...

విషయానుక్రమణిక

ముఖచిత్రం : "ప్రేమలో ప్రమాదం' లో కృష్ణకుమారి.


ఆపదలో అబల
పటిష్టమైన పరిపాలన
పలాయన మంత్రం!
కాశ్మీర్ వివాదంలో రాజీకి రావడానికి అయూబ్ సంసిద్ధత!
కాశ్మీర్ విపరీత పరిస్థితి
త్రిశంకు స్వర్గం!
జాగిలం
శాంతి విఘాతకులు
చవాన్
అభివృద్ధిలోకి వస్తున్న దేశాలు
సంపన్న దేశాలు
ప్రపంచ మార్కెట్టు
తగని పందెం!

శ్రీకృష్ణ

నందా నాయకత్వంలో దేశీయాంగశాఖ

శ్రీ లాలా గుల్జారీలాల్‌నందా గారి అభిప్రాయం ప్రకారం ఇద్దరేయిద్దరు యదార్ధవాదులున్నారు. అందులో తాము ఒకరు, రెండోవారు జ్యోతిషశాస్త్రవేత్త పండిట్ హవేలీరావ్‌ గారయి వుండాలి! (హవేలీ అంటే నివాస గృహమనే అర్థం ఒకటుంది). ప్రజల్లో వాదోపవాదాలు ప్రబలం చేసేందుకు ప్రచురించిన ఆయన రెండు ఉత్తరాలూ, దేశంలో ఆయనవల్ల కలిగిన కీడును రూపుమాపలేవు సరిగదా ఆయనకు జనాన్నుంచి సానుభూతినీ తెచ్చిపెట్టలేవు.

ఈ నెల లోక్‌సభలో 'గోవధ' మీద ఆయనిచ్చిన వివరణను కొట్టిపారేశారు. పండిట్ ప్రకాశ వీరశాస్త్రిగారు, సేట్ గోవిందదాసుగారు, దేశీయాంగమంత్రి కథనం తృప్తికరంగా లేదని బహిరంగంగా చెప్పేశారు. ఆందోళన దారుల ఆరా తీయడానికి లాలాగుల్జారీలాల్ గారి దగ్గర చక్కని రహస్య సమాచారశాఖ వుంది. ఆందోళన జరుగుతుందని ముందుగా ఎలా తెలియకుండా వుంటుంది? లాలాజీగారికి సాధుసమాజంతో చాలా దగ్గరి బంధుత్వముంది. ఈ సాధుసమాజం ఢిల్లీలో ఆందోళన జరపడానికని ఆరుమాసాల నుంచి తీరతీరాల సాధువుల్ని కూడ గట్టింది. జమునా బజారులో ఈ సాధువులకి ఒక మకాం ఏర్పరచబడింది. లాలాజీగారి యిల్లు సాధుసమాజానికి సత్రం లాంటిది! నిర్విరామంగా సాధుపుంగవులు వస్తూపోతూనే వుంటారు. ఢిల్లీలో ఆస్థిని తగులబెట్టాలని ఎంచుకున్న ఈ సాధువుల పథకం ముందుగా లాలాజీగారికి తెలియదనడం వింతగా వుంటుంది. సాధు శిఖామణులు మందుగుండు సామానుతో సంచుల్ని నింపుకు తిరగడం, కిరసనాయిలు గుడ్డల్తో ప్రత్యక్షం కావడం లాంటి చర్యలు జుగుప్సాకరంగా వుంటాయి. ఇటువంటి పని సమాజానికి తీరని కళంకం.

రహస్య సమాచారశాఖ యొక్క ప్రధాన ఉద్దేశమేమిటి? అది చేసే పనేమిటి? అనేది మొట్టమొదటి ప్రశ్న. బ్రిటిష్‌వారి కాలంలో యిలాంటి నిశితమైన శాఖను కాంగ్రెసు కార్యవర్గంలో జొనిపేవారు. ఇప్పుడీ శాఖ నిరంతరంగా టెలిఫోన్లను ఎంగేజ్ చేస్తూ, ముఖ్యమంత్రుల, కేంద్ర మంత్రుల జాతకాలను తయారు చేయడానికి మాత్రమే వినియోగపడుతున్నదని రూఢిగా తెలిసిపోయింది.

ప్రధానమంత్రి సహాయ నిరాకరణ చేస్తూ వున్నారని లాలాజీగారు వారిని నిందించారు. ప్రధానమంత్రి సమర్థించుకోగల సమర్థులు. లాలాజీగార్ని ఎప్పుడైనా ప్రధానమంత్రిగారు ఖండించారా? అయితే పర్యవసానం ఏమిటయి వుంది? ఆయన్ను కార్యవర్గంలోంచి తొలిగించేంతవరకు ఏం చేస్తున్నారు? అలా కాకుండా దేశీయాంగమంత్రి హోదాలో ఆయన కాలు మీద కాలేసుకుని ఇంతవరకు కూర్చున్నారంటే ప్రధానమంత్రి, శ్రీవారి సెక్రటరీ యల్. పి. సింగ్ గారు ఆయన కోరిన మేరకు చేయూత నిస్తున్నారనే కదా అర్థం?

దేశీయాంగశాఖ కార్యదర్శి గురించి ప్రస్తావిద్దాం. ముందున్న విశ్వనాథన్‌గారిని లాలాజీగారే స్వయంగా తన కార్యదర్శి నుంచి తగిన సహాయ సహకారాలు లభించడం లేదనే కారణంతో పీకి పారేశారు. ప్రస్తుత కార్యదర్శి యల్. పి. సింగ్ గారి మీద ప్రధానమంత్రికి అభియోగం దాఖలు చేసుకున్నప్పుడు ప్రధానమంత్రి ఏమన్నారు? తమ కార్యదర్శి శ్రీ యల్. కె. ఝాను మార్చుకోమన్నారు. అబ్బే, లాలాజీ దానికి ఒప్పుకోలేదు. మరి లాలాజీగార్కి ఎటువంటి కార్యదర్శి కావాలి? ఆయన లాంటి భావాలే కార్యదర్శికీ వుండాలి. దేశం బాగోగుల గురించి ఆలోచించకుండా అక్షరాలా ఆయన గీచిన గీటుల్లో నడవాలి!

దేశీయాంగమంత్రి దేశానికి సంరక్షకుని లాంటివాడు. అటువంటి వాడు తన లోపాల్ని కప్పిపుచ్చుకోడానికి కార్యదర్శి మీద దాడి చేశారు!

ఈ విషయంలో మనకు ఆశ్చర్యం గొల్పుతున్నదేమిటి - అంటే పండిట్ హవేలీ రావ్‌గారి హెచ్చరిక. బహుశా ఆయన నవంబరు ఏడవ తేదీన దారుణ సంఘటనల గురించి, తీవ్ర పరిణామాల గురించి లాలాజీని హెచ్చరించి వుండరు. గోవధ నిషేధాందోళన లాలాజీ నిషేధాందోళనగా పరిణమిస్తుందని ఆయనా వూహించి వుండరు. రెండుసార్లు తాత్కాలికంగా ప్రధానమంత్రి పదవి నధిష్ఠించే గీత నీచేతిలో వుందని చెప్పిన పండిట్ హవేలీ రావ్‌గారు ఆయన్ను పాపం క్రుంగదీసేశారు. పండిట్ హవేలీ రావ్‌గారి నేరం యల్. పి. సింగ్‌గారి నేరాని కన్నా ఘోరం. అయినా లాలాజీగారు పండిట్ హవేలీరావ్‌ గారిపేరు చెప్పడం మరచిపోయారు!

నెల్లాళ్లనుంచి ఢిల్లీలోని పోలీసువారు ఒక సంఘాన్ని ఏర్పరచుకునేందుకు సమావేశమవుతూ వున్నారనే వార్త అందరికీ అందింది. ఈ సమావేశాల్లో కమ్యూనిస్టులు, సోషలిస్టులు, జనసంఘంవారు, కాంగ్రెసు వారు అందరూ ఉపన్యాసాలిచ్చిన వారే. ఈ సమావేశాల గురించి వీసమెత్తయినా తమకు తెలియదని లాలాజీ బుకాయించడం ఎంత సబబు? కార్మిక సంఘాలవలె పోలీసులు ఒక సంఘం ఏర్పరచుకోవడం గురించి మంత్రివర్గం నెల్లాళ్ల క్రితమే అసమ్మతి తెలియపరచినట్లు న్యూఢిల్లీ నివేధికల వల్ల తెలుస్తూ వుంది. ఢిల్లీలో న్యాయశాస్త్ర విద్యార్థుల ఆందోళన మీద కూడా మంత్రివర్గం ఆంక్ష విధించి వున్నది. ఈ తీర్మానాల్ని లాలాజీగారే పెట్టెలో భద్రపరచి వుంచారో, యల్. పి. సింగ్‌గారే ఆయన ముందుంచేందుకు ముందుకు రాలేదో ఆలోచించాల్సిన విషయం. ఏవిధంగా చూసినా మంత్రిగారు ఈ విషయమైన ఫైళ్లను తిరగేయవలసి వుంది. ఫైళ్లను చూసేందుకు ఆయనకు వీలుపడలేదు, అంటే అది కార్యదర్శి లోపం.

నందాగారి పద్దానుగేళ్ల మంత్రిహోదాను వెనక్కు తిరిగి పరిశీలించి చూసినట్లయితే, ఆయన—కార్మికుల్ని వళ్లు నూగువట్టేంత వరకు మేపి మేపి, వాళ్లను భరించలేని వాళ్లుగాను, ఫలితం లేనివాళ్ళుగాను, క్రమశిక్షణా రహితులుగాను తయారు చేశారు.

అంతేకాకుండా తాడూ బొంగరంలేని వ్యవసాయకూలీలను చిన్నచూపు చూశారు. నందాగారి ఎగుడుదిగుడు పథకాలవల్ల భారతదేశం గందరగోళంగా తయారైంది. పంజాబును విడదీయడం ద్వారా ఢిల్లీలో ప్రజాస్వామ్యం తిరిగి జేబులో బొమ్మలా తయారైంది. ఆయన పరిపాలన వల్లనే శాంతిభద్రతల పరిస్థితి రభసగా తయారైంది. ఆయనే బెంగాలులోని కల్లోల పరిస్థితిని కనపడకుండా చేద్దామని కలకత్తాకు పరుగెత్తారు. అందుకది అలా తయారైంది.

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థన
సం॥

న్యూఢిల్లీ లేఖ

శ్రీవారి యజమాయిషీలోనే, జబర్దస్తీలకి దౌర్జన్యాలకి తలొగ్గి దేశం అల్లకల్లోలమైపోయింది. ప్రాణనష్టం ఆస్తినష్టం తీరేవేనా?

ఆయన భారత్ సేవక్ సమాజ్‌ను స్థాపించారు. అది కాంట్రాక్టర్ల వశమై వుంది. ఆయన భారత సదాచార సమితిని నెలకొల్పారు. అవినీతిని రూపొందించడానికి ఈ సమితి పనికి రాకుండాపోయింది. మంత్రిగాను, సంఘ సేవకుడుగాను లాలాజీ అపజయాన్ని పొందారు.

లాలాజీగారు కార్యవర్గంలో నిలద్రొక్కుకోడానికి కొన్ని 'ప్రతీపశక్తులు' అడ్డు నిలిచాయని నిందించారు. ఆ ప్రతిశక్తులు ఎవరై వున్నారో మాత్రం వెల్లడి చేయలేదు.

శ్రీ సత్యనారాయణసిన్హా గారికి తోడుగా కలకత్తా వెళ్లి అక్కడ వ్యాపారస్థుల్ని అప్పటి ఆర్థికమంత్రి గారైన టి. టి. కృష్ణమాచారి గారి బారి నుండి తప్పిస్తామని, నందాగారు వారికి మాటిచ్చినట్టు అధికారయుతంగా తెలుస్తున్నదే. చమన్లాల్ అండ్ కంపెనీ మీద కేసును ఉపసంహరించమని టి. టి. కృష్ణమాచారిగారిని ఈయన కోరడమూ సోదాహరణమైనదే. మూడవ అభియోగంగా ఎంతమంది 'నల్లబజారు దార్ల'ను, ఎంతమంది 'ప్రతీపశక్తుల్ని' ఆయన శిక్షించాడో లాలాజీ వెల్లడి చేయనేలేదు!

విచారించవలసిన విషయమొక్కటే అంటే లాలాజీలాంటి యోగ్యమైన వ్యక్తి హోదాతోను, మహోదాత్తతతోను మంత్రివర్గంలో నుంచి ఆదిలోనే తప్పుకోకపోవడం. చాలమంది వలె ఆయన కూడా పదవీ వ్యామోహం కలవాడుగాను, అధికార దాహం కలవాడుగాను కనిపించారు.

రెండవ కేబుల్ ఫ్యాక్టరీ

భారతదేశంలో రెండవ 'కేబుల్‌ఫ్యాక్టరీ' స్థాపించడానికి తీర్మానించుకున్న విధానాన్ని బట్టి, అప్పుడప్పుడు రాజకీయాలు ఆర్థిక విధానాన్ని ఎలా దొంగదాట్లు వేస్తాంటాయో అర్థమవుతూ వుంది. ఉత్తర హిందూస్తాన్‌లో ఒక కేబుల్ ఫ్యాక్టరీ వుండనే వుంది. అంచేత రెండవ కేబుల్‌ఫ్యాక్టరీ దక్షిణదేశంలో ఏర్పాటు చేయడం న్యాయం. నిర్ధారణ చేయక మునుపు పరిశ్రమలశాఖలో మంత్రులు అటు ఇటూ అయినారు. పార్లమెంటరీ కార్యకలాపాలకు, తంతితపాలాశాఖలకు మంత్రిగారైనవారు ఉత్తరాదివారు. అంచేత కేబుల్ ఫ్యాక్టరీని ఉత్తరాదిలో నెలకొల్పేందుకు నిశ్చయించుకున్నారు. మళ్లీ మంత్రులు మారినప్పుడు, ఆంధ్రప్రాంతం మంత్రి కలియడాన్ని పురస్కరించుకుని ఇందు గూర్చిన ప్రశ్న మరొక్కసారి తేబడింది. ఆయన కాయనే ఈ పథకం గురించిన నిర్ణయం తీసుకునే కంటే, ఒక సంఘాన్ని ఏర్పరచి, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎవరికి చెందాలో నిర్ణయించి చెప్పండి అని ఆ సంఘానికి వప్పగించారు. దక్షిణదేశంలోనే రెండవ కేబుల్ ఫ్యాక్టరీని నిర్మించాలని ఆ సంఘం నివేదిక సమర్పించింది. ఈ నివేదిక కేంద్ర మంత్రివర్గం ఆమోదం కోసం వేచివున్నది.

ఉక్కు ఫ్యాక్టరీ సమస్య

ఉక్కు ఎగుమతుల గురించి, సాధకబాధకాల గురించి ఐదేళ్ల ఎగుమతి పథకాన్నొకటి తయారు చేసి ఉక్కు ఎగుమతిదారులు ప్రభుత్వంతో ఒక సమావేశాన్ని ఏర్పరచుకున్నారు. సమగ్రంగా చర్చిస్తూ, నౌకా సుంకాల విపరీత పద్ధతుల గురించి, నిల్వ వుంచేప్పుడు కష్టనష్టాల గురించి, నౌకాస్థావరాల్లో ఉక్కును ఎగుమతి చేసేప్పుడు పడే ఇబ్బందులగురించి, తదితరాలైన వ్యాపార సూత్రాల గురించి ఉత్పత్తిదారులు ప్రభుత్వానికి తెలియజెప్పారు. కలకత్తా, హాల్దియా, కరదిప్, విశాఖపట్నాల నౌకాస్థావరాల్లో వసతిసాయాలను మరింతగా అభివృద్ధి చేయాలని వీరు గట్టిగా కోరారు.

1966—67 లో 3 45,000 టన్నుల ఉక్కు ఉత్పత్తులు, 150,000 టన్నుల దుక్క ఇనుము ఎగుమతి చేయబడింది. ఇప్పుడున్న అవకాశాలను బట్టి మనదేశం 1970—71 లో పదిలక్షల టన్నుల శ్రేష్టమైన ఉక్కును, ఉక్కు ఉత్పత్తుల్ని ఎగుమతి చేయగలిగి వుండాలి.

దుక్క ఇనుము మిగిలిపోకుండా, హిందుస్తాన్ స్టీల్, ఉక్కు మంత్రిత్వశాఖ రెండూ కలిసి బొగ్గు పొయ్యిల్ని, బ్లాస్టుఫర్నేసుల్ని విస్తృతంచేసి రోలింగ్ మిల్లులు, ఉక్కు సరఫరాల్ని అధికం చేయడానికి కృషి చేయడం అవసరం.

ఈమధ్య పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కుకర్మాగారం కోసమైన చర్చ తీవ్రంగానే వచ్చింది. అయితే కర్రా విరగలేదు. పామూ చావలేదు. నాల్గవ ప్రణాళికా కాలంలో ఐదవ ఉక్కుకర్మాగారం పెద్ద

తాము లేదా, ఎక్కడ పెడతాము అనే విషయాన్ని ప్రధానమంత్రిగారు బహిర్గతం చేయలేదు. ఆమె ఆందోళనకు వ్యతిరేకంగా మాత్రమే కాలు దువ్వారు.

ఇది ఆందోళనల్ని ప్రోత్సహించేందుక్కాదు! డబ్బు పరిమితిని బట్టి, సమకూరే సహాయాన్ని బట్టి, ఉక్కుఫ్యాక్టరీని నిర్మ

న్యూఢిల్లీ లేఖ

యిస్తామని ఈ రెండేళ్ళనుంచీ చెప్పకపోతే అప్పుడు ఆంధ్రలోనే పెడతాములే అని ఆమె ఎందుకు చెప్పలేకపోతున్నారు? మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డి. పి. మిశ్రాగారు ఉక్కుఫ్యాక్టరీ తమ రాష్ట్రంలోనే కావాలని పట్టుబట్టారు, అంచేతనే ప్రధానమంత్రిగారు తటస్థ వైఖరి చూపిస్తున్నారు అని లాబీవర్గాల ద్వారా తెలుస్తోంది. మరో విధంగా జరిగినట్టయితే, మిశ్రాగారు తమ రాష్ట్రంలో ముడిఇనుమును ఆంధ్రలో పెట్టబోయే ఉక్కుకర్మాగారానికి పంపించరుట! ఈ వార్త నిజమైనట్టయితే, ఇదే మన జాతిసమానతకు నిదర్శనం! ●

సమస్యా-పరిష్కారం

ఎమ్.ఆర్. ప్రసాద్



సూర్యభగవానుడు అస్తాద్రితో తన అశ్వాలకు అపరాంబుధిని వెతుక్కుంటున్న వేళ. ఆకాశంలో పేలవంగా అరుణవర్ణం అలుముకొంది. ధరిత్రీ దేవి నిశాదేవిని ఆత్మీయతతో ఆహ్వానించటానికి సిద్ధమవుతుండగా, పగలు రాత్రిని విడదీస్తున్నట్లుగా నింగి నేల కలిపే చోటు గీత గీసినట్లు గోచరిస్తోంది.

నిశాదేవి కురులలోని పాపిటలా తెల్లని సిమెంటు రోడ్డు అస్పష్టంగా అగుపడుతోంది. ఊరు దగ్గరవుతున్న కొద్దీ కారు వేగం హెచ్చించాను. కాసేపటికి సిమెంటు రోడ్డు మీదనుంచి, మట్టిరోడ్డు మీదకు మళ్లించాను కారుని. అప్పుడే కొన్ని జల్లు పడి ఆగిపోయి వుండటం చేత దుమ్ము లేవటంలేదు. ఆకాశాన్నంటుకొని వున్న కని కనబడని ఇంద్రధనుస్సు అక్కయ్య మనసులోని అస్పష్ట భావాల్ని గుర్తు చేస్తోంది.

కారు బంగళాలోకి మళ్లించాను.

దిగి లోపలికి నడిచాను.

అక్కయ్య ఎదురొచ్చింది.

"ఏమిటి కొంపలంటుకుపోతున్నట్లు ఉన్న పళంగా బయలుదేరి రమ్మని టెలిగ్రాం యిచ్చావు? ప్రకాశం మళ్లీ పోట్లాడి ఇంట్లోంచి వెళ్లిపోయాడా?" అన్నాను.

"అలా వెళ్లిపోయినా బాగుండేది" అంది అక్కయ్య.

"ఏం?" అన్నాను ఆశ్చర్యంగా.

అక్కయ్య మాట్లాడలేదు. ఆమె నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. ఆమెని బలవంత పరచి జరిగిందేమిటో తొందరగా నిర్బంధించలేదు. ఈ గొడవలు మామూలే. మళ్లీ అక్కయ్య సుపుత్రుడేదో గొడవ చేసి వుంటాడు. కనీసం రెండునెలల కొకసారైనా ఘనకార్యం లేకపోతే వాడికి మనశ్శాంతి వుండదు. జరిగిందేమిటో నేను అడక్కుండా అక్కయ్యే చెబితే బాగుండునని పించింది.

అక్కయ్య కంట్లో నీరు బుగ్గల మీదుగా జారింది!

నిదానంగా సోఫాలో కూలబడ్డాను.

ఆఖరికి అక్కయ్యే అంది "నా బాధ వాడు అర్థం చేసుకోడు ఎందుచేతలా? తండ్రి పోయినప్పటి నుండి పెంచి, పెద్దచేసి వాడి కోసమే జీవితాన్ని కనిపెట్టుకు పడివున్న నన్ను, నా భావాల్ని సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోడు?"

విసుగెక్కువైంది నాకు. "అక్కయ్యా నువ్వీ మాటలు ఒక్కసారి కాదు. వందసార్లు చెప్పావు. ఈ పాత రికార్డు వినలేను నేనిక. నువ్వు వాడు నిన్ను అర్థం చేసుకోవాలంటావు, వాడు తనని నువ్వు అర్థం చేసుకోవాలంటాడు. ఒకరు నిన్ను సానుభూతితో అర్థం చేసుకోలేదని ఫిర్యాదు పెట్టడం కంటే, నువ్వే ఇతర్లని అలా అర్థం చేసుకోటానికి ఎందుకు ప్రయత్నించకూడదు?" అన్నాను.

"అంటే నీ ఉద్దేశ్యం—పాతికేళ్లుగా కని పెంచిన దాన్ని నేను వాడిని అర్థం చేసుకోలేదనా?"

"నా ఉద్దేశ్యంలో మీ ఇద్దరికీ ఆ అర్థం చేసుకోవటమంటే ఏమిటో తెలీదని."

"నువ్వు కూడ అలా అంటే..."

"సరే. 'నువ్వు కూడ నన్ను అర్థం చేసుకోలేదు' అంటావనుకొన్నాను" అన్నాను.

విషాదంలో కూడ అక్కయ్య మొహంలో కోపం కనిపించింది నాకు. "నువ్వు స్నానం చేసిరా. తరువాత మాట్లాడదాం" అంటూ వెళ్లిపోయింది అక్కడినుండి.

విసుగ్గా లేచి మేడ మీదికి వెళ్లాను. ప్రకాశం గదిలో లేడు. బాత్రూము కేసి నడిచాను. వేడినీళ్ల స్నానం చేసినా చిరాకు తగ్గలేదు. అక్కడ ఆఫీసులో పని అలానే

వదిలేసి వచ్చాను. తీరా ఇక్కడకివస్తే మామూలు గొడవే. మళ్లీ ఇద్దరికీ సంధి జరపాలి నేను. అసలు శాంతి బలవంతం చెయ్యకపోతే వచ్చేవాడిని కాదు. మామూలు గొడవలే అన్నా శాంతి వినలేదు.

''ఏమీ జరక్కపోతే పెత్తనం ఎందుకిస్తుంది'' అంది శాంతి. శాంతి కూడ అక్కయ్యని అర్థం చేసుకోలేదు— నవ్వొచ్చింది నాకు. నేనూ ఉపయోగిస్తున్నా పదాన్ని!

స్నానం ముగించి వంటింట్లోకి వెళ్లాను. అక్కయ్య డైనింగ్ టేబిలు మీద భోజనానికి పళ్లాలు పెడుతోంది. కుర్చీలాక్కుని కూర్చున్నాను.

''శాంతి కులాసాయేనా?'' అంది.

''శాంతి కులాసాకేమిటిలే. లక్షణంగా వుంది. నేను లేను కదా అని స్నేహితురాళ్లతో ఏ ప్రోగ్రామో వేసుకొని వుంటుంది పాటికి. అసలు సంగతి చెప్పు ఏమైంది? ఉపన్యాసాలు మాత్రం వద్దు.''

ప్రకాశం సంగతి ఎత్తేటప్పటికి, అక్కయ్య నిరుత్సాహంగా కుర్చీలో కూలబడింది.

''పేకాటల గొడవా?''

అడ్డంగా తలూపింది.

''డబ్బు లెవరికేనా బాకీ పడ్డాడా?''

''ఊహూఁ! అవన్నీ మానేసినట్లున్నాడు''

''మరేమిటి?'' అన్నా విసుగ్గా.

''ఒక అమ్మాయి'' అంది అక్కయ్య.

కాసేపు అలానే కూర్చుండిపోయాను.

''చిన్న గొడవైతే సర్దుపోయేదాన్ని. ఇంత బాధపడేదాన్ని కూడా కాదు. కాని ఇలాంటిది జరుగుతుందనుకో లేదు.''

''నువ్వనుకోలేదు. నాకెప్పుడో తెలుసు ఇలాంటి దేదో జరుగుతుందని. వాడేం పిప్పరమెంట్లు, చాక్లెట్లు తినే స్కూలు కుర్రాడనుకున్నావా? పాతికేళ్లు వచ్చాయి. సరే— ఒక అమ్మాయితో తిరుగుతున్నాడు. మగవాడి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఒక ఆడది తటస్థ పడక తప్పదు......''

''అది ఆడది కాదు. కిలాడి'' మధ్యలోనే నా మాటలి కడ్డొస్తూ అంది అక్కయ్య.

''ఎవతో ఒకతె. ఎవరైతేనేం?— నాలుగు రోజులు తిరుగుతాడు. జీవితం అర్థమవగానే అసలు సంగతి తెలుసుకొంటాడు. ఆలోగా నీ పెద్దరికం ఉపయోగించి ఏదేనా చెయ్యబోయావా వ్యవహారం చెడిపి కొడుతుంది.''

''ఉపేక్షిస్తే వాడి జీవితమే చెడిపి కొడుతుంది.''

''నువ్వంటున్న దేమిటి?''

''నేనంటున్నది నువ్వనుకుంటున్న దానికంటే సీరియస్ అయిన విషయం. దాన్ని పెళ్లి చేసుకొంటాడట వాడు!''

''మరీ మంచిది. వాడి జీవితం నో మార్గాన పడుతుంది'' అన్నాను.

''ఇంజినీరింగ్ పూర్తి కాకుండానే వాడు పెళ్లి చేసుకోవటం నాకు ఇష్టం లేదు'' అంది అక్కయ్య.

''అవుతే ఈ సంవత్సరం ఆగమని చెబుతాలే ప్రకాశానికి'' అన్నాను.

''అందుకు కాదు నిన్ను ఇక్కడికి పిలిపించటం. వాడు ఆ అమ్మాయిని చేసుకోవటం నాకిష్టం లేదు.''

''అలా చెప్పు! నీకిష్టం లేదుకదూ?'' — నా కంఠం నాకే అదోలా ధ్వనించింది. కాస్త ఆగి సౌమ్యంగా అన్నాను ''అక్కయ్యా —ఒకటి చెప్పు. పెళ్లి చేసుకోబోయేది వాడా, నువ్వా? ఆ అమ్మాయితో జీవితాంతం జీవించాల్సింది వాడా నువ్వా? నీకు నచ్చిన అమ్మాయిని వాడు పెళ్లి చేసుకొని పరిస్థితులకు అనుగుణంగా వాడు తనని మలచుకోవటం భావ్యమా? వాడికి నచ్చిన అమ్మాయితో పరిస్థితులను నువ్వు అనుకూలంగా మలచుకోవటం భావ్యమా?''

అక్కయ్య మౌనంగా తల దించుకొని కూర్చుంది. తాపీగా ఆవకాయ కలుపుకొని నెయ్యి పోసుకొన్నాను.

''ఆ— భోంచెయ్యి—'' అన్నాను.

అక్కయ్య పళ్లాన్ని ప్రక్కకు త్రోసేసింది. చెయ్యి కడుక్కుంటూ అంది ''మీ ముందు తరం వారు వట్టి బుద్ధిహీనులు, చాదస్తంలో పాతుక పోయిన వారన్న భావం నీలో కూడా వుందిరా.''

''అలా అనుకోవటమే మీరు తరచూ చేసే పొరబాటు'' అన్నాను.

''నీ ఉద్దేశ్య మేమిట్రా? నేను వాడి మంచిని కోరనవా?'' అక్కయ్య ఆవేశంగా అంది.

''పిచ్చి అక్కయ్యా'' సానుభూతిగా నవ్వాను. కోప్పడక శాంతంగా ఆలోచించు. మీ తరం వారిని దుమ్మెత్తి పోయటానికి రాలేదు నేను. అదో అలా చూడక. ఆ కోపం కాస్త తగ్గించుకో. కోపంతో నీ మొహం చండాలంగా వుంటుంది......''

కోపంగా కూర్చుంది అక్కయ్య.

''ఇప్పుడు విను తాపీగా. నువ్వు మంచినే కోరతావు— ఒప్పుకొన్నాను. ప్రతి తల్లీ తండ్రీ ఇలానే అనుకొంటారు. కాని ఆ 'మంచి' అన్నది వుంది చూశావ్ అది అస్పష్టమైన పదం. నీ ఉద్దేశ్యంలో మంచి మరొకరి ఉద్దేశ్యంలో మంచికాక పోవచ్చు. చెడుగా కూడా పరిగణింప బడవచ్చు. మంచి చెడు అన్నది వ్యక్తి యొక్క మానసిక వ్యవస్థపైన ఇష్టా యిష్టాల మీద ఆధారపడుతుంది. ఎదురింటి అన్నపూర్ణని చేసుకోవటం నీకు మంచిగా కనబడితే మరో సుబ్బలక్ష్మిని పెళ్లి చేసుకోవటం వాడికి మంచిగా కనబడు తుంది. కాని ఆ మంచి చెడుల ఫలితాన్ని అనుభవించేది వాడు కాబట్టి వాడి నిర్ణయానికే ప్రాముఖ్యత యివ్వటం మంచిదని నా అభిప్రాయం.''

''అంటే వాడి వివాహంలో నా ప్రమేయం అణుమాత్రమేనా లేదా? కేవలం వివాహానికి ఆహ్వానితుల వంటి వారేనా తలితండ్రులు? వాడు తప్పుటడుగువేస్తోంటే నివారించే బాధ్యత, అధికారం నాకులేవా?''

''ఉన్నాయి. కాని మళ్లీ ఆ తప్పుటడుగు అంటున్నావు చూశావా అక్కయ్యా అది కూడ అస్పష్టమైన పదం. అది......''

''వ్యక్తి యొక్క మానసిక వ్యవస్థమీద, ఇష్టాయిష్టాల మీద అధార పడి వుంటుంది. ఒకరి ఉద్దేశ్యంలో ఒప్పు మరొకరి ఉద్దేశ్యంలో తప్పు!— ఒరేయ్ చెప్పిందే మళ్ళీ నాకు చెప్పకు. ఆ మాత్రం నేను గుర్తించుకోగలను.''

''లేదు. నువ్వు గుర్తించుకో లేనిది అదొకటే కాదు. వాడు స్కూల్ కుర్రాడు ప్రకాశం కాదు. పాతికేళ్ల ప్రకాశం. మంచి చెడ్డలు, తప్పొప్పులు, ఏవి అవునో ఏవి కాదో నిర్ణయించుకొనే బుద్ధి జ్ఞానం కలవాడన్న విషయం కూడ.''

''వాడికి బుద్ధి జ్ఞానం వుందనుకోను నేను.''

నవ్వాను నేను. ''అది మీ తరంవారు చేసే మరొక పొరబాటు.''

అక్కయ్య నావంక ఉగ్రంగా చూసింది. తరువాత నెమ్మదిగా అంది ''నాతో వాదించి నీ తెలివి తేటలు చూపించుకో ప్రయత్నించకు. అది వృధా— పైగా నీకు నేనేం బహుమతి ఇవ్వబోవటం లేదు. నీ మాటలు వింటూంటే నువ్వేదో ప్రిజుడిస్‌తో మాట్లాడుతూ వున్నావనిపిస్తోంది. అసలు నువ్వా అమ్మాయిని ఒకసారి చూస్తే ఇలా మాట్లాడవు.''

''ఏం? అందంగా లేదా?''

"వెధవలా మాట్లాడకు. అందంగా లేకపోతే దాని చుట్టూ ఎందుకు తిరుగుతాడు వాడు? అందం సంగతి కాదు నేను అంటున్నది. ఆ కట్టూ బొట్టూ, తీరు, తెన్నూ......''

''ఎలా వున్నాయి?'' అడిగాను.

సమస్యా పరిష్కారం

''నీ మొహంలా వున్నాయి....'' అక్కయ్య కోపం తగ్గించుకొని నెమ్మదిగా అంది ''అసలు బొట్టు లేదు. కట్టు విషయమా — దాదాపు ఒళ్లంతా కనబడుతుంది.''

''తీరు తెన్నా?''

''ఆఫీసులో టైపురైటర్ని బద్దలు కొట్టడం, క్లబ్‌లో డాన్సులు చేయటం'' మవునం వహించాను.

''అర్థమైందా?'' రెట్టించింది.

''ఆ!'' అన్నా.

''ఏమైనా చెయ్య దల్చుకొన్నావా?''

''ఏం చేయమంటావు?''

''పోలీసాఫీసరువి. ఆ మాత్రం తెలీదూ?''

''వెళ్లి బెదిరించమనా?''

''దాంతో వ్యవహారం కాకపోతే కాస్త డబ్బు పడెయ్యి దాని మొహానికి''.

''సినిమాల్లో వాంప్‌లా మాట్లాడుతున్నావు.''

''మళ్లీ నీ తెలివి వెలగ బెట్టకు. ఇది జీవితం'' అంది అక్కయ్య.

''ఆల్‌రైట్! ఇది జీవితం. అందుకే నీకింతవరకూ చెప్పాను. నా ఉద్దేశ్యంప్రకారం ప్రకాశానికి చెప్పటమే మంచిది''.

''వాడు వినడు.''

''వాడు వినడు. నువ్వు నీ పట్టు మానవు. పోనీ ఆ అమ్మాయి అలాంటిది కాక మంచిదే అయితే నువ్వు వారి వివాహానికి అంగీకరిస్తావా!''

తల అడ్డంగా వూపింది.

''నాకు అది నచ్చటం లేదు'' అన్నాను.

''నీకు నచ్చిందా లేదా అని అడగటానికి కాదు నిన్ను పిలిపించింది. ఆ అమ్మాయి మంచిదో కాదో నీకంటే నాకు బాగా తెలుసు. వాడి జీవితం బాగు చెయ్యటానికి సహాయపడతావా—ప్రయత్నించు. నీకే మార్గం తోచలేదా—నీకారు వుంది, పెట్రోలు పోయించి పెడతాను. తిరుగు ప్రయాణంలో ఏ పెట్రోలుబంకు దగ్గిరా ఆగాల్సిన పని వుండదు.''

''నువ్వు నాకు ఛాయిస్ వదలటంలేదు.''

''అది నిజం. ఎందుకంటే నాకే ఛాయిస్ లేదు కనుక'' అక్కయ్య లేచి గంభీరంగా బయటికి వెళ్లిపోయింది!

* * *

ఉదయం కాఫీలయ్యాక ప్రకాశం కనిపించాడు.

''ఏరా రాత్రి భోజనానికి రాలేదేం?''

''శశి ఇంట్లో చేశాను.''

''ఎవర్రా శశి?''

''చెప్ప లేదేమిటి మామయ్యా అమ్మ నీకింకా? నువ్వు అమాయకత్వం నటించాల్సిన

(46వ పేజీ చూడండి)

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. నిరుద్యోగిగా వున్న సత్యమూర్తికి రామవరం షుగర్‌ఫ్యాక్టరీలో ఉద్యోగమిప్పిస్తాను రమ్మంటాడు ప్రకాశం. సత్యమూర్తి అక్కడికి వెళ్ళేముందు లెక్చరరు అనంతరామయ్య, ఆయన కుమార్తె ఉమను కలుసుకున్నాడు. రామయ్యగారి దగ్గరకెళ్ళినపుడు ఆయన తన కథ కొంత చెప్పారు. మర్నాటి ఉదయానికల్లా ఆయన్ని ఎవరో పొడిచి, దాచుకున్నదంతా దోచుకుపోయారు. సత్యమూర్తి చెల్లెలు కళ్యాణి ఎక్కడికో వెళ్ళిపోయింది. ఏకాకి తల్లిని తీసుకుని రామవరానికి మకాం మార్చి, షుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్లు గ్రహించాడు. సూరప్పడు పంచాయతీ బోర్డు ప్రెసిడెంటయేందుకు ప్రకాశం సహాయం చేస్తున్నాడు.

సుప్రభాతం

(సీరియల్)

రంగధామ్

5

"ఎక్కువ వద్దులే మూడో, నాలుగో పంపించు. తరవాత చూసుకుందాం" అన్నాడు దామోదరం లేస్తూ. మూడు, నాలుగు వేలంటే, తనకి మతిపోయినట్లయినా, ఇంక ఏమన్నా అక్కడ లాభంలేదని, "సరే"నని ఒప్పుకుని సూరప్పడు వెళ్ళిపోయాడు.

"డబ్బు ఖర్చంటే ఏడుస్తాడు, మరి పదవులెలా వస్తాయో?" అన్నాడు రంగారావు, సూరప్పడు వెళ్ళిన వైపు చూస్తూ.

బదిరీ చిరునవ్వు నవ్వుతూ, "అప్పుడే తేలిపోయిందనుకుంటున్నాడు, ఇంకా చాలా ఖర్చుందని తెలియదు పాపం." అన్నాడు.

"వీడు మామూలుగా కానీ ఖర్చు పెట్టడప్పా. వీడికి తలలో పురుగు దొలుస్తోంది, ప్రెసిడెంటు అవ్వాల్ని. వాగన్నా, పిరన్నా, ఎలాగా వీడికే వేస్తారు. గవరయ్య వాళ్ళ చుట్టూ తిరగడానికి కారణం వేరే వుంది. వాడికి ఒక కేసులో వీళ్ళ సాక్ష్యం కావాలి. వీడు బయపడుతున్నాడు."

"అంతే నంటారు." అని రంగారావు నవ్వాడు.

బదిరి, కిటికీలోంచి బయటకు చూసి "మన వీర్రాజు వస్తున్నాడే. ఏదో సీరియస్ వ్యవహారంలా వుంది." అన్నాడు.

ఇంతలో ఒకనల్లని నడివయస్సు వ్యక్తి ప్రవేశించాడు. అతని వాలుగువేళ్ళకు ఆరుంగరాలున్నాయి. చేతికి బంగారం చైనుతో రిస్టువాచి, మెడలో సన్నని బంగారపుచైనూ పులిగోరూ, సిల్కు లాల్చీ, పంచె, కారాకిళ్ళీ నములుతున్న వీర్రాజు, రామవరం బియ్యం వర్తకులకు రాజులాంటివాడు. అతనికెంత డబ్బుందో అతనికి, తెలియకుండా వుండడు గాని, తెలియదంటారు పైవాళ్ళు.

"ఏటన్నా, కొట్టుకొస్తున్నావు రాలేదేటి?" అని వీర్రాజు దామోదరాన్ని ప్రశ్నించాడు. రంగారావు, బదిరికి కన్నుకొట్టాడు.

"లేదప్పా. ఇవాళ అర్జెంటుగా మద్రాసు పొమ్మని ప్రకాశం ఫోను చేశాడు. పోవాలని తయారవుతున్నా" అన్నాడు దామోదరం. బదిరి కొంటెగా నవ్వు మొహం పెట్టి రంగారావు వైపు చూశాడు. ఆ చూపులో 'చూస్కో మనవాడెలా మస్కాకొడుతున్నాడో' అన్న అర్థం వుంది.

"సంపేశావ్. నేన్ని మీద కొండంత ఆశతోటొచ్చాను."

"మూడురోజులో పికపట్టప్పా. మళ్ళీ వెంటనే తిరిగి వచ్చేస్తాను." అన్నాడు దామోదరం, వీర్రాజుని పరిశీలిస్తూ.

"మూడురోజులు కాదుగదా, మూడు గంట లాలస్యమైతే, నా ప్రాణం పోద్ది. పద, అలా కొట్టు కెళ్దాం."

"అదికాదు వీర్రాజా! చాలా అర్జంటు పనుంది. నేను వెళ్ళాలి."

"ఒక్కరోజాలస్యమైతే ఏదీ అవదు లెద్దూ."

"అమ్మమ్మ! ప్రకాశం సంగతి నీకు తెల్సుగా."

"ప్రకాశంతో నానుసెప్తాలే. నువ్వు బయల్దేరు" అని దామోదరం రానంటూంటే అతని చేతులు పట్టుకు లాగడం మొదలెట్టాడు. రంగారావు, బదిరీ నవ్వసాగారు. దామోదరం కదల్లేదు.

"లాభం లేదప్పా! బదిరీనడుగు ఎంత అర్జంటో."

"అయితే నా సంగతేటి?" అన్నాడు వీర్రాజు. దామోదరం కదిలేటట్లు లేదని గ్రహించి. దామోదరం సీరియస్‌గా మొహం పెట్టి, "ఏమిటది?" అని అడిగాడు.

ఇక చెప్పక తప్పదని, వీర్రాజు "సేల్సు టాక్సు ఇన్‌స్పెక్టరొచ్చి, కొట్లో పుస్తకాలన్నీ పట్టుకుపోయాడు. అందులో అనామతు కాతా పుస్తకం కూడా వుంది. కాళ్ళావేళ్ళా బడ్డా ఇచ్చినాడుగాడు. ఆఫీసరు కాంపేసినాడంట. ఆ పుస్తకం ఆళ్ళు చూస్తే కొంప మునుగుద్ది."

'అదా సంగతి!' అన్నట్లు రంగారావూ, బదిరీ ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు. దామోదరం సీరియస్ మొహంపెట్టి, "నన్నడిగితే వాళ్ళెంత టాక్సేస్తే అంతా కట్టేడమే మంచిది." అన్నాడు.

"ఏటన్నా! అందులో సాలా పద్దులున్నాయి. నన్ను సంపేకు."

"ఎందుకంటే, ఆఫీసరు మంచివాడు కాదప్పా. అతని చేతులో పడిందంటే మరి లాభంలేదు."

"అందుకే గదా, నీకాడ కొచ్చాను. ఏటో మార్గం సూడు. ఎంత డబ్బైనా సరే, ఆ పుస్తకం మనసేతిలోకి తిరిగొచ్చెయ్యాలి. ఈళ్ళు సూసి టాక్సెయ్యడంతో పోదు. ఇన్‌కంటాక్సోళ్ళు సూస్తే అసలు కొంప మునుగుద్ది. ఆళ్ళకీ ఈళ్ళకీ లంకెంటారు"

దామోదరం ఆలోచిస్తూ, "ఏదో చూసేవాళ్ళంకాని, నేను మెడ్రాసు పోతున్నాను గదా అందుకని లాభంలేదు."

"మెడ్రాసు రేపెళ్దుగాని. దీని సంగతేటో సూడన్నా."

"అహహా! ప్రకాశం వప్పుకోడు."

"ప్రకాశంతో నే జెప్తాగా. బాబ్బాబు నన్ను రచ్చించు."

"చాలా ఖర్చవుతుందప్పా! ఇప్పుడేం కావాలంటాడో, ఏమో?"

తన జేబులోంచి నోట్లకట్ట తీసి, "ఇదుగో అయిదువేలు. ఎలా సూస్తావో ఏటో. ఆ పుస్తకం, సాయంకాలానికల్లా నాసేతిలోకి తిరిగి రావాలా. మరిసి యిట్టం" అన్నాడు దామోదరం చేతిలో నోట్లకట్ట బెట్టూ. ఇష్టంలేనట్లు, ఆ కట్ట జేబులో పెట్టుకుంటూ, రంగారావు వైపు చూసి దామోదరం, "మెడ్రాసు ట్రంకుకాల్ బుక్ చెయ్యప్పా, ఇవాళ బయల్దేరటం లేదని" అన్నాడు.

"అగ్గదీ. అలా నాకేసో సూపు సూడాలి గాని, నువ్వు మద్రాసు చెక్కేస్తే, నాగతే కాను?" అన్నాడు వీర్రాజు, రంగారావు బయటికి వెళ్ళిపోతూంటే, బదిరి, దామోదరం వైపు చూశాడు.

"నీకు తెలీదప్పా, మద్రాసు వేసివాళ

వంత అవసరమో, వెళ్ళకపోతే చాలానష్టం. నా సొంతానికి, వెయ్యి రూపాయల దాకా నష్టం వుంటుంది. ఎవడిస్తాడు చెప్పు?''

''మన్లో మనకేటన్నా. నీ ఉపకారం, నేనుంచుకోను. నా పని మాత్రం చేసి పెట్టు. వస్తా.''

''అలాగే చూస్తాలే. వెళ్ళు'' అని దామోదరం అన్న తరువాత, వీర్రాజు బయటికి వెళ్ళిపోయాడు.

''సేల్సుటాక్సాఫీసర్ని రాత్రికి డిన్నరుకి పిలవాలి. సూరప్పడి మనుషుల కోసం కూడా సరుకు కావాలి. వైజాగ్ వెళ్ళి వెంటనే సరుకు తీసుకురా.'' అని బదిరి చేతికి దామోదరం, వీర్రాజిచ్చిన అయిదువేల లోనూ ఒక వెయ్యిచ్చాడు. బదిరి వెంటనే జీపు మీద బయల్దేరాడు.

దామోదరం ఒక్కడే గదిలో కాస్సేపు చుట్ట కాలుస్తూ కూచున్నాడు. అతని బుర్రలో ఆలోచనలు పరిగెడ్తూనే వుంటాయి. ప్రతి వ్యక్తి గురించి అతను ఆరా తీస్తాడు. ప్రతి వ్యక్తినీ పరిచయం చేసుకుంటాడు. ముందర ఆవ్యక్తి మీద కొంత మదుపు పెడ్తాడు. అతని వల్ల భవిష్యత్తులో కొంత లాభం వుంటుందని తోస్తే ఇంకా మదుపు పెడ్తాడు. వాడిని అత్యవసర పరిస్థితులలో ఆదుకుంటాడు. ఇక ఆ వ్యక్తికి దామోదరం మీద అత్యంత అభిమానం, విపరీతమైన నమ్మకం కుదిరాక అతనిని వినియోగించుకోవడం ప్రారంభిస్తాడు. తను దామోదరానికి ఉపయోగపడ్తేనే చాలనుకుంటాడా వ్యక్తి. సేల్సుటాక్సు ఇన్‌స్పెక్టరుకి, వీర్రాజు గుట్టంతా అందిచ్చి, ఏమైనాసరే, బినామీ కాతా, పుస్తకం పట్టుకోమని చెప్పింది దామోదరమే. దాని ద్వారా ఎంత రాబట్టొచ్చో, చెప్పి, ఆ మొత్తం వీర్రాజు దగ్గర వసూలు చేసి, వీర్రాజుని కూడా గుప్పిట్లో పెట్టుకున్నాడు.

అతని ఆలోచనలకి అంతరాయంగా ఆగది లోకి ఒక సూటువాలా ప్రవేశించాడు. అతని వయస్సు నలభై దాటుంది. పొడుగ్గా, ఎర్రగా వున్నాడు. చేతిలో హాండ్ బాగుంది. కళ్ళకు గాగుల్సున్నాయి. అతనిని చూసి దామోదరం హిందీలో మాట్లాడ సాగాడు. అతని పేరు అహమ్మద్‌ఖాన్. అతను రాగానే ''నువ్వు ఢిల్లీ నుంచి ఎప్పుడు వచ్చావు?'' అని హిందీలో దామోదరం ప్రశ్నించాడు.

అతను, ''నాలుగు రోజులైంది.''

''ఏమైంది? నువ్వెళ్ళిన పని?''

''ఆమె ఏ వూరిలో చనిపోయిందో నిర్ధారణగా తెలియటంలేదు. కాని, చనిపోయిందన్న విషయం మాత్రం రూఢీ.''

''ఆ విషయం నాకూ తెలుసు. కాని మనకి ఋజువు కావాలి. నిర్ధారణగా ఆమె చనిపోయిందని తేలాలి.''

''అదే తెలుసుకోవడం కష్టంగా వుంది. చూస్తే, ఆమె ఈ దేశంలోనే చనిపోయిందని, తెలుస్తోంది. వాళ్ళ యింటికి నేను రెండుమూడు సార్లు వెళ్ళాను. వాళ్ళకి నా మీద చాలా అనుమానం కలిగింది. మొదట నాతో సరిగా మాట్లాడలేదు. వాళ్ళ కోసం కొంత డబ్బు ఖర్చు పెట్టవలసి వచ్చింది. ఎలాగైతేనేం వాళ్ళతో స్నేహం చేసాను. వాళ్ళకు నేనంటే సదభిప్రాయం ఏర్పడే



సరికి రెండునెలలు పట్టింది. ఆ రెండు నెలలూ, నేను తరచూ కలకత్తా కేంపు వేసుకుని, వాళ్ళ యింటికి, బిస్కట్లూ, కేకులూ తీసుకుని వెళ్ళి మంచి చేసుకుంటూండేవాణ్ణి. ఒకసారి ఆ యజమాని నన్ను రెండువందల రూపాయలు అప్పు అడిగాడు. ఆ డబ్బు కూడా కిక్కురుమన

ఆగ్రా, బెనారసు, కలకత్తా లలో కష్టపడి విచారణ చేశాను. వాళ్ళిద్దరూ వున్న ఇళ్ళ దగ్గర వాకబు చేశాను. అన్నిచోట్లా, ఆమె కులాగా వుండడమే వాళ్ళెరుగుదురు. ఆమెకు జబ్బుచేసిందని కూడా వాళ్ళకు తెలియదు. కలకత్తాలో వాళ్ళకు బాగా స్నేహితులొక రున్నారు. వాళ్ళు చెప్పిందాన్ని బట్టి

కూడా ఇచ్చాను. కాని ఏమ్కావ లాభం లేకపోయింది. వాళ్లకు తెలిసిందులా వాళ్ళు చెప్పారు. ఈ దేశానికి వచ్చేముందు కలకత్తాలోనే వున్నారట. తరువాత ఈదేశం వచ్చేశారు. మళ్లీ రెండేళ్ల తర్వాత వీళ్లవద్దకు అతను వంటరిగా వచ్చాడట. భార్యను గురించి అడిగితే, దేశంలో వుంటుండగా పనిపోయిందని చెప్పాడట. అసలే అతను మితభాషి, భార్యను గురించి జ్ఞాపకం చేస్తే, విచారంలో మునిగిపోయి, గద్గద కంఠంతో కండ్ల వెంట నీరు కారుస్తూ మాటాడేవాడట. అందుకని ఎక్కువగా అడగటం బాగుండదని వూరుకునేవారుట. కొన్నాళ్ళు పోయాక విచారం తగ్గి అతనే చెప్తాడనుకున్నారుట. కాని అతను కలకత్తా వెళ్లడం అదే ఆఖరుసారి. మళ్లీ వెళ్లలేదు. అందుకని వాళ్లకు తెలుసుకునే అవకాశం లేకపోయింది.''

దామోదరం, ఖాన్ చెప్పిందంతా మౌనంగా విన్నాడు. చుట్ట కాలుస్తూ, ఖాన్ కేసి నిశితంగా చూశాడు. అతను చెప్పిందంతా నిజం అని గ్రహించాడు. ఆ పని ఖాన్‌వల్ల జరుగుతుందనే నమ్మకం లేదు. మరెవరినైనా నియోగించాలనుకున్నాడు, తన మనసులో.

''దాలినాయుడే మంటాడు?'' అని అడిగాడు దామోదరం.

''వాడు అదే మాట మొదటి నుండి అంటున్నాడు, మళ్లీ అన్నాడు. తనని విడిపించిన తక్షణం, తనకి తెలిసిందంతా చెప్తానంటున్నాడు. వాడితో ఎన్నోవిధాల మాట్లాడాను గాని, వాడికి తన గుట్టు ఇచ్చేస్తే, మరి తనను విడిపించే ప్రయత్నం చెయ్యరని అనుమానం పట్టుకుంది. అందుకని వాడు 'నాకంతా తెలుసు. మీకు కావలసిన వాళ్లని నేను చూపిస్తాను. నన్ను విడిపించండి' అంటున్నాడు.''

''హూ!'' అని కొంచెంసేపు మౌనంగా వూరుకున్నాడు దామోదరం. ఖాన్ గోడ వైపు తల త్రిప్పి కాలెండరు పరీక్షచేస్తున్నాడు. అతని మనస్సంతా దామోదరం మీద కేంద్రీకరించి వుంది. పైకి ప్రశాంతంగా కన్పిస్తున్నా అతనిలో చాలా ఆవేశం అణగి వుంది.

''ప్లీడర్ని కలుసుకున్నావా?'' అడిగాడు దామోదరం.

''ఆ. మరొక రెండుమూడు నెలలలో జడ్జిమెంటు అయిపోతుందన్నాడు. ప్రాసిక్యూషన్ సాక్షులందరూ అబద్ధాలు చెప్పి

సుప్రభాతం

నట్లు తేలిపోయిందిట. కేసు తప్పకుండా మన పక్షమే అవుతుందంటున్నాడు.''

''కేసు నిలబడదని నాకూ ధైర్యంగా వుంది. కాని దాలినాయుడు ఇంత మొండి పట్టు పటాడనుకోలేదు. అసలావనికి వాణ్ణి నియోగించడం పొరబాటయింది.''

''వాడికి ఎవరో సలహా ఇచ్చినట్టుంది. ఇది వాడి స్వయం బుద్ధి కాదు. ఎందుకంటే వాడిని అరెస్టు చెయ్యగానే ఒకసారి వాణ్ణి కలుసుకున్నాను. అప్పుడు వాడు తనకు తెలిసినదంతా చెప్పడానికి సిద్ధంగావున్నాడు. కాని అవాళ మాకు సరిగా మాట్లాడుకోవడానికి వీలు చిక్కలేదు. తరువాత కలుసుకున్నప్పుడు, మనిషి పూర్తిగా మారిపోయాడు. ఒక్క విషయం కూడ చెప్పనన్నాడు.''

''కావచ్చు. అప్పుడు వాడికి తెలిసిందంతా చెప్పినా వాడిని వదిలేసే వాళ్లం కాదు. ఇప్పటికి మూడేళ్లయింది, ఏమేం మార్పులొచ్చాయో, ఏమో?... సరే, నువ్వు నీ ప్రయత్నం మీద వుండు. నేను కొంత ఇచ్చిస్తాను. ప్లీడరుకి కొంతిచ్చి, కొంత నీ ఖర్చుకి వుంచుకో.'' అని ఒకనోట్ల కట్ట ఖాన్ చేతికిచ్చాడు, దామోదరం. అది తీసుకుని ఖాన్ వెళ్లిపోయాడు. దామోదరం చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది. ''హల్లో దామోదరం మాట్లాడుతున్నా.... ఏమప్పా! నువ్వా?.... ఆ! వీర్రాజు నన్ను కలుసుకున్నాడు. మనం అనుకున్నట్లే అయింది. ఇంకొక షాపుకి వెళ్లావా? మంచి పనిచేశావు. మనం అనుకున్న మొత్తం వచ్చేస్తుందిలే.... రాత్రి పార్టీ గురించి మీ ఆఫీసరుగారికి జ్ఞాపకం చెయ్యి. హల్లో!..... మరొక గంటలో నువ్విక్కడికి రాప్పా.'' అని టెలిఫోను వుంచేశాడు.

జేబులోంచి నోటు బుక్కు తీసుకుని ఏదో రాసుకున్నాడు, దామోదరం. తను వుద్యోగం చేసినప్పుడు తన తెలివితేటలు ఒక్క తన కంపెనీలోనే ఉపయోగపడేవి ఇప్పుడు, రాజకీయాల్లోనూ, వ్యాపారంలోనూ, చుట్టూ ఉన్న మనుషుల మీదా బాగా పని చేస్తున్నాయి. ప్రతి వాళ్లలోనూ ఇంత తెలివి తక్కువ నెందుకు పెట్టాడో భగవంతుడు, బోధపడలేదు ! అందుకే ఇంగ్లీషువాడు, అన్ని సంవత్సరాలు ఈ దేశాన్నేల గలిగాడు. తనకున్న తెలివితేటలకి తను తల్చుకుంటే ఒక గొప్ప రాజకీయవేత్త కాగలడు. కాని తన కక్కరలేదు. ప్రక్కనొక బుద్ధి వుంటే చాలు, తనకీ ప్రపంచంలో మరేమీ అక్కర లేదు. అసలీ మాత్రపు వ్యాపకమైనా పెట్టుకోవడానికి ఒకే ఒక కారణం వుంది. ఒక పని జరగడం కోసం నిరీక్షిస్తున్నాడు. అది జరిగిన నాడు, తను పూర్తిగా విశ్రాంతి తీసుకుంటాడు. తన పనుల కోసం వినియోగిస్తున్న మనుష్యుల తెలివి తక్కువ వల్ల ఇంత ఆలస్యమైంది. లేకపోతే ఆ పని ఏనాడో జరిగిపోయేది అనుకున్నాడు, దామోదరం.

అతనికి కర్మ సిద్ధాంతంలోనూ, భగవంతుని యందూ నమ్మకం లేదు. మానవుల తెలివి తేటలు గాని, తెలివి తక్కువ గాని 'విధి' అనే ఒక సూత్రాన్ని అనుసరించి నడుస్తాయంటే, అతను ఒప్పుకోడు. అంతా మనలోనే వుందంటాడు.

* * *

అది కాలేజీ లెక్చరు హాలు. సాయంకాలం ఆరు గంటల సమయంలో, ఆ హాలంతా విద్యార్థులతోనూ, విద్యార్థినులతో నిండి వుంది. కొంత మంది లెక్చరర్లు కూడా వున్నారు. విద్యుద్దీపాల కాంతిలో యువతీ యువకుల ఉత్సాహ పూరిత వదనాలు, చిరు నవ్వులతో మెరుస్తున్నాయి. జరుగుతున్నది వక్తృత్వపు పోటీ. మాట్లాడుతున్నది బి.ఏ. ఆఖరి సంవత్సరం చదువుతున్న, అందమైన ఒక విద్యార్థిని. ఆ రోజు పోటీలో ఆమె ఆఖరు అభ్యర్థిని. ఆమె ఉపన్యాసానికి చప్పట్లు, ఎడతెరిపిలేకుండా మ్రోగుతున్నాయి. ''అవినీతిని రూపుమాపుట'', అన్నది ఆనాటి విషయం.

''..... మన ప్రాజెక్టులనూ, మన పరిశ్రమలనూ, మన ఆధునిక దేవాలయాలుగా భావించాలని మన నాయకులు చెప్పారు. కాని అవి దేవాలయాలు కావనీ, కంట్రాక్టర్ల ఖజానాలనీ ప్రజలు భావిస్తున్నారు....'' చప్పట్లు! ఎడతెరిపి లేకుండా చప్పట్లు!

''కంట్రోళ్లూ, నిర్బంధాలూ, ఎక్కువవుతున్న కొద్దీ అధికారుల యొక్కా, మంత్రుల యొక్కా రాబడులు పెరుగతూండడంవల్ల, వాటిని సడలించే వుద్దేశం ఎవరికీ లేదు.....''

'హియర్'! 'హియర్'! అనే అరుపులతో చప్పట్లు!

"మద్యపాన నిషేధం ధర్మమా, అని ప్రతివీధిలోనూ ఒక 'లిక్కర్‌షాపు' వెలిసింది. 'బూట్ లెగ్గర్సంతా' వేడుకగా ప్రొహిబిషన్ వారంలో పాల్గొని దాన్ని జయప్రదం చేశారు''...... చప్పట్లు.....

''ప్రజలకు ముఖ్యావసరాలైన తిండీ ఇల్లూ, చదువూ, ఆరోగ్యం— ఈరంగాల లోనే అవినీతి విచ్చలవిడిగా విహారంచేస్తోంది. దీని నరికట్ట వలసిన బాధ్యత ఎవరిపైన వుందో, వారే దీనిని ప్రోత్సహిస్తున్నట్లు కన్పించడం విచారకరం. ఇతర దేశాలలోని ప్రజా స్వామ్యానికీ, మన దేశంలో ప్రజా స్వామ్యానికీ తేడా కన్పిస్తోంది. అక్కడ దారుణ అపరాధాలుగా పరిగణింపబడే విషయాల్ని మనం కళ్లు మూసుకుని భరిస్తున్నాం. మన మంతా వేదాంతులం. అధ్యాత్మికంగా ప్రపంచంలో అగ్రస్థానం మనదే. అందువల్ల ఈ అవినీతి విజృంభించింది. దీని నరికట్టడం కష్టం మన సంఘంలో ఇది బాగా పాతుకు పోయిన దనీ, ఇది నశించాలంటే, ప్రళయం వచ్చి, సమాజమే నశించి పోవాలని కొందరభిప్రాయ పడుతున్నారు. అయినా నశిస్తుందని నాకు నమ్మకం లేదు. ఇప్పటి కెన్ని సమాజాలూ, నాగరికతలూ, నశించి కాల గర్భంలో కలిసి పోయాయి? అంత మాత్రాన నూతన సమాజాలు, లోపరహితంగా వుంటున్నాయా? ఇది మానవ స్వభావంలో వుండే సహజ దౌర్బల్యం. దీన్ని ప్రతిఘటించడానికి అందరూ పూనుకోవాలి. సమాజంలోని విజ్ఞాన వంతులూ, ఆలోచనా పరులూ అంతా దీన్ని నిరోధించాలి.....''

ఆమె అనర్గళంగా ఒక పావుగంటసేపు ఉపన్యాసం ఇచ్చింది. ఉపన్యాసం అంద పోగానే కరతాళధ్వనుల మధ్య వచ్చి, విద్యార్థినులలో కూర్చుంది. జడ్జీల సంప్రదింపు జరిగాక, పోటీ ఫలితాల్ని వెల్లడి చేశారు. మొదటి బహుమతి_భానుమతిది. రెండవ బహుమతి, 'శ్యాంసుందర్' అనే విద్యార్థిది. విద్యార్థులు వుత్సాహంతో చప్పట్లు కొట్టారు. సభ ముగిసింది.

ఆనాటి పోటీలకు జడ్జిగా పాల్గొన అనంతరావుగారు భానుమతిని ప్రత్యేకంగా అభినందించారు. ''ఎంత చక్కగా మాట్లాడే వమ్మా!'' అన్నారు, మరి యిద్దరు విద్యార్థినులతో కలిసి వెళ్లి పోవడానికి సిద్ధంగా వున్న భానుమతి వద్దకు వెళ్లి ఆమె చిరునవ్వుతో తన కృతజ్ఞతను తెల్పుకుంది.

"నువ్వు మాట్లాడుతున్నంత సేపూ, ఒక కాలేజీ అమ్మాయి మాట్లాడు తున్నట్లు లేదు. ఏ సరోజినీ నాయుడో, విజయలక్ష్మీ పండిట్టో మాట్లాడు తున్నట్లుంది. అసలా బాణే వేరుగా వుంది. నీకొక ఉజ్వల భవిష్యత్తు ఉందనిపిస్తోంది నాకు'' అన్నారు. భానుమతి ఆనందంతో పరవశమైంది. ఆయన కేమి జవాబివ్వాలో ఆమెకు తోచ లేదు. ఆమెతో వున్న స్నేహితురాళ్లిద్దరూ కూడా ఆయన మాటలకు హర్షాన్ని వెలిబుచ్చారు.


''అసలు ఒక్క వక్తృత్వంలోనే కాదు మాస్టారూ. అన్నిట్లోనూ భానుమతి ఫస్టేనూ. సంగీతం అద్భుతంగా వచ్చు.'' అంది, రమ.

''అహా! చాలా సంతోషం!'' అని ఆయన ఆనందంతో, ''మువ్విాళ మా యింటికి రావాలి. మీరు ముగ్గురూ రండి. కారులో వెళ్దాం.'' అన్నారు.

ఆయన ఆహ్వానానికి వారు ముగ్గురూ ఒకరినొకరు చూసుకున్నారు. తక్కిన విద్యార్థినుల మొహంలోని సందిగ్ధతను కనిపెట్టి భానుమతి, "థాంక్సు మాస్టారూ మరొక సారి మీ యింటికి వస్తాను. ఈ రోజు మేము తొందరగా ఇళ్లకు వెళ్లాలి" అంది.

''అబ్బే. అలా కుదరదు. మీకు ఎక్కువ ఆలస్యం కాకుండా, మళ్లీ కారుమీదే మిమ్మల్ని మీ యిళ్ల దగ్గర దిగబెడ్తాను.'' అని, తనతో వున్న లెక్చరర్ల వద్ద సెలవు తీసుకుని, ''రండి'', అని వాళ్లను పిలిచారు. ఆయన అభిమాన పూర్వక ఆహ్వానాన్ని కాదన లేక, ఆయన ననుసరించారు భానుమతి, రమా, పద్మినీ, చిరునవ్వులతో.

అనంతరావు గారితో పరిచయం ఏర్పడిన కొద్ది రోజులలోనే భానుమతి తరుచూ వారి యింటికి వెళ్లడం ప్రారంభించింది. ఆయన యింటికి తరుచూ కొందరు విద్యార్థులూ, విద్యార్థినులూ వస్తూంటారు. వారందరితోటీ వైజ్ఞానిక చర్చలు జరుపడం, వారికి తెలియని విషయాల్ని బోధించడం ఆయనకు చాలా సరదా. ఆయన తరుచుగా పత్రికలలో వైజ్ఞానిక విషయాల మీద వ్యాసాలు రాస్తూంటారు, కొన్ని పుస్తకాలు కూడా వ్రాశారు, అదేగాక లలిత కళలంటే తగని



ఉభిమానం. వాటిలో చక్కని అభిరుచి కూడా వుంది. విద్యార్థులలో ఏ మాత్రం ప్రతిభ కన్పించినా, వారిని తన సన్నిహితులుగా చేసుకుని, వారికి తగిన ప్రోత్సాహం ఇస్తూంటారు. ఆయనకు తగినట్లే ఆయన భార్య సరస్వతికి కూడా వీరిని ప్రోత్సహించడంలో చాలా ఉత్సాహం వుంది. ఎందరెందరో ఆయన శిష్యులూ, శిష్యురాండ్రూ దూర దేశాలలో స్థిరపడినా, వీరి అభిమానాన్ని మర్చి పోలేక ఉత్తరాలు రాస్తూంటారు, దేశం వచ్చినప్పుడు వీరిని తప్పక కలుసు కుంటూంటారు. ఆయన స్వతహాగా శ్రీమంతుడు కాబట్టి కొందరు విద్యార్థులకు రహస్యంగా ధన సహాయం కూడా చేస్తూండే వారు. వారికి ఉమ ఒక్కర్తే కూతురు. ఆమెకు రెండేండ్ల క్రితమే వివాహమైంది కాని భర్తకూ ఆమెకూ అభిప్రాయభేదాలు రావడం వల్ల, ఆమె ప్రస్తుతం తండ్రి వద్దనే వుంటోంది. ఉమకూ, భానుమతికీ కూడా చక్కని స్నేహం కలిసింది. అందు వలన కూడా భానుమతికి ఆ యింట్లో చనువు ఏర్పడింది. తనకే మాత్రం తీరిక వున్నా భానుమతి, వారింటికి వెళ్ళేది.

ఆ రోజు అనంతరావు గారింట్లో ముగ్గురు విద్యార్థులూ, ఇద్దరు విద్యార్థినులూ అనేక విషయాలపై చర్చను కొనసాగిస్తున్నారు. అనంతరావుగారు ఈ చర్చను సరదాగా వింటూ మధ్య మధ్య తన అభిప్రాయాలు చెప్తున్నారు. కాలేజీలలోని విద్యా బోధన విషయమై ప్రారంభమైన ఈ చర్చ, క్రమంగా అనేక విషయాల మీదుగా దాటి చివరికి 'సమాజం', 'రాజకీయాలు', 'మతం' అన్న విషయాలదాకా వచ్చింది. "నా ఉద్దేశంలో మతమే మన దుస్థితికి మూలకారణం అంటాను. కుల తత్వాలను రెచ్చ గొట్టింది మతమే, స్త్రీలను ఉన్నత స్థితిలోకి రానీయకుండా చేసింది మతమే, మనలో కర్మ, ప్రారబ్ధం, అనే భావాలు నాటుకు పోయేట్లు చేసి, తగిన కృషి చెయ్యకుండా మనుష్యుల్ని, బద్ధకస్తులుగానూ, సోమరి పోతులుగానూ తయారు చేసింది మతమే, ప్రకృతి రహస్యాల్ని భేదించి విశ్వంలోకి మానవుడు చొచ్చుకు పోతున్న ఈ రోజులలో కూడా మన సంఘం ఈ స్థితిలో వుండడానికి

సుప్రభాతం

కారణం, మనం అనుసరిస్తున్న మతమేనూ" అన్నాడు శ్యాంసుందర్.

"అలా మనలోని లోపాలన్నిటినీ మతం మీదికి తోసేసి, ఇంక మనం చెయ్యదగింది ఏమీ లేదని కూచోడానికి కూడా, మతమే కారణ మంటారు కదూ?" అంది భానుమతి. తక్కిన వాళ్ళు నవ్వారు.

"హాఁ! తప్పకుండా, మనం ఒకస్తబ్ద స్థితికి వచ్చేశాం. ఆ పరిస్థితి ఏర్పడి రెండు వందల సంవత్సరా లయింది. అప్పటినుంచీ, ముందుకు వెళ్ళడం మానేసి, మన చుట్టూ మతం, మతం చుట్టూ మనం తిరుగుతున్నాం. మనం చేసే ప్రతి పనికీ కారణం మతమై పోయింది. అన్నం తినడం, మంచి నీళ్ళు తాగడం, బట్ట కట్టుకోవడం మొదలూ, అంటూ, మడీ, ఆచారం అనే ఆంక్షలు ప్రారంభమై, పెళ్ళి చేసుకోవడం, పిల్లల్నికనడం, పిల్లల భవిష్యత్తు నిర్ణయించడంలో కులతత్వాలు, ఛాందసత్వాలూ, సనాతన ధర్మాచారాలూ, పూర్తిగా విజృంభించి, మనల్ని మతానికి బానిసలుగా మార్చేశాయి. ఆంగ్లేయులు మనల్ని బానిసల్ని చెయ్యకముందే, మనం, మన మూఢత్వానికి, బానిసలమై పోయాం" అన్నాడు శ్యాం.

"అయితే మరి ఇప్పుడు మనం స్వతంత్రుల మయ్యాముకదా. మనలో — మత బానిసత్వం -- కూడా నశించిందంటారా?" భానుమతి అడిగింది.

"లేదు. అందువల్లనే ఇలాగున్నాం. రాజకీయంగా స్వతంత్రం వచ్చింది గాని, సాంఘికంగా మనం చాలా వెనుక బడివున్నాం. దానికి కారణం. మతానికి మన మీదగల ప్రభావమే."

"హోహో! అయితే మనం వెంటనే మతం మార్చేసుకుంటే మంచిదంటారా?" అంది భానుమతి చిన్న వెటకారంతో.

"మార్చుకోవటమే కాదు. పూర్తిగా వదిలి పెట్టెయ్యాలి."

"మరయితే ఏ మతంలో చేరదాము అంటారు?"

"ఏ మతంలోనూ చేరక్కర లేదు. అసలు మతమే లేకుండా చేస్తేసరి. ఏ యిబ్బందీ వుండదు."

"అబ్బే అదెలా కుదురుతుంది ?" పద్మిని అనే విద్యార్థిని, భానుమతి ప్రక్కన ఇంతవరకూ మౌనంగా కూర్చుని, చర్చ వింటూను. రాజారావు అనే మరొక విద్యార్థి కూడా "అబ్సర్డ్!" అన్నాడు. వీళ్ళ మాటలు వింటున్న అనంతరావుగారు చిరునవ్వు నవ్వారు.

"ఎందుకు కుదరదు?" అన్నాడు మొండిగా శ్యాంసుందర్.

"కుదురుతుందనే అనుకుందాం. అయితే అప్పుడు ప్రజలకు నమ్మకమనేదే నశించాలి కదా. మంచి, చెడులలో నమ్మకం లేని ప్రజలు నైతికంగా పతనం కారని నమ్మక మేముంది?"

"అది ప్రభుత్వం చూసుకుంటుంది. ప్రజల్ని పూర్తిగా అదుపులో పెట్టే బాధ్యత ప్రభుత్వానిదే."

"అంటే మీరు కమ్యూనిజాన్ని ఆహ్వానిస్తున్నారన్న మాట."

"కావచ్చు" అన్నాడు శ్యాంసుందర్ తప్పుకోలేక.

"అయితే రష్యా చైనాల అడుగుజాడలలో వెళ్ళాలంటారు భారతదేశం కూడా" అంది భానుమతి.

"అందులో తప్పేమీ లేదు."

"మీతో ఏకీభవించేవారు చాలా కొద్ది మంది వుంటారు, ఈ దేశంలో. కాని నేను మిమ్మల్ని ఒకటడుగ దల్చుకుంటున్నాను. ప్రపంచంలో ప్రగతిని సాధించిన దేశాలన్నీ ఈ విధానాన్నే అనుసరించాయా?"

"లేదు కాని, ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క విధానం అవసరం."

"నేను చెప్పదల్చుకున్నదీ అదే. భారత దేశానికి ఆ విధానం సరిపడదు. మనం, మతాన్ని వదులు కోవడం కల్ల" అని గట్టిగా చెప్పింది.

"అలా అయితే మనం ఎప్పటికీ పురోగమించలేం." అన్నాడు శ్యాంసుందర్ కోపంగా

"మీరే మంటారు మాష్టారూ?" అని అనంతరావుగారి నడిగారు. ఆయన, "ఊఁ. చెప్పనీ" అన్నట్లు తలూచారు.

(సశేషం)



ప్రతినిత్యం ప్రజాసేవలో (ఫొటో: ప్రభాకర్)

పెరిగిన టాక్సీ రేట్లూ- టాక్సీ డ్రయివర్ల అగచాట్లూ

ఇంటర్వ్యూ: సి. కనకాంబరరాజు

మద్రాసునగరంలో, అక్టోబరు ఒకటి నుంచి ముప్ఫయి మూడుపై శాతం టాక్సీ 'ఫేర్' పెంచేశారు. అసలే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న వత్తిడికి తట్టుకోలేక సతమతమైపోతున్న ప్రజలకు మరింత అసౌకర్యం కలిగింది. ఇదివరలో కనీసపు ఛార్జి యాభై పైసలుండేది. యిప్పుడు డెబ్బయి పైసలయ్యింది. తర్వాత కిలోమీటరు ముప్ఫయ్యేళ్లా నలభై అయింది. అంటే, మౌంట్‌రోడ్ నుంచి మైలాపూర్ వెళ్లాలంటే పూర్వం నూట నలభై పైసలయేది, ఇప్పుడు రెండు రూపాయల పది పైసలవుతూ వుంది. బేబి టాక్సీ ఛార్జి, మీడియం టాక్సీ ఛార్జి ఒకటిగా చేసేశారు. పోనీ, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ నగరాల్లోలా ముగ్గురెక్కే టాక్సీలో నలుగురు నెక్కనిస్తారా అంటే అందుకూ అమోదం లేదు. విడిభాగాలు దొరకడంలేదని, టైర్లలాంటి సామానుల ధర పెరిగిపోయిందని టాక్సీ యజమానులు మొరపెట్టుకున్న కారణంగా యీ హెచ్చింపు అమలు జరపబడిందని ప్రభుత్వం చెప్పింది. ధరల్ని అదుపులో పెట్టండి అనే ప్రభుత్వమే మార్గదర్శకం కాలేకపోతూ వుంది. చేతి రిక్షాలకీ, సైకిల్‌రిక్షాలకీ పూర్తిగా స్వస్తిచెప్పి సిటీబస్సుల పెంపకం గురించి ఆలోచిస్తామని ప్రజల కళ్లు తుడిచారు. మరో విశేషమేమిటీ అంటే ఆటోరిక్షాలను తగ్గించడం. ఆటోరిక్షాలు ఎక్కువ ప్రమాదాల్ని కలిగించడానికి కారణాలవుతున్నాయని, మరేవో కొన్ని కారణాలు చూపించి వీటిని తగ్గించడం ఉత్తమమైన పద్ధతిగా పెట్టుకుంది ప్రభుత్వం. అర్జంటుగా రైలుస్టేషనుకు పోవాలన్నా, హాస్పిటల్‌కు పోవాలన్నా, ఆఫీసుకు పోవాలన్నా మరే యితర అత్యవసర పరిస్థితుల్లోనూ తమ అవసరాలను తీర్చుకోలేకపోతున్నారు మధ్యతరగతి ప్రజలు. తక్కువ రేటుతో వున్నాయి కదా 'ఆటో' ల మీద ప్రయాణం చేద్దామనుకున్నా అవీ అందుబాట్లలో లేకుండా వున్నాయి.

ఈ హెచ్చింపును పురస్కరించుకొని టాక్సీడ్రైవర్లతో జరిపిన గోష్ఠిలో వివరాలు ఈ క్రింద యిస్తున్నాను:

సాయంత్రం ఆరుగంటలవుతుంది. చింతాద్రిపేటలో 'కూవమ్‌రివర్' పశ్చిమంగా వున్న ఆ ప్రదేశం ప్రశాంతంగా వుంది. దూరంగా వున్న మసీదు నుంచి సన్నగా 'నమాజు' వినిపిస్తోంది. ఆ యింటిని సమీపించి మేడ మెట్లెక్కి పైకి వెళ్లి తలుపు తట్టి లోపల ప్రవేశించేసరికి పదిమంది దాకా కాలక్షేపానికి చీట్లాట ఆడుకుంటున్నారు. అగది 'టాక్సీ అండ్ ఆటో వర్కర్స్ అసోసియేషన్'కు సంబంధించిన ఆఫీసు. గాంధి, లెనిన్, అన్నాదురై చిత్రపటాలతో అలంకరించబడి వుంది. నా కోసమే ఎదురు చూస్తున్న వాళ్లు మర్యాదగా లోపలికి ఆహ్వానించారు. 'ఒక్కళ్లకన్నా నలుగురి అభిప్రాయాలు మీకు చెబుదామన్న వుద్దేశ్యంతో సమావేశమయ్యాము' అన్నారు అక్కడున్న ఆ టాక్సీడ్రైవర్లు.

అందులో ఎక్కువ సర్వీసులో వుంటూ అసోసియేషన్ సెక్రటరీగాను, టాక్సీడ్రైవరుగాను పని చేస్తున్నతని పేరు శ్రీ జె. రామలింగం. భార్య, ఒకమ్మాయి, ఇద్దరబ్బాయిలు, తల్లి అతని మీద ఆధారపడి వుంటున్నారని అతను చెప్పాడు. మూడోఫారం వరకు చదువుకున్న అతను 'టాక్సీడ్రైవింగ్' వృత్తి నవలంబించే ముందు న్యూస్ ఏజెంటుగా పని చేశాడట. 'అలా పనిచేస్తూ ఈ టాక్సీడ్రైవరుగా ఎలా మారావు?' అని ప్రశ్నించినప్పుడు, డ్రైవింగ్ మీద అతనికి ఎక్కువ ఆసక్తి వున్నట్టు చెప్పాడు. రెండవది టాక్సీ డ్రైవరుగా వుండాలనే వుద్దేశంతోనే అతను డ్రైవింగ్ నేర్చుకున్నట్టు, డ్రైవింగ్ నేర్చుకుంటూనే టాక్సీ చేత బట్టినట్టు చెప్పాడు. అతను ఒక యజమాని దగ్గర పనిచేస్తున్నట్టు చెప్పలేదు. కాని, యజమానుల దగ్గర పని చేస్తున్న వాళ్లూ వున్నారు. కొందరు యువకులు 'టాక్సీడ్రైవర్స్ అండ్ ఆటో వర్కర్స్ అసోసియేషన్'గా ఏర్పడి 'మద్రాస్ టాక్సీడ్రైవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ' యాజమాన్యాన నడపబడుతున్న టాక్సీలకు డ్రైవర్లుగా వుంటున్నారు. వీరికి నెలజీతం తొంభై రూపాయలుంటుంది. పైగా ఇరవై రూపాయలకు మించిన ఆదాయం మీద రూపాయికి పదిపైసలు కమీషన్ వుంటుంది. ఇరవై రూపాయల లోపు ఆదాయం మీద ఐదు పైసల కమీషన్ వుంటుంది.

విలేఖరి ప్రశ్న: యజమానుల దగ్గర పని చేస్తున్నప్పుడు ఆదాయం ఎలా వుంటుంది?

జవాబు: నలభై రూపాయలు ఆదాయం వచ్చినప్పుడు యజమానికి ముప్ఫయి మూడు, మాకు ఏడు రూపాయిలు మిగులుతుంది.

పెరిగిన టాక్సీ రేట్లు...

ప్ర: టాక్సీ నిచ్చేముందు యజమాని సాధారణంగా విధించే నిబంధన లేమిటి?

జ: రోజూ అరవై రూపాయిలు రాబడి వుండాలి.. 'ఎంప్టీ మైలేజ్' (మీటరు లెక్క చూపని మైలేజ్) తక్కువగా వుండాలి. రాత్రి పదిగంటల్లోపులో టాక్సీ యజమానికి అప్పగించాలి.

ప్ర: అలా జరగని పక్షంలో...?

జ: ఎంప్టీమైలేజ్ ఎక్కువగా వున్నా, దినసరి ఆదాయం తక్కువగా వున్నా మర్నాడు ఆ డ్రైవరుకు అదే యజమాని దగ్గర మరోసారి టాక్సీ దొరకదు.

ప్ర: యజమానుల దగ్గర జీతాలకు వుండి టాక్సీలు తిప్పితే ఎలా వుంటుంది?

జ: అది చాలా చక్కని పద్ధతి. కాని అలాంటిది మద్రాసులోనే జరగడంలేదు.

ప్ర: యజమానులకి డ్రైవర్లకి మధ్య సుహృద్భావం ఎలా వుంటుంది?

జ: యజమానులు 'పెర్మనెంటు'గా ఒకే టాక్సీ డ్రైవరుకు టాక్సీ నిస్తూవుంటే డ్రైవర్లు నమ్మకంగా పని చేస్తారు. అసలు యజమానులే టాక్సీలను 'పెర్మనెంటు'గా వుంచుకోరు. అటువంటప్పుడు ఒకళ్ల నొకళ్లు అర్థం చేసుకోడానికి వీలే ఏర్పడడం లేదు. సామాన్యంగా యజమానులకి డ్రైవర్లకి పేచీలు వస్తూనే వుంటాయి.

ప్ర: ప్రమాదాలు జరిగినప్పుడు యజమానుల బాధ్యత ఎంతవరకూ?

జ: కారు 'డేమేజ్' అయినట్టయితే ఆపూచీ యజమానిదే. ఆయనకూ అంత కష్టం కాకుండా ఇన్సూరెన్సు వుండనే వుంది. పోతే డ్రైవరు చేసిన తప్పుకు మాత్రం శిక్ష విధింపబడుతుంది.

ప్ర: ఛార్జి పెంపుచేశారు కదా, అది మీకెంతవరకూ లాభిస్తుంది?

జ: మాకు ఈ హెచ్చింపు తీరని నష్టం సార్. దీనివల్ల లాభం పొందేదంతా యజమానులే. పూర్వంకన్నా వాళ్లకిప్పుడు పదిహేను రూపాయిలు అదనంగా దినసరి ఆదాయం లభిస్తుంది. మాకు ఒక్క నయాపైసా కూడా కలిసిరాదు. ఇదివరకయితే ఎవళ్లుబడితే వాళ్లు వెంటనే టాక్సీ ఎక్కేసేవారు. ఇప్పుడు జేబు తడుముకుంటూ పదిసార్లు ఆలోచించిగాని ఎక్కడంలేదు. దినసరి రాబడి ఎక్కువగా వుంటేనే మేమూ కలోగంజో తాగడానికి వీలవుతుంది. ఈ హెచ్చింపువల్ల జనం టాక్సీల నెక్కడం తగ్గిపోయింది. ఎక్కిన వాళ్లు దిగేప్పుడు 'రేటుకార్డు' చూపిస్తే విసుక్కుంటూ డబ్బిస్తున్నారు. ఇదివరకు దొరికే 'టిప్స్' ఇంకెక్కడ దొరుకుతుంది? ఈ హెచ్చింపు మాకన్నివిధాలా నష్టమే. పెరగకముందే ఎంతో లాభంగా వుండేది. ఎక్కువ మనుషుల్ని ఎక్కించుకోడానికి 'పర్మిషన్' యిచ్చినట్టయితే గుడ్డిలో మెల్లగా వుంటుంది.

ప్ర: ట్రాఫిక్ రూల్స్ మీద మీ అభిప్రాయం?


జ: అసలు ట్రాఫిక్ రూల్స్‌ని పాటించే వాళ్లే టాక్సీడ్రైవర్లు సార్. 'యెల్లో సిగ్నల్'ను గుర్తుంచుకునే వాళ్లను రోడ్డు మీద చూస్తే మీకే అర్థమవుతుంది. జుల్మానాలకు భయపడి మేము ఎంతో జాగ్రత్తగా నడుపుతాం. పోలీసుల్ని మంచి చేసుకోపోతే యజమానుల లోపానికి మేము శిక్షింపబడడం ఖాయం. 'టాక్సీ బోర్డు'కు బల్బుండాలి. కాని యజమానులు ఇవ్వరు. 'ఫస్ట్ ఎయిడ్ బాక్సు' వుండాలి. అదీ అంతే. 'ట్రిప్‌షీట్' తాజాగా వుంచుతూవుండాలి. ఇలాంటి వాటికి టాక్సీడ్రైవర్లు ఇరుక్కుపోతారు.

ప్ర: మీ నిజాయితీ, సత్ప్రవర్తనల వల్ల జనం సానుభూతిని సంపాయిచ్చుకోవచ్చు కదా...?

జ: మీరు అసలయిన విషయానికొచ్చారు సార్. మేమెన్నిసార్లు మొత్తుకున్నా మా పరిస్థితి నర్థం చేసుకునే వాళ్లు వేరు. పూర్తిగా టాక్సీడ్రైవర్ వృత్తిలో వున్న వాడెప్పుడు నిజాయితీగానే ప్రవర్తిస్తాడు. ఎందుకంటే అదే అతనికి జీవనోపాధి గనక. మంచిప్రవర్తనతో జనానికి సదుపాయం కలగచేద్దామనే చూస్తాడు. ఇప్పుడున్న పరిస్థితి ఎలాంటిదీ అంటే లైసెన్సున్న ప్రతి డ్రైవరూ దేన్నిబడితే దాన్ని డ్రైవింగ్ చేయవచ్చు. అలాగని 'లైట్ వెహికల్ డ్రైవరు' 'హెవీ వెహికల్' నడపడు. ఇప్పుడు బస్ డ్రైవరున్నాడనుకోండి, లేదా లారీ డ్రైవరు, మరో డ్రైవరు వీళ్లందరూ వాళ్లకు 'ఆఫ్' వున్నరోజుల్లో టాక్సీ తీసుకుంటారు. వాళ్లకా యోగ్యత వుంది. ఆ 'ఏక్‌దిన్‌కా మహారాజా' ప్రవర్తన అంతంత మాత్రంగానే వుంటుంది. అతనికి ఖాయమైన వుద్యోగం మరోటి వుండనే వుంది. అటువంటి వాళ్ల ప్రవర్తన చూసిన జనం టాక్సీ డ్రైవర్లందరి మీదా నిందలు మోపుతారు. అలా కాకుండా ఇతర నగరాల్లోలా టాక్సీ డ్రైవింగ్‌కు వేరుగా 'బేడ్జి' యిచ్చి కేటాయించినట్టయితే చక్కని సర్వీస్ చేయడానికి అవకాశం వుంటుంది. మరో ఇబ్బంది ఏమిటీ అంటే మద్రాసంటే ఏమిటో ఎరగని 'వూళ్లో' డ్రైవరు కూడా వచ్చి టాక్సీ నడుపుతాడు. ఇది గమనించినట్టయితే మా పరిస్థితి జనానికి బాగా అర్థమవుతుంది.

ప్ర: టాక్సీని కోరినపుడు ఎటువంటి పరిస్థితుల్లో మీరు నిరాకరిస్తారు?

జ: టాక్సీడ్రైవర్ల వృత్తిలో లేని వాళ్లు, ఎప్పుడు బడితే అప్పుడు నిరాకరించే పద్ధతి వుంది. వర్షం పడుతున్నప్పుడు, రాత్రుళ్లు ఎక్కువ ముట్టజెపితేగాని రానే రారు. తెలియనివాళ్లను కష్టపెట్టడం



'లీలా లేస్' సంస్థవారు తయారుచేసిన లేస్‌తో అలంకరించిన ఒక డైనింగ్ రూమ్.
ఇటీవల బొంబాయిలో వీరి ప్రదర్శన ఒకటి ఏర్పాటు చేశారు.

కూడా జరుగుతుంది. మేము అలా చేయం. మేమూ మునుపటిలా టాక్సీ నడపం గదా మాకూ టాక్సీ అవసరమైనప్పుడు మేమూ ఇలాంటి బాధలు పడుతునే వుంటాం!

ప్ర: మీ పిల్లల భవిష్యత్తు గురించి మీ భవిష్యత్తు గురించి ఎటువంటి ఆలోచన లున్నాయి?

జ: మా పిల్లలను ఏం చేసినా టాక్సీడ్రైవర్లుగా మాత్రం చేయం. వాళ్లను బాగా చదివించుకోవాలని మాకోరిక. ఇక మాగురించి అంటారా? భవిష్యత్తు గురించి ఆలోచనలే లేవు. టాక్సీ డ్రైవింగ్ లోనే ముందు ముందు రాబోయే మంచి అవకాశాల గురించి, మా మేలు జీవితం గురించి కలలుగంటూ వుంటాము.

ప్ర: సొంతంగా టాక్సీ కొనుక్కోవాలని లేదూ..?

జ: సొంతంగా టాక్సీ కొనుక్కునే స్తోమతే వుంటే మరో వ్యాపారం పెట్టు కుంటాం సార్. కాని, మా ఆదాయానికి ప్రభుత్వం మరికొంత పెట్టుబడి నిచ్చి, అంచెల వారీగా తీర్చుకునే అప్పు పద్ధతిపై టాక్సీలను అమర్చి పెడితే మా కలలు పండి నట్టే. కాని అవి మా గాలిమేడలు!

ప్ర: ఈ వృత్తి మానేసి ఏ కంపెనీలో నన్నా పని చేసుకుంటే ఎలా వుంటుంది?

జ. మరో పని కాకుండా, ఈ డ్రైవింగ్ పనికే ఎవళ్ల దగ్గరన్నా నెలజీతానికి కుదురుకోవడమే మంచిదని ఇప్పుడిప్పుడు మాకు కలుగుతోంది.

ప్ర: సాధారణంగా మీ జీవితం ఎలా నడుస్తుంది?

జ: వృత్తిలో అయితే యజమానుల బెడద, పోలీసుల భయం, 'పబ్లిక్ ట్రబుల్' ఇవన్నీ వుండనే వున్నాయి. ఇక కుటుంబం బరువు బాధ్యతలూ అంటారా మాకొచ్చే రాబ డితో ఎలా గడుపుకుంటున్నామో ఆ భగ వంతుడికే తెలియాలి!

ప్ర: ఆటోరిక్షాల మీద మీ అభిప్రాయం ఏమిటి?

జ: వాటిని పెంచితేనే మంచిది. ఇప్పటి పరిస్థితిలో మేమందరం ఆటోరిక్షాలను నడిపేందుకే సిద్ధంగా వున్నాం.

ప్ర: మీకు ఎటువంటి సదుపాయాలు కావాలనుకొంటూ వుంటారు?


జ: 'ట్రాన్స్‌పోర్టు' డ్రైవర్లకున్న అన్ని రకాల సదుపాయాలు మాకూ కలగ జెయాలి. ఒక కిలోమీటరు కన్నా తక్కువ దూరం వెళ్లినప్పుడు కనీసపు ఛార్జి చెల్లించు పైనల్లోనూ — ఆ దూరానికి పోను మిగిలింది మాకు దొరికేలా వుంటే మాకు ఎంతో సహాకరిస్తుంది. టాక్సీ డ్రైవర్ల తెగను వేరుగా కేటాయించి వాళ్ళ మాత్రమే టాక్సీలు నడిపే అర్హత వున్న వాళ్ళుగా పరిగణించాలి. టాక్సీలో కూర్చునే పరిమితి సంఖ్యను పెంచాలి. యజమాని 'బండి'ని సరైన ఆర్డరులో వుంచుతూ వుండాలి. టాక్సీ 'పార్కింగ్ స్టాండ్'లు ఎక్కువ చేయాలి. నగరాన్ని బాగా ఎరిగిన వాళ్లకే టాక్సీ డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వాలి.

ఇవన్నీ ఇతర నగరాల్లో చాలవరకు అమల్లో వున్నవంటూ రామలింగం చెప్పారు. మద్రాసులో సుమారుగా 1500 టాక్సీలు, 13000 పైన టాక్సీడ్రైవర్లు ఉన్నారు. అందులో ఏ డ్రైవరు ఎప్పుడు టాక్సీని నడుపుతాడో తెలియదు! దీనికి ఒక సక్రమ మైన పద్ధతి ఏర్పడినప్పుడే మంచి 'పబ్లిక్ సర్వీస్' చేయడానికి అవకాశం వుంటుందని అందరూ ఒక్కుమ్మడిగా చెప్పారు. స్పేర్ బస్సులు ఎలా వుంటాయో అలా వ్యాధి గ్రస్తులకి 'అంబులెన్స్ టాక్సీలు' ప్రవేశ పెడితే బాగుంటుందని సలహా యిచ్చారు.

యజమానులకు సంబంధించిన 'టాక్సీ', 'ఆటో' యజమానుల సంఘాలు రెండు, ఈ 'టాక్సీ అండ్ ఆటో వర్కర్స్ అసోసి యేషన్' ఒకటి ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థలు. ●



ఏంజల్ ఫేస్ పోటీలో మిస్ ఇండియా బిరుదు అందుకున్న కుమారి రీటా ఫరియాని శ్రీ ఎస్. కె. పాటిల్ అలంకరిస్తున్న దృశ్యం కుమారి రీటా ఫరియా మిస్ వరల్డ్‌గా కూడా ఎన్నికైంది.



తారుమారింది

సింగరాజు రామచంద్రమూర్తి

''మావగారు వచ్చారు. కాళ్లు కడుక్కో వేందుకు నీళ్లు పెట్టుకురా అమ్మాయ్'' అని కేకేసింది సరస్వతమ్మగారు కోడలిని.

''ఉదయాన్నే వచ్చారా?'' కాళ్లు కడుక్కుంటూ అడిగారాయన.

''పొద్దున్న రయిల్లో దిగాము. అబ్బాయి స్టేషన్‌కి వచ్చాడు. అయినా వాడురాక పోయినా నేనెరగని వూరు కనకనా!''

''ఇప్పుడు నువ్వు ఎరగవని ఎవరన్నారే? అమెరికా వెళ్లిరాగలవు!''

కోడలు కిసుక్కున నవ్వడం చూసి ''ఆ పాకేం పనుందిట. వూరికే వూళ్లమ్మట తిరగడం తప్పు! మహా దేశాటనం చేయించిన వాళ్లు కూడా ఇలా చెప్పు కోరు'' అంది.

రాధ గబుక్కున లోపలికి వెళ్లి పోయింది.

''ఎప్పుడు ఏమనాలో తెలియకుండా పోతోందేమిటే మీకు?''

''అంటే ఏమయిందిట? కోడలు ముందు పెద్దరికం పెరిగిందే గాని తగ్గ లేదులే!..... ఏమన్నారు వియ్యాలవారు?''

''అనేందుకేముంది...... 'ఇక్కడి ఇబ్బందులు మీరు చూస్తున్నవే కదా అక్కయ్యగారూ, పిల్లని వంటరిగా పంపక తప్ప డంలేదు. ఏమాత్రం వీలున్నా వాళ్లమ్మని మీ వెంట పంపేవాడిని' అంటూ ఇద య్యాడు వీళ్లనాన్న.''

''అరేపాపం, దానికింత బాధపడడం ఎందుకు? మనం లేమూ!''

''మనం ఉండడం వాళ్లు ఉండడం అవుతుందా? వాళ్లపిల్లని నేను సరిగా చూడకపోతే!''

నేరకపోయి ఈ ప్రస్తావన తెచ్చానను కున్నాడు రాజారావుగారు. కోడలు ఎక్కడ వినిపోతుందోనని చప్పున ''అబ్బాయి ఆఫీసుకి వెళ్లిపోయాడా?'' అన్నాడాయన.

''రాగానే నాలుగు మెతుకులు ఉడకేసి ఆవకాయ వేసి అన్నం పెట్టాను. కమ్మగా ఇంటి తిండి తిని వెళ్లాడు!''

''పోనీ ఒకరెండు రోజుల పాటు సెలవు పెట్టుమనక పోయావూ—కొత్త కాపరమూ.........''

''ఎందుకుట, ఆడవాళ్ల ఎదురుగా— మాకు పని సాగకుండా!''

''సర్లే, తెలివి తేటలకి సంతోషించాం గాని వడ్డిస్తావా? అన్నం పడేయాలా?''

భోజనం చేస్తుంటే కోడలు పుట్టింటి నుంచి తెచ్చిన వస్తువులు చూపించసాగింది ఆవిడ ''ఇదిగో ఈరెండు లప్పం ఉడకేసే గిన్నెలు, ఇవి మంచినీళ్ల గ్లాసులు'' అని నవ్వి ''మంచినీళ్లకి కాదుగాని పందుకు పనికొస్తాయి. మీలాటి వారికి ఒక గుటక్కి చాలవుట ఇందులో నీళ్లు—ఇందాక అబ్బాయి అంటున్నాడు'' అందావిడ.

''వాటికేమే, నిక్షేపంగా ఉన్నాయి. ఈ ఖరీదులు పెరిగి పోయిన రోజుల్లో కాఫీలకి చక్కగా ఉంటాయివి''

''ఖర్మ, వెనకేసుకు రావడానికి కూడా ఒక హద్దుంది. ఇవిటండీ కాఫీకి? ముఖాన కొడతారు!''

''ఎవడుట అకొట్టేవాడు. వాసుందు ముందో పెట్టు చెబుతాను. హోటళ్లలో

ఖంతికన్న ఎక్కువ ఇస్తారా? అయినా కొనిపిస్తుంటో ఎవరిదో అదృష్టం?

ఐమాత్రం ఇచ్చామని సంతోషించక!''

ఆయన వరుస ఆవిడకి ఉత్సా కరంగా లేదు.

''సర్లెండి. అదుగో మిగిలిన సారె! ఈ సామానుతో కాపరం ఎలా చేస్తారుట? అందుకనే చెప్పేను అబ్బాయితో ''సాయంత్రం అలా వెళ్ళి కావలసినవన్నీ కొని పట్టుకొకుని వస్తాను లెమ్మని.....అసలు ఇంటికి సరిపడినవి లేకుండా బంధువులు వస్తే కూడా వెతుక్కోకుండా ఇస్తారు. దేనికయినా సరదా ఉండాలి! నేనివ్వాలా అమ్మాయికీ— ఇప్పటికీ—ఒక్క గ్లాసు కూడా కొనలేదు అమ్మడు!''

''అవునే మనకు కావసినవన్నీ ఇస్తారా? వాళ్ళకు తోచినవి ఇస్తారు! అదే ఆనందంతో తీసుకోవాలిగాని నీవరస బాగాలేదు సరుసూ'' అన్నారాయన మెల్లిగా.

''అదనడం మాత్రం తెలుసు నీకు. జీవితం పొడుగునా ఇస్తారా?''

''వాళ్ళ కొనడం ఎంతబాధ్యతో మనకు తోచినవి మనబ్బాయికి మనమూ ఇవ్వాలి. తెలిసిందా''

''బుద్ధులు ఇలా ఉన్నాయి కాబట్టే జరుగుబాటు అంతమాత్రంగా ఉంది.''

''వాడికి వచ్చిన కట్నం ముందు నువ్వు నీకూతురుకిచ్చినదెంత'' అని అడుగుదామనుకుని కోడలు వినిపోతుందని ఊరుకున్నారాయన.

ఆయనగారు అలా వూళ్లోకి వెళ్ళి బంధువులని పలకరించి స్నేహితుల ఇంట్లో కాఫీలు తాగి ఇంటికి చేరుకునే సరికి అంతా హడావుడిగా ఉంది.

''నాన్నగారూ, మీరూ రండి. ఒలాబజారు వెళ్ళి ఏవో వస్తువులు కావాలంటోంది అమ్మ—కొనుక్కొద్దాం'' అన్నాడు శ్రీనివాసు.

''మీ అమ్మ హడావుడికేం గాని అస లున్నవి సరిపోతాయేమో చూడండిరా. ఏవమ్మాయ్. ఉన్నవాటితో వాడికి వండి పెట్టలేవు?'' అన్నారాయన నవ్వుతూ కోడల్ని ఉద్దేశించి.

తన్ని నేరుగా ఆయన అడిగేసరికి ఖంగారుపడి అత్తగారివంక చూసింది రాధ.

''అప్పుడే పెద్ద ఆరిందా అయిందేమిటి ఆవిడ—ఏవి కావాలో అక్కర్లేదో చెప్పేందుకు? లేకపోయినా వాళ్లనాన్న ఇచ్చిన సామాను చాలవని చెబుతుందా? నేను వెళ్లిపోయాక గవుచిప్పుగా ఒక్కొక్కటే కొనిపిస్తుంటో''

ఆయన ఏం మాట్లాడలేకపోయారు.

''ఇంకా దుప్పట్లు అవీ కూడా కావాలిటలెండి! రండి వెదడాదాం'' అన్నారు శ్రీనివాసు ఎటో చూస్తూ.

''నేను రానుగాని ఆవిడ్నే వెంటేసుకుపో. షాపులన్నీ ఇంట్లోకి పట్టేస్తుంది జాగ్రత్త. అనుభవజ్ఞుడ్ని— చెప్పకపోతే తప్పు.''

కోడలితో బాటు ఆవిడ ఒకరిక్షా ఎక్కింది. రెండోదాంట్లో శ్రీనివాసు ఎక్కాడు. బయలుదేరిపోతున్న రిక్షాలని చూస్తూ ''దీనికి గ్రహించుకునే శక్తిలేదు'' అనుకున్నా రాయన.

పీట వేసుకుని కూర్చున్నారు రాజారావు గారు. సరస్వతమ్మ కాఫీలు కలుపుతోంది.

''ఇల్లు చక్కటిది సంపాయించాడు వీడు. నలుగురు వచ్చినా బాధలేకుండా నిక్షేపంగా సరిపోతుంది......మీ నాన్న ఎప్పుడొస్తా నన్నారమ్మాయ్?''

''ఏమోనండి నేనడగలేదు'' అంది రాధ మెల్లిగా.

''మనింటికి రమ్మనిమని వాళ్ళని అడగద్దూ?.....ఏమే నీవయినా చెప్పక పోయావు?''

''అదెటూ చెప్పే ఉంటుదనుకున్నాను.''

''అప్పుడే అదెలా చెబుతుందే! పెద్ద దానివి నువ్వెందుకున్నట్టు? ఈ రోజు ఉత్తరం రాస్తానుండు. కొత్త కాపరం చూడడం అందరికీ సరదానే!''

''మీకూ ఉన్నాయన్నమాట సరదాలు. నేనిన్నాళ్ళూ లేవనుకున్నాను. సరేగాని వాడి నిలా పిలవండి, ముఖం కడుక్కొని గదిలోకి పోతున్నాడు..... అబ్బాయి శీనూ, కాఫీ తాగి పోదువుగాని రా''

కొంచెం సేపటికి టవలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చాడు శ్రీనివాసు.

''మీ మావగారికి ఉత్తరం రాయి, వీలు చూసుకుని ఒకసారి అందరినీ రమ్మనమని. వాక్కూడా కొంచెం ఖాళీ ఉంచుతే కింద నేనూ రాస్తాను'' అన్నారాయన.

''అలాగే''

''ఇవాళ ఎటువైపు పెట్టించావే వూరేగింపు?''

''అంటే?'' అర్థంకాక అడిగింది సరస్వతమ్మగారు.

''నిన్నను బట్టలకొట్లు, పాత్ర సామాను వాళ్లని ప్రోత్సహించారు. ఈరోజు ఎవరిదో అదృష్టం?''

''రోజల్లా మీకెదురుగా కూర్చుంటాను లెండి.... సరా?''

''ఉద్దేశ్యం బాగుంది గాని నేనింట్లో ఉండనే!''

''ఈరోజు గుడికి వెడదామనుందండి అమ్మ.''

''నేనిల్లు కదులుతే సహించలేరురా మీ నాన్న''

''వయస్సు పెరిగిన కొద్దీ కోపం పెరుగుతోందిరా మీ అమ్మకి. అక్కడికీ పాపం గుళ్ళూ, గోపురాలు అంటుంది కాని ఆదేముళ్లవల్ల ఏం కావడం లేదు.''

''మీరూ రండి గుడికి'' అన్నాడు శ్రీనివాసు.

''నాక్కొంచెం పనుంది—అలా వెళ్ళి వస్తాను. ఈరోజు శలవు పెట్టావా?''

మాట్లాడ కుండా తల్లివంక చూశాడు అతను.

''ఎందుకూ? ఇక్కడేగా—ఒక్క అర గంటలో వచ్చేయమూ?'' అందావిడ.

రాజారావుగారు గబుక్కున లేచి వరండాలోకి వెళ్లిపోయారు.

''అబ్బాయ్, నీకు నీళ్ళు తోడేను న్నాను. నువ్వు పోసుకుంటే మేం కూడ చకచక కానిస్తాము'' అంటోంది ఆవిడ కొడుకుతో.

ఆ మాటలు విని ''తన ముచ్చట తప్ప వీడి ముచ్చట చూడదుకదా!'' అనుకుని నవ్వుకున్నారాయన.

క్రితం రోజు లాగానే ఆడవాళ్లిద్దరూ ఒకరిక్షా శ్రీనివాసు ఒక రిక్షాలో బయలుదేరి అరగంటలో అదేపద్ధతిలో తిరిగి వచ్చేశారు.

''దీనికి చెప్పవలసిందే ఇంక'' అని నిశ్చయించుకున్నారాయన.

మధ్యాహ్నం ఆయన వరండాలో కూర్చుని ఉంటే సరస్వతమ్మగారు పక్కన చేరింది.

''ఏదో చెప్పబోయేదానిలా ముఖం పెడుతున్నావు ఏమిటి విశేషం'' అన్నారాయన సిగిరెట్టు పొగ రింగురింగులుగా వదులుతూ. ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

''ఎలా ఉంది నీ కొడుకు కొత్తకాపరం?'' అన్నారాయన మళ్ళీ ఉత్సాహంగా.

''కాపరాలకేం బాగానే ఉంటాయి. మనుష్యులే మారతారు కాని!''

''ఎవరూ మారింది ఏమాకథ?''

''ఇంకెవరూ—మీ పుత్రరత్నం''

“ఇదివరకటిలా లేదంటావ్”

“మీ కన్నీ వేళాకోళాలు వెక్కిరింతాను. లేకపోతే ఇదివరకు శలవలకొచ్చినప్పుడు ఇడ్లీలు చేస్తానంటే ‘నేను తినను. చేశావో పారేస్తాను’ అనేవాడు కదూ”

“అనడం ఏమిటే తినక భీష్మించుకున్న రోజులు లేవూ?”

ఆవిడకి ఉత్సాహం పుంజుకుంది.“ అప్పుడా అటువంటివాడు నిన్నను ఇడ్లీలు వేయమని దానితో చెప్పివెళ్ళాడు. అదేమిటిరా తినే వాడివి కాదుగా”అని అడిగాను. “నాకెప్పుడూ అవి ఇష్టమే కదమ్మా!” అన్నాడు పైగా.

“అన్నయ్యా, నాన్నగారుకూడా ఊరునుంచి వచ్చినప్పుడల్లా ఇడ్లీలే వేయిస్తారు. ఇష్టమని” అంది ఆవిడ నవ్వుతూ..... ఏమిటి చెప్పండి ఈ నాటకం. నా చేత్తో చేసినవయితే తినడు! ఇప్పుడు”

“ఓస్, కట్. దీనివెనక వున్న ఫిలాసఫీ చెబుతానాగు సరుసూ. ‘ఇడ్లీ’ అన్నది అందానికి శ్రమతో కూడుకున్న అల్పాహారం అన్న విషయం ఒప్పుకుంటావా? అసహ్యేసే వాడు చాలా సార్లు అనేవాడు! “చేసేవాళ్ళకి ఒళ్ళు హూనం అయిపోతుంది గాని తినేవాళ్ళకేం ఎన్నయినా పట్టించగలం” అని. కనుక అప్పట్లో నువ్వు ఒక్కదానివి అంత శ్రమ పడడం ఇష్టం లేదు వాడికి. అలా అంటే నువ్వు వినవు. పైగా కోడలు పిల్ల చిన్నది. కాబట్టి ఇబ్బనత్తువ కొద్దీ రుబ్బ కలదు”.

“ఏమో ప్రతిదానికీ టీకా తాత్పర్యం చెబుతారు మీరు. నేనేపని చేయబోయినా ఎందుకమ్మా అది చేస్తుందిగా అంటాడు వాడు..... ఎప్పుడు వెళ్ళిపోదాం?”

“అప్పుడే మొహం మొత్తిందా—ఎల్లుండి ఉదయం.”

సాయంత్రం శ్రీనివాసు రావడమే ఇద్దరు స్నేహితుల్ని వెంట బెట్టుకొని వచ్చాడు. వాళ్ళని హాల్లో కూర్చో బెట్టి లోపలికి వెళ్ళి “కాఫీ కావాలి కాఫీ, స్నేహితు లొచ్చారు” అన్నాడు రాధతో.

ఆ అమ్మాయి మాట్లాడక ముందే “నువ్వెళ్ళి మాట్లాడుతూండువాయనా నిముషంలో కాస్తాను.”అంది సరస్వతమ్మగారు.

రాజారావుగారు గదిలో [illegible] చదువుతుంటున్నారు.

కాఫీలు [illegible] వచ్చాక వెళ్ళిని చూసి [illegible] [illegible] ఆగి “మా

తెరవాలిరింది

మదర్. వీరు తెలుసుకదమ్మా నీకు! చెల్లాయి స్నేహితురాలు సువర్చల లేదూ—వాళ్ళ అన్నయ్య ప్రభాకర్”

“నమస్కారమండీ. ఎప్పుడు వచ్చారు?”

“నిన్న వచ్చాం నాయనా. కోడల్ని తీసుకు వచ్చాను. నీకామధ్య పెళ్ళయింది కదూ! సువర్చల మద్రాసులోనే ఉందిట. మొన్న పెళ్ళయినప్పుడు చూద్దాం అను కున్నాను గాని పడింది కాదు. దానికి పిల్లలా?”

“ఇద్దరాడపిల్లలండీ.”

“బాగుందినాయనా మరి ఆవిడ్నికూడా తీసుకురాకపోయావు?”

“అదే చెప్పానండీ వీడితో, వచ్చే ఆది వారం కలిసి వస్తానురా అంటే వినలేదు.”

“మంచినీళ్ళు కావాలమ్మా” అన్నాడు శ్రీనివాసు.

“పట్టుకొస్తానుండు” అంటూ లోపలికి, వెళ్ళింది ఆవిడ. శ్రీనివాసు ప్రభాకర్ వంక చూశాడు. ఇద్దరూ నవ్వేశారు.

గదిలో కూర్చుని ఈతతంగం చూస్తున్న రాజారావుగారు కూడా నవ్వుకున్నారు.

సినిమాకు వెడదామన్న కొడుకు ప్రతి పాదనని తోసిపుచ్చారు ఆయన “ఏడిశావులే ఈరోజు రెస్టు తీసుకోండి రేపువెడదాం” అని.

భోజనాలయాక ఆరుబయట మంచం మీద పడుకున్న రాజారావుగారు భార్యని పిలిచారు.

“సరస్వతీ ఇలా రా నీతో మాట్లాడాలి” అని.

పక్కన మరోమంచం వాల్చుకొని కూర్చుంది ఆవిడ. “చెప్పండి”

“పడుకున్నారా పిల్లలు?”

“ఆ”

కొంచెంసేపు మాట్లాడ కుండా పడుకుని గభాలున లేచి కూర్చున్నా రాయన “నేను కొన్ని విషయాలు చెబుతాను. ఓపిగ్గా విని వాటిగురించి సరిగ్గా ఆలోచించు.....”

“వీళ్ళది కొత్తకాపరం—అవునంటావా?”

“కాదని ఎవరన్నారు?”

తను మొదలెట్టిన పద్ధతి ఆయనకే నచ్చినట్లుంది. కొంచెంసేపాగి “ఒక వయస్సు వచ్చాక బంధుత్వాలు ఎలా వుండాలో తెలుసా నేను నీకన్నా పెద్ద

నన్ను [illegible] అన్నా దృష్టికన్నా “స్నేహితులం” అన్నదృష్టిని పెంపొందించాలి. అప్పుడు భయ భక్తుల బదులు ప్రేమ. చనువు కలుగు తాయి. అటువంటప్పుడు జీవితం సుఖంగా ఉంటుంది. లేకపోతే మొదట ఆ పరిస్థితికి సమాధానపడడం కష్టం అనుకో” అన్నారు.

“దేనికి ఈ ఉపోద్ఘాతము అంతా?”

“నిన్ను గురించే. వాళ్ళు కొత్త దంపతులు వాళ్ళకేం కోరికలుంటాయో మన గతాన్ని గుర్తు చేసుకొని గ్రహించుకోవాలి. దీని కనుగుణంగా మనం ప్రవర్తించాలి.”

“నేనెలా ప్రవర్తించానేమిటి?”

“కరెక్ట్ ఇప్పుడు టాపిక్‌లోకి వచ్చాం. ఎక్కడికయినా వెడుతున్నప్పుడు రిక్షాలో నువ్వు కోడలి ప్రక్కన కూర్చునేకన్నా దాన్ని వాడిప్రక్కన కూర్చోపెట్టు, వాళ్ళ ప్రయాణం ఎంత సరదాగా ఉంటుందంటావు? వీళ్ళు నువ్వు లేచేకన్నా వాడు స్నానం చేసేదాకా టవలు పుచ్చుకొని దాన్ని పంపేమను అక్కడ. అన్నం వాళ్ళని కలిసితినమను. వాడిస్నేహితులకి కాఫీ దాంతో పంపు.. సాధ్యమయినంత వరకు వాడి పనులు దానిచేతే చేయించు.”

“అయితే నేను!......”

“ఆగు సరుసూ నేను చెప్పేదిపూర్తిగా విని మాట్లాడు. నువ్వు కొత్తగా కాపరానికి వచ్చినప్పుడు నీకు ఎటువంటి వూహలుండేవో ఒక్కసారి గుర్తు చేసుకో. అప్పట్లో మనపెద్దవాళ్ళు అవి తీరకుండా చేశారు. అది మనకెంత కష్టం కలిగించిందంటావు? ఆమొదటి రోజుల్లోనే ఆ కోరికలన్నీనూ. ఇప్పుడు అవకాశాలు ఉంటే మాత్రం లాభం ఏమి టుంటావు?

“మనకి మన పెద్దవాళ్ళు అవకాశాలు ఇవ్వలేదు. కాని మనం ఆ అనుభవం మీద, ఇప్పుడు వీళ్ళకి కలిపించవచ్చుగా. చరిత్ర చర్విత చరణం కాకూడదు సరస్వతీ, ఎవరో ఒక్కరు కొత్త బాట తొక్కితే ముందు తరాలవాళ్ళు సుఖపడతారు. ప్రతిదానికి నిన్ను ఆ పరిస్థితుల్లో వూహించుకుంటుండు.”

ఆవిడ మాట్లాడకుండా వింటోంది ఆవిడ ముఖంలోకి పరికించి చూసి నవ్వా రాయన.

“ఎందుకు నవ్వుతారు?”

“నీకు తెలుసు. ప్రతి ఆడదానికి అటు

భర్తమీద, ఇటు పిల్లలమీద కూడా అధికారం చలాయించాలని వాళ్ళ ప్రేమకి తామొక్కరే వారసులవాలనీ ఉంటుంది. దాన్ని వారు మరొకరితో పంచుకోలేరు. కాని నీభర్త ప్రేమ నీ కొక్కదానికే దక్కా లని అనుకున్నట్టే నీకోడలూ అనుకుం టుంది. అది గుర్తుంచుకోవాలి. మన బాధ్యత పిల్లల్ని పెంచడం వరకు. అప్పుడు వాళ్ళని వాళ్ళ తరం వాళ్ళకి అప్పచెప్పాలి అంటే 'షిఫ్ట్' మారుతుందన్నమాట." "వీళ్ళప్పుడు వెడతారు. మనం చిలకా గోరింకల్లా ఉండచ్చు" అన్న భావన వాళ్ళకి దానీయకుండా మనం ఉండగానే వాళ్ళనలా ఉండేట్లు చేస్తే మన తంటికి ఆనందంగా ఉంటుంది.

"ఆడదానికి ఆడదే శత్రువన్నారు తెలుసా! కాని అది మనింట్లో నిజం కాకూడదు. అదీ చిన్నపిల్ల, నీకూతురు తప్పులుచేస్తే క్షమించినట్లు దీన్ని చూసుకో. అప్పుడు నీకిది మరో కూతురవుతుంది." అని ఆవరించి "చాలా పెద్దవిషయాలు చెప్పాను, ఇవి శాంతియుత సహజీవనానికి చిట్కాలు. నీకు గుర్తుందో లేదో శ్రీనివాసు కారు క్రింద పడ్డప్పుడు....."

ఆయన గుర్తు చేయకుండానే ఆవిడ కంతా గుర్తు కొచ్చింది.

'అప్పట్లో ఆయన అక్కగారింట్లో ఉండేవారు, తనకి కొత్త కాబట్టి చేదోడు వాదోడుగా ఉంటుందని. మొదట తనకది బాగానే ఉన్నా రానురాను ఆవిడ పెత్తనం చెలాయిస్తున్నట్లు బాధపడ సాగింది తను.


ఆయన గురించి తనకేమీ తెలియ నట్లుగా ఆవిడ మాట్లాడుతుంటే ఒళ్ళు మండేది తనకి. ఫలానా కూర ఆయన కిష్టం అని తనంటే ఏదోపెద్ద వింత విన్నట్లుగా "భలేదానివి చిన్నప్పటి నుంచి వాడికది అసహ్యం" అని ఫక్కున నవ్వేసేది. పోనీ ఈయనగారు కూడా ఏటూ చెప్పేవారు కాదు.

ఇలా ప్రతి విషయంలో తన తమ్ముడు తన చేతిలోనే ఉన్నట్లు ఆవిడ మాట్లాడు తుంటే సహించ లేక ఏవో సాకులు పెట్టి వేరే ఇల్లు తీసుకునేట్లు చేసింది తను. ఏ వేళనున్నారో తను చెప్పగానే విన్నారాయన. తరువాత కొన్నాళ్ళకి తనకి శ్రీనివాస్ పుట్టాడు. మళ్ళీ వీడితో పెద్ద భాగవతం టయింది.

ఈ వెధవ మిలిటరీ కారు కింద పడ్డాడు ఒకసారి. తను హడలి పోయింది. ఉన్నది ఒక్క నలుసు, కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చునేది వీడి దగ్గర. వీడికి ఒక స్నేహితు రాలు ఉండేది సరళ అని పదేళ్ళది. అది కూడా పెద్ద ఆరిందాలాగా వీడి దగ్గరే కూర్చుని మందులు పడుతుండేది. తన చేత్తో తాగనని మొరాయించినప్పుడు అదిస్తే తాగేసే వాడు. తనకి వళ్ళు మండేది. తన వూసే పట్టకుండా దాంతో కబుర్లు చెబుతూండే వాడు. అది లేకపోతే దాని కోసం కలవరించేవాడు.

రాను రాను తను సహించలేక పోయింది. ఆ సరళని రాకుండా చేసింది. ఒక రోజున అది రాందే మందు తాగనన్నాడు. తనతో తాగి తీరాలిసిందే నంది. వాడు ఏడుపు ఆ పిల్లకోసం. ఇదంతా చూసిన ఆయన వెళ్ళి దాన్ని తీసుకొచ్చారు. దాన్ని చూస్తూ వాడు మందు తాగుతుంటే చూడలేక తను చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చే సింది.'

"లోకరీతే అంత సరుస్నా, అక్కయ్యా నన్ను నీ చేతిలో పెట్టలేక పోయింది. కొన్ని రాలు విడిపోయాయి. నువ్వు నీ కొడుకు ప్రేమని సరళతో పంచుకోలేక పోయావు. అంతేగాని వాళ్ళింకా చిన్న పిల్లలన్న



గుర్తింపు కూడా నీకు లేకపోయింది. చిత్రంగా లేదూ!''

నవ్వింది సరస్వతమ్మ. అలాగే పడుకుంది. వెంటనే ప్రశాంతంగా నిద్రపోయింది....

ముఖం తుడుచుకుంటూ బయటికి రాబోతున్న కొడుకుని ''అమ్మాయి పట్టు కొస్తుంది లే కాఫీ, పేపరు చదువుకుంటూ కూర్చో. రాధా, వాడికి కాఫీ తీసుకెళ్ళు'' అంది సరస్వతమ్మ పొద్దున్న కాఫీల దగ్గర.

ఒక క్షణం ఆవిడవంక చూసి కాఫీ పుచ్చుకుని గదిలోకి వెళ్ళింది రాధ.

రాజారావుగారు తృప్తిగా ఆవిడ ముఖం లోకి చూశారు. కాని, ఆవిడ పట్టించుకో లేదు.

కొంచెం సేపటికి—

''స్నానం చేయాలమ్మా'' అన్న కొడుకు మాటవిని ''నన్నడుగుతా వేంరా? అమ్మాయ్, చూడు వీడి విషయం. నేను మడి కట్టు కుంటాను చప్పున'' అంది.

రాజారావు గారు పేపరు చాటున నవ్వు కున్నారు.

''నువ్వు కూడా కంచం పెట్టుకోవే అమ్మాయి, ఇద్దరికీ వడ్డించేస్తాను.''

''నేను మీతో భోంచేస్తా లెండత్తయ్యా''

''నాతో పెట్టుకుంటే ఎలా, నాకు మడీ దడీ! చిన్న పిల్లలు పెద్ద వాళ్ళతో వంతు వేసుకోకూడదు. నాకూ, ముసలాయ నకి నువ్వు వడ్డిద్దువు గాని''

ఫక్కున నవ్వింది రాధ.

''ఎందుకే నవ్వుతావు?''

రాజారావుగారు గబగబ లోపలికి వచ్చారు. ''నవ్వదూ మువ్వన్న మాటకి? నేను నీకంటికి ముసలాడనా? నేను తాతనయిన రోజున నువ్వో బామ్మవవుతావు గుర్తుంచుకో.''

ఆయనకి ఇంటి వాతావరణం బాగుంది.

ఆఫీసుకి వెడుతున్న కొడుకుని గుమ్మంలో పట్టుకుని ''ఒరేయ్ అబ్బాయి, మధ్యాహ్నం శలవు పెట్టి ఇంటికి వచ్చేయ్. సాయంత్రం సినిమాకి వెడదాం'' అంది సరస్వతమ్మగారు.

శ్రీనివాసు రాధ ముఖంలోకి చూశాడు. సిగ్గుపడినట్లుగా తలవంచుకుంది ఆ అమ్మాయి.....

''పదండమ్మా టయిమయి పోయింది తెమలాలి. రిక్షాలు కేకేయనా?''

''బహువచనం దేనికి? ఒక్క రిక్షాపిలు''

''అదేమిటి?''

''అవునుర్రా, మీ ఇద్దరికీ రెండు కావాలా ఏమిటి?''

తరంమారింది

''నువ్వు చూడవా?''

''చూడనని ఎవరన్నారు. మాట్లాడ కుండా రిక్షా పిలు. రాధా ఊఁ తెమలాలి.''

వాళ్లిద్దరూ రిక్షా ఎక్కి వెళ్ళిపోతుంటే అటే చూస్తూ ''కొత్త పాత్ర బాగానే అభినయిస్తున్నావు సరస్వతీ. కొద్దిరోజుల్లో అలవాటయి పోతుంది'' అన్నారు రాజారావు గారు.

''అభినయించడం ఏమిటండీ... నిజంగా నా మనస్సుకి ఇప్పుడు హాయిగా ఉంది. తాళం వేసి వస్తాను. మనకో రిక్షా పిలవండి''

''ఆ!''

ఇంగ్లీషు సినిమా చూసి కొంచెం ముందొచ్చిన చిన్న జోడీ ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి ఆశ్చర్య పడ్డారు.

''ఎక్కడికి వెళ్లారు చెప్మా'' అన్నాడు శ్రీనివాసు.

''సినిమాకేమో. అందుకే డూప్లికేటు తాళం చెవులు నాకిచ్చారు'' నవ్వింది రాధ.

వీళ్ళు భోజనం చేసేంతలో లోపలికి వస్తూ ''........'' కి వెళ్లామురా ఎంత బావుందని! కమ్మటి పాటలు, అచ్చం శ్రీ కృష్ణపరమాత్ముని చూస్తున్నట్లే ఉంది'' అంది సరస్వతమ్మ.

రాధ, శ్రీనివాసు ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు.

''ముసి ముసి నవ్వులేం నవ్వుతావే పిల్లా పెద్దగానే నవ్వు!.... లేకపోతే మీరు వెళ్లే సినిమాలు మాకేం బాగుంటాయే?''

భోజనం చేసి బయటికి వచ్చిన రాజారావు గారికి వరండాలో మంచాలగుపడక పోవడంతో ఆశ్చర్యంతో లోపలికి వచ్చి ''అవునే, అమ్మాయిని మంచాలు వేయమను'' అన్నారు.

ఆవిడ నవ్వి గది వైపుకి చేత్తో చూపించింది. అటు చూశారు. కొడుకు పడుకునే గది వేసి ఉంది. దాని పక్క గదిలో రెండు మంచాలు వేసి తెల్లటి దుప్పట్లు పరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూశారు. అగరొత్తులు కూడా వెలిగించి ఉండడంతో గబగబ వెనక్కి వచ్చి ''నీ ఏర్పాట్లా ఇవన్నీ?'' అన్నారు నవ్వుతూ.

''కొడుకునీ, కోడలు పిల్లనీ అడగండి''

* * *

రైలు వచ్చేందుకు ఇంకా కొంచెం టైముంది. ముగ్గురి ముఖాల్లో దిగులు చదువుకున్న రాజారావుగారు ''ఒరేయ్ అబ్బాయి, ఇటురా'' అంటూ కొడుకుని కొంచెం అసింటా తీసుకెళ్లి ''అది చిన్న పిల్ల. కొత్త కాపరం! దాని కేమయినా సరదాలుంటాయి. రోజూ బజారు నుంచి ఏదోవకటి తెచ్చి పెడుతూండు—— చేసుకోవడం ఇంకా చాతకాదు కదూ!.... కసురుకోకు. సర్దుకు పోవాలి.

''మీ అమ్మ ఏమయినా తొందరగా మాట్లాడి ఉంటుంది. పట్టించుకోకు. దాని తత్వం నువ్వెరగంది కాదు'' అన్నారు.

''భలేవారు నాన్నగారు, అమ్మ వెళ్లి పోతోందని ఇప్పుడు దానికి ఎక్కడలేని దిగులూ పట్టుకుంది. 'మా అమ్మని మించిపోయారు అత్తయ్య' అంటోంది''

''సర్లే అమ్మని పొగడడానికేం గాని ఈ రెండు వందలూ ఉంచుకో అవసరానికి. కావాలంటే రాయి, పంపుతాను. ఇకపద.''

సరిగా అదే సమయానికి ''అమ్మాయి వాడు కొంచెం దురుసు మనిషి. వాడు నా పోలికట— అంటుంటారు మీ మావ గారు. జాగ్రత్త.''

''మీ పోలికయితే నేను చాలా అదృష్ట వంతురాల్నిఅత్తయ్యా'' అంది నిండుగా రాధ.

కళ్లల్లో నీళ్లు తిరిగాయి సరస్వతమ్మ గారికి. ''పిచ్చి పిల్ల, అసలు వెళ్లకనే పోదును ఈ రోజు. ఆయన మొండి పట్టు పడుతున్నారు. సరేగాని, ఈ ఏభయి నీదగ్గర ఉంచుకో. వాడి దగ్గర నుంచి కూడా తీసు కుంటూ నాలుగు రాళ్లు దాచుకో. పిల్లా జల్లా పుడితే ఉంటుంది''

సిగ్గుపడి తల వంచుకుంది రాధ.

రైల్లో అంది సరస్వతమ్మగారు కళ్ళు తుడుచుకుంటూ ''ఇంకో రెండు రోజులుండాలని ఉంది నాకు— పడనిచ్చారు కాదు. అమ్మాయి కూడా గోల పెట్టింది. అప్పుడే వెళ్లకండి అని''

''అక్కడనే ఉంది సరస్వతీ అందం! మంచి వాతావరణం ఉన్నప్పుడు వెళ్లి పోవాలి. మళ్లా వీళ్లెప్పుడు వస్తారా అని వాళ్ళు, ఎప్పుడు వెడదామా అని మనం ఎదురు చూస్తుంటాము. ఆ నిరీక్షణలో అందం ఉంది. ఆత్మీయత పెరుగుతుంది.''

''పిచ్చి పిల్లలు, ఇద్దరూ కళ్ల నీళ్లు పెట్టుకున్నారు నేను వెళ్లిపోతున్నందుకు.''

మనస్సులోనే వాళ్ల కడుపున నాలుగు కాయలు కాయాలని ఆవిడ ఆశీర్వదిస్తోందని తెలుసును ఆయనకి.


అందుకే నవ్వుకున్నారు.

వైజ్ఞానిక గాథావళి. 84

— డాక్టర్.

హిస్టాలజీ కథ

— బిభూతి —



1793 వ సంవత్సరము. పారిస్ నగరములో డిసోల్ట్ (సర్జన్)గారి బోధనశాల. ఆయన పాఠము అయిన తర్వాత విద్యార్థులలో ఒకరిని ఎంచి ఆ పాఠ సారాంశాన్ని గురించి మొత్తం క్లాసుముందు చెప్పమని ఆయన సహోపాధ్యాయుడు కుర్చీ మీద కూర్చుని పర్యవేక్షణ చేసే క్లాసు. 'కాలరు ఎముక విరిగే తీరులు' అన్నది విషయము. క్లాసు అంతా తయారై పోయింది, సహోపాధ్యాయుడు ఆనాడు 'మాట్లాడవలసిన విద్యార్థి వచ్చి ప్రారంభించ వచ్చు' అన్నాడు. చిత్రము. ఎవరూ లేవలేదు. ఆయన గారు మొహము చూశాడు. ఆసంగతి తెలగానె ఆక్లాసులోని స్పెషియల్ బిఛాట్ 'నేను చెప్తా' అని లేచాడు.

బిఛాట్ తండ్రి వైద్యుడు. బిఛాట్ లయన్సులో వైద్యము చదివి, ఫ్రెంచి విప్లవపు కల్లోలాలలో నానా అవస్థలూ పడ్డాడు. విప్లవకారుల అరాజకపు టల్లరులలో నలుగు నలిగి, చివరికి పారిస్ చేరుకొని పియురీ జోసెఫ్ డిసోల్ట్ దగ్గర చేరేడు.

అతని అప్పటి వయస్సు 22. ప్రొఫెసర్ డిసోల్ట్ క్లాసులో లెక్చెరు చెప్పిన తర్వాత క్లాసులోని ఒక విద్యార్థిని ఎంచి, ఆలెక్చెరునే సంగ్రహంగా చెప్ప మనడమూ, ప్రొఫెసరు కాక సహోపాధ్యాయుడు అధ్యక్షత వహించడమూ మామూలు. ఒకనాడు మాట్లాడవలసిన విద్యార్థి రాలేదు. అది తెలగానె బిఛాట్ 'నేను చెప్తా' నని లేచాడు. విద్యార్థి ఎందుకు రాలేదో విద్యార్థులకు తెలుసు. బిఛాట్ చేరి నెలరోజులు మాత్రమే అయింది.

హాజరుకాని విద్యార్థి ఎందుకు రాలేదో విద్యార్థు లందరికీ తెలుసు. బిఛాట్ "నేను చెప్తా" ననగానే కిచ కిచలతో కొంత కల కలము బయలు దేరింది. బిఛాట్ ప్రారంభించి నాలుగు వాక్యాలు చెప్పే సరికి సద్దణిగి పోయింది. బిఛాట్ ముగించేవరకు మెదలకుండా కూర్చున్నారు. అతడు ముగించిన కొంత సేపటికి హోరుమని జయజయ ధ్వానాలు చేశారు. విద్యార్థి మాట్లాడినట్లు లేదు. అతని లెక్చెరు, ప్రొఫెసరు మాట్లాడినట్లుంది. డిసోల్ట్ ఈసంగతి విని, బిఛాట్ పిలిచి మాట్లాడేడు. అంత వరకూ ఈయన గారు క్లాసులో వున్నట్లే తెలీదు ప్రొఫెసరుకి. అతనితో మాట్లాడి తనకి అసిస్టెంటుగా వేసుకున్నాడు ప్రొఫెసరు.

కువియరు ఏనాడైతే ప్రత్యేకతను నిరూపించ డానికి యత్నించి జంతుజాలపు అంగాంగ పరిశోధనా పోలికా చేశాడు. ఈ బాహ్య పరిశోధన అంగనిర్మాణము చేసే టిష్యూ పొరల పరిశోధనకి చేర్చాడు. బిఛాట్. తాను రోగుల కురుపులను, నెత్తురు పుండ్లనూ చూచినప్పుడు అంగముపైనా గాయాలు ఒకేరీతిగా ఉన్నట్లు గుర్తించాడు బిఛాట్. అంగముల పొరల టిష్యూలూ ఒకలాగేవున్నాయా? అన్న సమస్య కలిగింది. గాయము అంటే ఈ పొరలు దెబ్బ తినడమేనా? ఈప్రశ్నకు జవాబు ఏగ్రంథము లోనూ దొరకలేదు. తానే పరిశోధించడానికి పూను కుని తనకున్న అతికొద్ది విరామాన్ని దేహములోని వివిధాంగముల పొరల గుణాలు పరిశీలించడానికి ఉపయోగించాడు. వెచ్చబెట్టడమూ. ఆరబెట్టడమూ, నానబెట్టడమూ, ద్రావణాలతో క్షారాలతో కడగడమూ, ఉప్పునీళ్లలో పెట్టడము అన్నీ చేసి ఏ అంగపు పొర ఏమే మవుతుందో పరిశోధించాడు. అయితే, మైక్రోస్కోపుని మాత్రము ఉపయోగించలేదు.

కువియరు మొత్తపు అంగములను పోల్చి పరిశీలించాడు, ష్వాన్, ష్లీడెన్ జీవకణాల ఉనికి కని చెప్పేరు. బిఛాట్ వాటిమధ్య స్థితిని ఎందుకు పట్టేడూ? అన్న వింత-ప్రశ్న పుట్టుతుందిగాని, 'గాయమన్నది అంగాల సమరూప పొరలు దెబ్బతిన డమేనా?' అన్న ప్రశ్నను తీర్చడానికే అతని పరిశోధన అప్పుడు దాని బరువు జరుగుతుంది. చాలా వాటా చెప్పేడు అంగాల టిష్యూ పొరల రకాల్ని బిఛాట్. జీవకణాల పొరలు జంతువుల నరాలు ధమనులూ, సిరలూ, ఎముకలూ, కండరాలూ, మజ్జ, చర్మము ఇలా ఇలా భేదాలు చెప్పేడు. ఇవన్నీ నూతన శరీర నిర్మాణాన్ని చెప్పే పొరలు. జీవకణాలు చెప్తే ఏం భేదాలు చెప్తే ఏముంటుంటా? అంగాలు చేసే పనులను వాటి చేత నిర్వహింప జేసే నిర్మాణము ఏమిటి? ఆనిర్మాణ విభేదాలేమిటి? అంగముల పనులను మాత్రము కాదు. మనము గుర్తించవలసినది. ఆపనులను వాటిచేత చేయించే నిర్మాణమును కూడా—అంటే ఆపనుల కారకములను కూడా—పరిశీలించాలి. రసాయనిక మూలకాలు చేరి సంయోగాలు ఏర్పడిన విధంగా టిష్యూలు చేరి అంగము లవుతున్నాయి. 'రసాయనిక సంయోగములో చేరిన మూలకాలు స్వభావ వికృతి పొందని విధంగానె అంగములుగ కూడిన టిష్యూలు స్వభావములో మారవు. అదే టిష్యూ పొరగా ఏర్పడవచ్చునూ, చిన్న నాళము కావచ్చునూ, తీగెలుగా ఏర్పడ వచ్చును. కంటి రెటీనా పొరలోని టిష్యూ (ఆల్గిక) యే నరాలలో కనబడుతున్నది. ఈరీతిగా రూపము మారినా దాని స్వభావము మారదు.

అయితే ఇందాకా చెప్పిన వేర్వేరు రకాల యొక్క పనిముట్లకు వేరు. ప్రతీదీ దానికి కావలసినదానిని నెత్తురు నుంచి తీసుకుంటుంది. ఊటలూరడము, పీల్చుకోడమూ ఆహారము సేకరించడమూ, దేనికది దాని ప్రత్యేక పద్ధతిలో చేసుకుంటుంది. అంటే భూమిమీద కనబడే రసాయనిక పదార్థాలు—ఆక్సైడ్లు, సల్ఫేటులూ, కార్బనేటులూ వంటి వాటిని వాటిలోని మూల పదార్థాలచేత కలుగ చూచుకున్నట్లే జంతువుల అంగములను ఇందాకా చెప్పిన టిష్యూలవల్ల నిర్మించబడినవిగా చూసుకోవాలి. ప్రాణి ఏదయినా కండరపు పొరలదాకా— ఇత్యాది టిష్యూల రకాలు ఒకలాగే ఉంటున్నాయి. జంతువుల అంగాల భేదము కువియరు స్థూలంగా చెప్పినట్టిది—వాటి అంగాలను నిర్మించిన టిష్యూలలో చూడాలన్నమాట. మరొక లాగ చెప్పినట్లయితే, జీర్ణకోశము, లివరు లాంటి అంగముల ప్రత్యేకతను చక్కగా గుర్తించాలంటే వాటిని మొత్తంగా కాదు చూడడము వాటిలోని వేర్వేరు టిష్యూల భేదాల్ని గుణాల్ని చూసుకోవాలి. ఒక అంగము లోని తక్కిన టిష్యూలు బాగనే ఉండ వచ్చు. ఒకటిష్యూయే పాడవవచ్చు. కనక ఆ అంగపు జబ్బును ఆటిష్యూ జబ్బుగా చూడాలన్నమాట.

బిఛాట్ పరిశోధనలో అతనికి టిష్యూపొర ప్రత్యేకతని నిరూపించడానికి కావలసినంత సాక్ష్యము దొరికింది. మైక్రోస్కోపు వాడకుండా జీవకణాలు అల్లుకుని ఏర్పడే టిష్యూల ప్రత్యేకతను నిరూపించి హిస్టాలజీ అన్న శరీర నిర్మాణశాఖను స్థాపించిన వాడైనాడు బిఛాట్.

ఒకరు కణాలూ ఒకరు అంగాలూ పట్టిస్తే వాటి నడిమి నిర్మాణాన్ని పట్టి కొట్టికొట్టి కాదు బిఛాట్ గొప్పవాడవుత. వివిధాంగాల గాయాలు ఒకే లాగుంటే చూచి విస్తుపోయి కారణము వెతికి పొరల సామరస్యమునూ భేదాలనూ కనుక్కొని అన్ని అంగాల గాయాలూ ఒకేరకపు టిష్యూని పాడు చేయడము వల్ల సామరస్యము కనబడిందని గుర్తించి చెప్పేడు బిఛాట్. అతడు ఉద్యోగమూ, ప్రాక్టీసు చేసుకుంటూ ఒక శీతకాలము లో ఆరు వందల శరీరాల పరీక్షలు చేశాడు.

ప్రాణాల పరీక్షను తిరగవేసినట్లు లేచ్చేడు బిఛాట్. ముప్ఫై యేళ్లకే అతనికి మూరేండ్లు నిండిపోయాయి.

కొత్త సీరియల్ ప్రారంభం



"ఎక్స్క్యూజ్ మీ."-

చదువుతున్న పేపరు మొహానికి అడ్డం తీసింది ఇందిర. ఎదురుగా అనుపమ. చిరునవ్వుతో అణకువగా రెండు చేతులూ జోడించి నమస్కరించింది.

"రా. కూర్చో. పద్మ ఇందాకటి నుంచి నీ కోసమే చూస్తోంది." అని,

"ఏం పద్మా, ఇంకా కాలేదూ, నీ స్నేహితురాలొచ్చింది" అంటూ లోపలికి వో కేక వేసింది.

"అయిపోయింది. వచ్చేస్తున్నా" మాట్లాడుతునే హడావిడిగా ఇవతలకి వచ్చి, ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్న అనుపమ చెయ్యిపుచ్చుకుని లోపలికి తీసుకుపోయింది పద్మ.

రెండేళ్ల క్రితం, కాలేజీ కామన్‌రూమ్‌లో వాళ్లిద్దరికీ పరిచయం అయింది. అదే కాలేజీలో పి. యు. సి. చదివిన పద్మ నదురు బెదురు లేకుండా చకచకా తిరిగేస్తోంది. సెవెంత్ ఫారం ప్యాసయి బి. ఎస్‌సి. లో చేరిన అనుపమ బెదురుగా బిడియంగా లోపలికి వచ్చి, తనకి తెలిసిన వాళ్లెవరూ కనిపించకపోవడంతో బిక్కు బిక్కుమంటూ, కూర్చుంది వో బెంచీ మీద. పాత వాళ్లందరితోటి కలుపుగోలుగా చిలిపిగా మాట్లాడేస్తూ, కొత్తవాళ్లని కూడ మొహమ్మాటం లేకుండా పలకరించేస్తున్న పద్మ, ఎవరితో సంబంధంలేనట్లు దిక్కులు చూస్తూ ఒంటరిగా కూర్చున్న అనుపమ దగ్గరికి వెళ్లి పలకరించి తనని తను పరిచయం చేసుకుంది.

ఆ అమ్మాయి ఇంత మొహం చేసుకుని, "నాదీ ఆ గ్రూపే. నా పేరు అనుపమ" అంది. ఇద్దరూ ఖబుర్లలో పడిపోయారు.

"మా అమ్మ ఈ కాలేజీలోనే హిస్టరీ లెక్చరర్." అంది పద్మ.

"ఊహూ." అంటూ సంతోషం వ్యక్తం చేసిన అనుపమ, మరుక్షణంలోనే నిరాశ పడిపోయినట్లు "అయితే మనకి దేనికీరారు" అంది.

మరి కాస్సేపటికి అనుపమ స్కూలు స్నేహితులు వచ్చారు. వాళ్లందరికి పద్మని పరిచయం చేసింది. పద్మ కూడ తన ఫ్రెండుకి అనుపమని పరిచయం చేసింది. ఆ పరిచయాలన్నీ పరిచయాలుగానే వుండిపోయాయి. పాత స్నేహితులు రోజురోజుకి దూరం అయి పద్మ అనుపమలు దగ్గర కాసాగారు.

"అమ్మా, నాకో క్రొత్త ఫ్రెండు దొరికింది. పేరు అనుపమ. ఎంతో చక్కగా వుంటుంది." అంటూ మొదలుపెట్టి, అబ్బ, కొంతమంది అందంగా వున్నా గొంతు మాత్రం ఘోరంగా వుండి, వాళ్లు అసలు నోరు తెరవకుండా అలా చిన్నగా నవ్వుతూ కూర్చుంటే బాగుండును అనిపిస్తుంది. మా అనుపమ అలాకాదు. చక్కటి రూపానికి తగినట్లే తియ్యటి కంఠం. తను మాట్లాడుతూంటే వినసొంపుగా వుంటుంది" అంటూ స్నేహితురాలిని తలుచుకుని మురిసిపోతూ, "నీకీసారెప్పుడైనా చూపిస్తానుండు." అని పూరించి, చివరికి ఒకరోజు కాలేజీ నుంచి వస్తూంటే పరిచయం చేసింది.

"అమ్మాయి ఎడ్మిరేషన్‌లో అతిశయోక్తి ఏమీలేదు." అని ముచ్చటపడిన ఇందిర మనస్సు, అనుపమకి తండ్రి లేడని వాళ్లు చాలా బీదవాళ్లని, ఆ అమ్మాయి స్కాలర్



షిప్ మీద చదువుకుంటోందని గుర్తొచ్చి ఏమిటోగా అయిపోయింది.

ఇందిరని చూసిన మొదటి క్షణంలోనే గౌరవమో, అభిమానమో ఏదో చెప్పలేని ఆకర్షణలాంటిది కలిగింది అనుపమకి.

పద్మ అనుపమల స్నేహం కాలేజీ నాలుగు గోడల మధ్యే వుండిపోలేదు. ఈ రెండేళ్లలోనూ అనుపమ, పద్మ వాళ్లింటికి వో పది సార్లయినా వచ్చింది. అనుపమ వాళ్లింటికి పద్మ మరో పదిసార్లయినా వెళ్లింది. ఇద్దరూ కలిసి వో డజను సినిమాలు చూశారు. ఇప్పుడిద్దరూ కలిసి మరో స్నేహితురాలింటికి వెడుతున్నారు.

“వెళ్తున్నాం.” అని తనకి చెప్పి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వెళ్లిపోతున్న ఇద్దర్నీ చూస్తూ అలాగే కూర్చుంది కొద్దిక్షణాలు.

ఎలాగో అలా చదువుకుని పైకి రావాలనే కోరిక, అందుకు తగిన పట్టుదల గల అనుపమని చూసినప్పుడల్లా ఇందిరకి ఏవేవో గుర్తు వస్తూంటాయి. జరిగిపోయిన దాన్ని గురించి ఆలోచించినందువల్ల లాభం ఏమీలేదు అనుకునేది చాలసార్లు. కాని, గతంలోని సంఘటనలని గుర్తు చేసుకుంటూ కాస్సేపు సంతోషించటం, కాస్సేపు విచారించటం, కాస్సేపు సిగ్గుపడటం—సాధారణంగా ప్రతిమనిషి ఎప్పుడో అప్పుడు చేసే పనే. ఎంత వద్దకున్నాను మనస్సుని మళ్లించటం సాధ్యంకాదు. ఇప్పుడు కూడ ఇందిర మనస్సు కాలగర్భంలో కలిసిపోయిన సంఘటనల తాలూకు నీడల్ని అవలోకించటంలో మునిగిపోయింది.....

* * *

ఎస్. ఎస్. ఎల్. సి., పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇన్—విజిలేటరుగా వచ్చిన సారథి, ఇందిర చాల తెలివైన అమ్మాయి అని మొదటిరోజు మొదటి అరగంట లోపునే గ్రహించేశాడు. సహజంగా మాస్టర్లందరికీ తెలివైన విద్యార్థులంటే అభిమానం వుంటుంది. ఆ అమ్మాయి తన స్టూడెంటు కాకపోయినా, ఆమెతో పరిచయం లేకపోయినా, ఆమె వ్రాసే తీరు ఆ ఏకాగ్రత అతనిని ముగ్ధుడిని చేశాయి. చాలాసేపు నిలబడి ఆ అమ్మాయి వ్రాసేది చూస్తూండేవాడు. ఎంత ఫస్టుమార్కులు తెచ్చుకునే తెలివితేటలున్నా, మాస్టారు మరీ అలా ప్రక్క ప్రక్కనే నిలబడి చూస్తూంటే ఇందిర చేతులు వణికేవి. భయంతో గుండె దడదడలాడేది. అయినా ఆయన మొహంలో కనిపించే భావాలు చూడాలనే కోరికని అణుచుకోలేక ఎలాగో ధైర్యం తెచ్చుకుని మెల్లిగా ఎదురుగా తలఎత్తబోతూంటేనే గ్రహించి సారథి వెళ్లిపోయేవాడు. ప్రక్కవాటుగా కనిపించిన అతని మొహంలో ప్రశంసాపూర్వకమైన మందహాసం చిందులాడుతున్నట్లనిపించేది ఇందిరకి. ముఖ్యంగా లెక్కల పేపరు పూర్తిచేసి వెళ్లిపోయే ముందు చాలసేపటినుంచి అక్కడే నిలబడి ఇందిర రివైజు చేసుకుంటున్న పేపరంతా చూసిన సారథి అభినందనపూర్వకంగా ఆమె మొహంలోకి చూసి చిన్నగా నవ్వకుండా వుండలేకపోయాడు.

ఆఖరి పరీక్ష వ్రాసి సంతోషంగా ఇంటికి వచ్చి అమ్మ పెట్టిన కాఫీ ఫలహారాలు ఆరగించాక, సినిమా ప్రోగ్రాం పెట్టింది ఇందిర.

రెండో సంవత్సరం కూడా పేపర్లు అంతంత మాత్రంగానే వ్రాసిన సావిత్రి మూతి ముడుచుకుని, “నేను రాను. నువ్వు వెళ్ళు కావలిస్తే.” అనేసింది.

“అదేమిటి సరదాగా వెళ్లిరండి. ఇప్పుడలా ఏడుస్తూ కూర్చుంటే మాత్రం మంచిమార్కులు వస్తాయా. అయినా నాలుగురోజులలో పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లిపోయే దానికి ఎన్నిమార్కులు వచ్చినా ఒక్కటే. చదివినందుకు ప్యాసయితే చాలు.” అంది కామేశ్వరమ్మగారు.

“అయితే, ఇందు పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లదా?” ఆశ్చర్యం అభినయిస్తూ బుగ్గలు నొక్కుకున్నాడు సూర్యం.

అంతస్తులు - అభిమానాలు

"అలా అడ్డదిడ్డం ప్రశ్నలు వేసి విసిగించకు. దానికి కుదిరినప్పుడు అదీ వెడుతుంది." అనేసింది కామేశ్వరమ్మగారు చికాగ్గా. పైకి ఏం బాధపడనట్లు కనిపించాలని ప్రయత్నం చేస్తోందేకాని, పెద్ద కూతురు పరీక్ష బాగా వ్రాయలేదని ఈ ఏడు కూడా పోతుందేమోనని ఆవిడకి కించగానే వుంది. చదువుకుని చేసేది ఏమీ లేకపోయినా స్కూలుఫైనలు ఫేలయింది అనే బదులు ప్యాసయింది అనుకుంటే అదో గొప్ప.

చివరికి ఎలాగయితేనేం, బ్రతిమాలి సావిత్రిని ఒప్పించి, సాయంగా వుండటానికి సూర్యాన్ని కూడ ప్రయాణం చేసి మిగతా వాళ్లెవరూ వెంటపడకుండా బయటపడాలని మెల్లిగా వరండాలోకి వచ్చేసరికి సుబ్బారాయుడుగారు ఎదురయారు కళ్లజోడు సవరించుకుంటూ.

"ఒంటి బ్రాహ్మణుడి శకునం. ఇవాళ టిక్కట్లు దొరకవు." అన్నాడు సూర్యం మెల్లిగా.

"ఎక్కడికో ప్రయాణం అయినట్లున్నారే, పెళ్లికూతుళ్లు." అన్నాడాయన నవ్వుతూ, పాపం సూర్యం అన్నమాటలు వినపడలేదులాగుంది.

"అదొక్కటే పెళ్లికూతురు. మధ్య నన్ను కలుపుతారేం." అంది ఇందిర, త్వరగా వెళ్లిపోదాం అన్నట్లు అన్నకీ అక్కకీ సౌంజ్ఞ చేస్తూ.

అది చూసిన ఆయన, "ఆగండి కాస్త. ఆ ప్రయాణం ఏదో రేపు పెట్టుకోవచ్చు. ఇవాళ నీకు పెళ్లికొడుకు వస్తున్నాడు. ఇంట్లోనే వుండాలి." అన్నాడు.

"ఎవరూ? కొంపతీసి మీ వరప్రసాద్ కాదు కదా?" అంది ఇందిర చెంపని చేయి జేర్చుకుని, ఆశ్చర్యంతో కళ్లు వెడల్పు చేసుకుని, ఆయన్ని చూస్తూ. ఆయనకి అరుగురు ఆడపిల్లల తరువాత చాలా కాలానికి, ఎన్నో దేవుళ్లకు మొక్కుకుంటే ఓ కొడుకు పుట్టాడు. వాడికిప్పుడు నాలుగేళ్లు. నీ కెక్కడా సంబంధం కుదరకపోతే మా వరప్రసాద్ చేసుకుంటాడులే అనేవాడాయన ఆ అబ్బాయి నెలల పిల్లవాడుగా వున్నప్పుడు. చాలారోజుల తరువాత ఇప్పుడు ఆమాట జ్ఞాపకం వచ్చింది ఇందిరకి.

"మీతో ఏమిటి కాని, లోపలికి పదండి, మీ నాన్న వున్నాడా? మాట్లాడాలి." అన్నాడాయన.

అదేదో వేళాకోళం వ్యవహారం కాదనిపించి, రాబోయే పెళ్లికొడుకు మీద విసుక్కుంటూ ముగ్గురూ ఆయనతో పాటు లోపలికి నడిచారు.

"ఊళ్లో అందరికీ పెళ్లిళ్లు చేయించడమే ఈయన పనిలా వుంది. ఇప్పుడీ పెళ్లికొడుకుని తీసుకురమ్మని ఈయన కెవరు చెప్పారు? ఛ. అన్నీ అక్కర్లేని పెత్తనాలు నెత్తిన వేసుకుంటాడు. ఇదుగో నేనీ పెళ్లి చేసుకోను. ఇంకా చదువుకుంటాను" అంటూ ఇందిర వంటింట్లో పని చేసుకుంటున్న తల్లి మీద విరుచుకు పడేసరికి, ఆవిడ మొదట తెల్లబోయి, మిగతా ఇద్దర్నీ అడిగి అసలు సంగతి తెలుసుకుని,

"బాగుంది వరస. అసలు అదేమిటో వినిరానీ. ముందే నీ గొడవ ఏమిటి?" అని విసుక్కుంటూ, చేస్తున్న పని వదిలేసి చెయ్యి కడుక్కుని కొంగు భుజాల చుట్టూ కప్పుకుని వాకిట్లోకి వెళ్లింది.

వాళ్ల మాటలు వినాలనే ఆసక్తి అయినా లేకుండా, సినిమా ప్రోగ్రాం కాన్సిల్ అయిపోయినందుకు చిరాకుపడుతూ, ఏవో పొట్లం కట్టిన కాగితం మీది కార్టూన్లు చూస్తూ కూర్చుంది ఇందిర. కాస్సేపటిలో తిరిగి వచ్చిన తల్లి చెప్పింది వింటూనే. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. మరుక్షణంలో అది సిగ్గుగా సంతోషంగా మారిపోవడంతో చటుక్కున తల వంచేసుకుంది.

"ఇప్పుడు వద్దంటుందేమో చూడు— ఆ మేష్టారి సంగతి నేనప్పుడే కనిపెట్టేశాను. మిగతా పిల్లలు కాపీ కొడుతున్నా చూడకుండా ఎప్పుడూ ఇందు డస్కు దగ్గరే నిలబడేవారు." అంది సావిత్రి నవ్వుతూ. చటుక్కున తల వంచేసుకుంది.

"అయితే యింక నీకు భయంలేదు. ప్యాసయిపోతావు." అన్నాడు సూర్యం వెంటనే.

అందరితోపాటు సావిత్రి కూడ తెల్లబోయింది మొదట. అంతలోనే అందరూ ఫక్కున నవ్వబోయేసరికి "అలాంటివి నా కేం చేతకావు." అంటూ విసురుగా లేచి వెళ్లిపోయింది.

కామేశ్వరమ్మగారు ముసిముసిగా నవ్వుకుని "ఇంకాస్సేపటిలో అతన్ని తీసుకు వస్తారు. నీ ముస్తాబు బాగానే వుందిలే." అని కొడుకు వైపు తిరిగి "ఇంక ఇప్పుడు ఏం చెయ్యటానికి టైములేదు. సైకిలు మీద వెళ్లి ఏమైనా తీసుకురా. వచ్చేటప్పుడు కాసిని పువ్వులు కూడాతే." అంటూ అలమారు లోంచి డబ్బు తీసియిచ్చి, త్వరగా వెళ్లిరమ్మనమని కొడుకుని మరోసారి హెచ్చరించి, కుంపటి మీద కాఫీకి నీళ్లు పడేసి మిగతా కబుర్లు వినడానికి వెళ్లిపోయింది.

తనకేం సంబంధంలేనట్లు వంటింట్లో కూర్చోలేకపోయిందిసారి ఇందిర. హాలు ప్రక్కగదిలోకి వెళ్లి చెవులు దొరగించుకుని, పుస్తకం చదువుతున్నట్లు నటిస్తూ కూర్చుంది.

"అబ్బాయికేం, రత్నం లాగుంటాడు. చాల బుద్ధిమంతుడు. ఆ విషయాలు మీరేం భయపడక్కర్లేదు." సుబ్బారాయుడుగారు సంతోషంగా చెప్తున్నారు.

"అదిసరే. మిగతా విషయాలు" వైకుంఠం గారు కుతూహలంగా అడిగారు.

"అదే కాస్త ఆలోచించాలి. వెనక చిల్లి గవ్వ ఆస్తిలేదు. చేస్తున్న ఉద్యోగం ఒక్కటే ఆధారం." అన్నారాయన నానుస్తూ.

వైకుంఠంగారు వెంటనే సమాధానం చెప్పలేదు. "బొత్తిగా ఏమీ లేనివాడికి ఇవ్వను" అంటారేమోనని భయపడింది ఇందిర. ఆయన కంటే ముందు కామేశ్వరమ్మగారి కంఠమే వినిపించింది. "తండ్రి ఏం చేస్తున్నాడు. ఇతని ఒక్కడి సంపాదన మీదే కుటుంబం అంతా బ్రతకాలా?" అంది.

"అతనికి ఎవరూ లేరుట." అన్నారు వైకుంఠంగారు.

"పినతండ్రి వాళ్లు వున్నారనుకోండి. ఇతని పదోఏట తల్లి, ఆ తరువాత రెండేళ్లకే తండ్రి పోతే వాళ్లే దగ్గర పెట్టుకుని చదువు అది చెప్పించారు. వాళ్లయినా సామాన్య సంసారులేనురి. అందుకే వూళ్లో వున్నంతవరకు ఏ ఇబ్బంది లేకుండా చదివించి తరువాత ఏదో వుద్యోగం చూపిస్తామన్నారు. సారధికి చదువుతో అఖండమైన తెలివితేటలున్నాయి. స్కూలుఫైనల్‌తో ఆపేయమనేసరికి బాధపడుతూ కూర్చున్నాడు. ఇంక గత్యంతరంలేక తండ్రి ఇచ్చిపోయిన రెండెకరాలు అమ్మేసి కాలేజీకి పంపించారు. ఆడబ్బు అయిపోవటంతో చదువూ ఆగిపోయింది. లేకపోతే ప్రొఫెసర్ కావలసిన తెలివి వుంది. నాకు మొదట్లో ఈ సంబంధం చెప్పాలనే వూహే రాలేదు. అతనే

ఏదో మాటల సందర్భంలో ఇందిర తెలివిని మెచ్చుకుంటూంటే, ''మన వాళ్ళమ్మాయే. పెళ్లి రాయబారం జరపమన్నావా ఏమిటి?'' అన్నాను. అతను నవ్వి వూరుకున్నాడు. సరే ఈ ఏడు పెద్దపిల్ల పెళ్లి తలపెట్టారు. ఈ అమ్మాయికి కూడ ఇప్పుడే చేస్తారో చెయ్యరో, కదిపి చూస్తానుండు అని చెప్పి చక్కా వచ్చాను. మీకు అభ్యంతరం లేదంటే తీసుకొస్తాను. మళ్లీ రాత్రి ట్రైనులో వెళ్లిపోతాడు.'' అన్నారు ఆయన.

''తాడు బొంగరం లేని సంబంధం లాగుంది.'' అంది కామేశ్వరమ్మగారు ఉత్సాహం అంతా చప్పబడిపోగా.

గుండెలు దడదడ లాడుతూండగా తరువాత సంభాషణ ఎలా వుంటుందో అని క్షణాలు లెక్కపెడుతూ కూర్చుంది ఇందిర.

చాలసేపు ఆలోచించి, ''సరే, అబ్బాయిని చూద్దాం.'' అన్నారు వైకుంఠంగారు చివరికి.

''అబ్బాయిని చూస్తే వదలలేరులెండి. ఎటొచ్చీ ఆలోచనంతా ఆస్తి విషయమే.'' సుబ్బారాయుడుగారు మరోసారి హెచ్చరించారు.

''మరి కట్నం..'' వైకుంఠంగారి మాట పూర్తి కాకుండానే ఆయన అందుకున్నారు.

''నువ్వు ఏమి ఇచ్చినా అతను పుచ్చుకుంటాడనుకో. అయినా పెద్దమ్మాయికి ఒకలాగా చిన్నమ్మాయికి ఒకలాగా నువ్వుమాత్రం ఎలా ఇస్తావు?''

''బాగుంది. బోలెడు పొలం, డబ్బు, మూలుగుతున్న సంబంధం అది. వాళ్లకిచ్చినట్లు ఇతనిక్కూడ ఎలా ఇస్తాను.'' వైకుంఠంగారు లౌక్యంగా బేరం పెట్టాలని చూశారు.

''తప్పేదియ్యా, ఆస్తి వున్నవాడికి, ముక్కు పిండి వసూలు చేసుకునే వాడికి కాళ్లావేళ్లా పడి బ్రతిమాలి కట్నం ఇస్తావా? ఏమీ లేనివాడు, నువ్వెంత ఇస్తే అంత సంతోషంగా పుచ్చుకునేవాడు, మీ అమ్మాయిని కోరి చేసుకుంటానంటున్నాడు కనక బిగిసిపోయి కూర్చుంటావా? ఇదేం న్యాయమయ్యా. నన్నడిగితే నువ్వు ఇచ్చే డబ్బు ఇతనికే ఎక్కువ అవసరం. పెళ్లి ఖర్చుల కయితేనేం, ఏదైనా మిగిలితే బ్యాంకిలో వేసుకోడానికయితేనేం వీళ్లకి నువ్వు ఇచ్చింది ఎంతో ఉపయోగపడుతుంది. ఆలోచించు. కుదిరితే రెండు పెళ్లిళ్లు ఒక్కసారే చేస్తావంటున్నావు కదా. ఒకరికొకలాగా ఇంకొకరికి మరొకలాగా ఇస్తే అల్లుడి దాకా అక్కర్లేదు మీ అమ్మాయే చిన్నబుచ్చుకుంటుంది. అది నీకు మాత్రం బాగుంటుందా— పెళ్లి అయిన క్షణం నించీ నువ్వు అతనికి ఒక్క మామగారివే కాదు. తండ్రి బాధ్యత కూడ తీసుకుని వాళ్ల మంచిచెడ్డలన్నీ చూసుకోవాలి'' ఆగకుండా సాగిపోతున్న ఆయన ధోరణికి అడ్డువస్తూ,

''సరే, అబ్బాయిని చూశాక అన్నీ ఆలోచించుకోవచ్చు.'' అంది కామేశ్వరమ్మగారు

''వాళ్లిద్దరూ చూసుకోడం అదివరకే అయిపోయింది. ఇంక చూడాల్సింది మీరే.'' నవ్వుతూ అని వైకుంఠంగారిని వెంటపెట్టుకుని వెళ్లిపోయారాయన.

లాంఛనప్రాయంగా పెళ్లిచూపులు ముగిశాయి. అతన్ని చూస్తూనే మంచి అభిప్రాయం ఏర్పరచుకున్న వైకుంఠంగారు, భార్య, ఆస్తి ఏమీ లేదని కాస్సేపు ముందు వెనక ఆలోచించారు కాని, కూతురు మనస్సు అర్థం చేసుకుని, ఆమెని చిన్నబుచ్చలేక సరే అన్నారు.


అక్కచెల్లెళ్ల పెళ్లిళ్లు అయిదు గంటల వ్యవధిలో ఒకేరాత్రి జరిగాయి. పెళ్లి వేడుకలు అయిపోగానే భర్తతో ప్రయాణం అయింది ఇందిర. కామేశ్వరమ్మగారు నమ్మలేనట్లు కూతురి మొహంలోకి చూసి ''నాన్నగారిని మరోసారి చెప్పమంటానుండు అతనికి.'' అని వెళ్లిపోయింది.

''ఇంత తొందరలోనే ఏమిటి? మరో రెండునెలలు పోయాక పంపిస్తాం. మొన్న మీ బాబయ్యగారితో చెప్తే సరే అన్నారు.'' అన్న మామగారి మాటలకి సారథి అభ్యంతరం చెప్పలేకపోయాడు.

''అయినా నువ్వయినా ఇంత హడావిడిగా రేపే వెళ్లిపోవడం ఏమిటి? శలవులేగా. ఓ పది రోజులుండు.'' అన్నారు ఆయనే మళ్లీ.

ఈ రెండో సలహాకి మాత్రం సారథి సమ్మతించలేదు.

''అక్కడ వారు హోటల్ భోజనంతో ఇబ్బంది పడుతూంటే నేనింకా ఇక్కడే కూర్చోటం ఏమిటి? ఎప్పుడో అమ్మ నన్ను



అంతస్తులు —
అభిమానాలు


వెంట పెట్టుకుని వెళ్ళడం, అక్కడ దిగ విడిచి రావడం అన్నీ పాత ఆచారాలు." అనుకున్న ఇందిరే ప్రయాణం మానుకోనని చెప్పింది మరోసారి.

"వాళ్ళిద్దరూ అంత మనసుపడు తూంటే మధ్యలో మనం అడ్డు చెప్పడం ఏమిటి?" అన్నారు వైకుంఠంగారు చివరికి నవ్వుతూ.

"వాళ్ల బాబాయి వాళ్ల ఆసరా కొన్ని వుంటుందనుకున్నాను. పెళ్ళికి వచ్చి రెండు అక్షింతలు వేసి బాధ్యత తీరిపోయినట్లు వెళ్ళిపోయారు వాళ్ళు. మరి వంటరి సంసారం ఏ పనీ చేతకాదు. ఏం వండు కుంటుందో, ఏం తింటుందో." అంటూ తల్లి బాధ పడింది. ఆవిడ కళ్ళు తడి అవడం ఇందిర స్పష్టంగా చూడగలిగింది.

స్టేషనుకి వెళ్ళిన వైకుంఠంగారు అప్పటిదాకా గాంభీర్యం నటిస్తున్నా, చివరికి రైలు కదిలే వేళ్టికి రెండు కళ్ళూ నీళ్ళతో నిండిపోగా గొంతుపూడిపోయి మాట్లాడలేక మౌనంగా నిలబడిపోయారు. సూర్యం మాత్రం ఏదో మాట్లాడుతూ సరదాగా వున్నాడు కనక కాని లేకపోతే తండ్రి మొహం చూసి కన్నీళ్ళు నింపుకున్న ఇందిర పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయేది. "ఇంత వయస్సు వచ్చాక పెళ్ళిళ్ళు అయినా అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఇంకా చిన్న పిల్లల్లా ఏడుస్తారేమిటి అసహ్యంగా" అని అదివరకు తను చూసిన వాళ్ళని దెప్పుతూ వుండేది ఇందిర. భర్త, సంసారం అంటే ఎంత అనురాగపూరితమైన ఆకర్షణ వున్నా, కనిపెంచిన తల్లిదండ్రులని విడిచి వెళ్ళే టప్పుడు, అందులో మొదటిసారిగా వెళ్తున్నప్పుడు ఆ స్త్రీ హృదయం ఎలా వుంటుందో ఈనాడే తను అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగింది. రైలు కదిలింది. అప్పటి దాకా అన్ని కబుర్లు చెప్పిన సూర్యం కళ్లల్లో కూడ నీళ్ళు తిరిగాయి. గొంతు కేదో అడ్డం పడినట్లు చటుక్కున మాట్లాడటం మానేశాడు. అందరూ తడికళ్ళతోనే పైకి చిరునవ్వు చిందిస్తూ మౌనంగా వీడ్కోలు తీసుకున్నారు.

(సశేషం)


కిలా ప్రతి
పీల్పులో ఉల్లాసం
SPECIAL
QILA
ఇపుడు
ఆకర్షణీయమైన
పెట్టెలో
దొరకును
QILA
SPECIAL CIGARETTES
వజీర్ సుల్తాన్ తయారీ

వారఫలం

2-12-1966 శుక్రవారం మొదలు 8-12-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు సామాన్యంగా ఉంటాయి. రావలసిన డబ్బుమీద ఆధారపడి ఇతరులకు వాగ్దానం చేయడం తగదు. ఉద్యోగంలో మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. సాంఘిక కార్యక్రమాల్లో ప్రముఖ పాత్రను వహించగలరు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృషభం : మీరు స్వంతంగాచేసే వ్యాపారాల కంటె భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. వృత్తిలో ఎవరితోను వాద ప్రతివాదాలకు దిగడం తగదు. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అలంకార వస్తువులు కొంటారు.

మిధునం : అన్ని వ్యవహారాలు అనుకూలంగానే కన్పిస్తాయిగాని యేమరుపాటుగా ఉండడం తగదు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ప్రయాణాలు ఫలించగలవు. స్థిరాస్థి వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్త వచ్చును. దైవకార్యాలు నెరవేరుతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో శ్రమపడినా నిష్ఫలం తప్పదు.

కర్కాటకం : వృత్తి వ్యాపారాల్లో శ్రమమీద అభివృద్ధిని సాధించగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం : వారం ప్రారంభంలోనే కొన్ని చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. నూతన వ్యాపారాలు లాభించగలవు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

కన్య : కొన్ని వ్యవహారాలు సులువుగా నెరవేరినా, మరికొన్నింటిలో శ్రమ పొందవలసివస్తుంది. ఎవరినీ విశేషంగా నమ్మి వ్యవహరించడం మంచిదికాదు. ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. పోటీవారితో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో చికాకులు రావచ్చును. విలాస వస్తువులు కొంటారు.

తుల : వృత్తి వ్యాపారాల్లో మొగమాటాలకు లొంగిపోవడంవలన ముస్ముందు ఇబ్బంది కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు ఆర్థిక వ్యవహారాలు ఇదివరకటికంటె బాగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు—నూతన విషయాలను తెల్సుకొంటారు. దైవ కార్యాలు నెరవేరుతాయి.

వృశ్చికం : వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. వృత్తిలో ప్రయోజనంగల వ్యక్తులను కల్సుకొంటారు. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికివస్తుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగంలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

ధనుస్సు : వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలో ఆందోళన కలిగించే పరిస్థితులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వృత్తిలో మీ తొందరకు వస్తువులోపదోష ప్రమాదం ఉంది. రాజకీయ వ్యవహారాలు వారం మధ్యలో బాగా ఉంటాయి. కళాకారులకు మంచి సమయం.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. ప్రయాణాలోచనలు చేస్తారు.

మకరం: ఫలితంమాట ఎలాగ ఉన్నా, ప్రయత్నింపని ప్రతి పని సులువుగా నెరవేరుతుంది. వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో మిత్రుల సహకారం లభించగలదు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉండవు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.


కుంభం : వ్యాపారంలో కొన్ని అవకాశాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయిగాని అవి కార్యరూపాన్ని ధరించవు. వృత్తిలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు వస్తాయి. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ఆడంబరంకోసం వ్యయం జరుగుతుంది.

మీనం: వృత్తి వ్యాపారాల్లో శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. సాంఘిక కార్యక్రమాల్లో ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో మీ కృషిని అధికారులు గుర్తించగలరు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

—మహేష్



పిండారీదండులు వూళ్ళ మీద పడి యథేచ్ఛగా దోచుకుంటున్న రోజులవి. కోటికి పడగలెత్తిన గురవయ్య సెట్టికి భయం పట్టుకుంది. తాత ముత్తాతల కాలం నుంచీ రత్నాలు, బంగారు నగల వ్యాపారం చేసి, ఆర్జించిన ధనరాసులన్నీ అరు ఇత్తడి బిందెలలో పోసి, అర్ధరాత్రి వేళ రెండోకంటి వాడికి తెలియకుండా అడవిలో ఒకచోట స్వయంగా గొయ్యి తవ్వి పూడ్చేశాడు. నిధి ఎక్కడుందో తనకు తప్ప మరెవ్వరికీ తెలియకుండా ఉండాలని, ఆ గొయ్యి తవ్విన చోటికి గుర్తులు గుప్తమైన భాషలో ఒక రాగి రేకు మీద చెక్కి జాగ్రత్త చేశాడు.

అంతలో పిండారి గుంపులు రానేవచ్చాయి. గురవయ్య సెట్టిని పట్టుకుని డబ్బుకోసం నానావిధాలా బాధించారు. ఏమయినా అతడు నోరు విప్పలేదు. ఆఖరికి దొంగలకు విసుగెత్తి అతడిని చంపి వెళ్ళిపోయారు.

అంతే అతని డబ్బు అంతా ఏమైపోయిందో, ఎక్కడ దాచాడో ఎవరికీ అంతు బట్ట లేదు. అతని సంతతికి కూడా ఆ ఆచూకీ తెలియదు. గురవయ్య సెట్టి రహస్యంగా దాచి ఉంచిన రాగిరేకు కొన్నాళ్ళకు బయట పడింది. దాని మీద ఒక వైపున ఇలా వ్రాసిఉంది.

"మంత్రాల మర్రికి ఈశాన్యంగా తలకాయలో రావి చెట్టు. దానికి ఆగ్నేయంగా కాలియమలో చింతచెట్టు. దానికి సరసన తూర్పుగా, సురల పడమరగా."

ఇదేదో పిశాచాల భాషలా కనిపించింది. తలకాయలో రావిచెట్టు అంటాడేమిటి నా చలకాయ అనుకున్నారు. కాలియమలో చింతచెట్టు అనే మాటకు అర్థం అసలే తెలియలేదు. పోనీ అడవిలోకి వెళ్ళి వెతుకుదామా అంటే, మంత్రాల మర్రిచుట్టూ ఎక్కడ పడితే అక్కడ రావిచెట్లు, చింత చెట్లు బోలెడున్నాయి. ఏ చెట్టు అనుకోవాలి?

ఆ రాగిరేకుకి రెండో వైపున అంత కన్న చిత్రమైన వ్రాత కనిపించింది.

కా న) ర న త త న (న య న
ర త న


మ మ త
మ ర ల

ర త న
ర త న

ఇది బొత్తిగా అర్థ రహితంగా కనిపించింది. గురవయ్య సెట్టి కుటుంబీకులు ఆ నిధికోసం చాలా సార్లు ప్రయత్నించి, దొరకక, నిరాశచెంది, వదిలేశారు.

ఆ వంశంలో నాలుగో తరంలో ఒక ఉద్దండ పిండం పుట్టింది. గురవయ్యసెట్టి చనిపోయిన 92 సంవత్సరాల తరువాత ఆ నిధి కోసం మళ్ళీ ఈ యువకుడు వేట ప్రారంభించాడు. అహోరాత్రులూ నిద్రాహారాలు మాని అదేపనిగా ఆలోచించసాగేడు. గునపం పుచ్చుకుని అడవిలో వెతకక, కాగితం కలం పుచ్చుకుని ఆ రాగిరేకుతో వెదుకసాగేడు.

రాగి రేకుకి రెండో వైపున ఉన్న భాగహారంలా కనబడే చిత్రమైన అక్షరాల లెక్కను చూచి, తన ముత్తాత గురవయ్య సెట్టి గణితంలో చాలా గట్టి వాడని గ్రహించాడు. ఈ భాగహారంలో వాడిన ఎనిమిది రకాల అక్షరాలే రాగి రేకుకి రెండో వైపున ఉన్న అర్థంకాని మాటలలోనూ కనిపిస్తున్నాయి. అంటే ఏమున్న మాట? అర్థం కాని మాటలలో ప్రతి అక్షరమూ ఒక ప్రత్యేకమైన అంకెను సూచిస్తుంది. ఆ అక్షరాల విలువలు తెలుసుకోడానికి ఈ భాగహారం ఉపయోగపడుతుంది. ఆ అక్షరాల విలువలు తెలిస్తే నిధికి దరిదాపులలోకి వెళ్ళినట్టే.— ఇంతవరకూ బాగానే ఉంది కానీ, భాగహారంలో ఉన్న అక్షరాల విలువలు ఎల్లా తెలుస్తాయి? అక్కడే ఉంది ఇబ్బంది అంతా.



గురవయ్య సెట్టి మునిమనుమడు ఈ చిక్కు ఎల్లాగైనా విడదీయాలని పట్టు పట్టేడు. అతడు ఉపయోగించిన తర్కాన్ని సూక్ష్మంగా విన్నవిస్తాను.

రాగిరేకు మీది భాగహారాన్ని చూస్తే ఐదు అంకెల సంఖ్యని రెండు అంకెల సంఖ్యచే భాగిస్తే విభక్తం మూడు అంకెల సంఖ్య వచ్చిందనీ, విశ్లేషంగా పోయిందనీ తెలుస్తోంది.

విభక్తంలో మొదటి అక్షరం "న" విభాజకంలో చివరి అక్షరం "న". "న" చేత్తో గుణిస్తే వచ్చే సంఖ్యలో చివరి అంకె కూడా "న". అంటే "న" విలువ 1 కావచ్చు, లేదా 5 కావచ్చు, లేదా 6 కావచ్చు. ఇంక "న" విలువ ఈ 1, 5, 6 లలో ఏదో తెలుసుకోవాలి.

"కాన" అనే రెండు అంకెల సంఖ్యని "న" అనే అంకె చేత్తో గుణించగా "రతన" అనే మూడు అంకెల సంఖ్య వచ్చింది. అంటే "న" విలువ ఒకటి అవడానికి వీలు లేదు. 5, 6 లలో ఏదో ఒకటి కావాలి.

అది అల్లా ఉంచి "మమత" లోని "త" లో నుంచి "మరల" లోని "ల" తీసివేస్తే "త" మిగిలింది. అంటే "ల" విలువ సున్న అయిఉండాలి. హమ్మయ్య! ఇప్పటికి ఒక్క అక్షరం బయట పడింది.

"కాన" ని "య" చేత్తో గుణిస్తే "మరల" అనే సంఖ్య వచ్చింది. ఇందులో ఒకట్ల స్థానంలోని "ల" విలువ సున్న. కనుక "న" విలువ 5 అయి ఉంటే "య" సరి సంఖ్య అయి ఉండాలి. అది 2, 4, 6, 8 లలో ఏదైనా కావచ్చు. లేక "న" విలువ 6 అయి ఉంటే "య" విలువ 5 మాత్రమే అయి ఉండాలి. ఈ రెండూ గుణిస్తే చివర సున్న రావడం మరోలా సాధ్యం కాదుకదా!

అది అల్లా ఉంచు. రెండవ తీసివేతలో "మ" లో నుంచి "ర" తీసివేస్తే "ర"

మిగిలింది. అంటే "మ" విలువ "ర"కి రెట్టింపు అన్నమాట. కనుక "ర" విలువ 4 కన్న ఎక్కువ ఉండడం సాధ్యం కాదు. అది 1, 2, 3, 4 లలో ఏదైనా కావచ్చు. కనుక "మ" విలువ 2, 4, 6, 8 లలో ఏదైనా అయి ఉండవచ్చు.

ఇప్పుడు "య" విలువ 5, "న" విలువ 6 అయి ఉంటే "ర" విలువ 4 కన్న ఎక్కువ అయితీరుతుంది. కనుక "న" విలువ 6 కాదు. 5 మాత్రమే అయి ఉండాలి.

ఇంతవరకూ తెలిసిన దానిని బట్టి ఆ భాగహారాన్ని మళ్ళీ వ్రాస్తే ఇల్లా ఉంటుంది.

కా 5) ర స త త 5 (5 య 5
ర త 5
———
మ మ త
మ ర 0
———
ర త 5
ర త 5
———

ఇందులో "య" అనేది సరి సంఖ్య.

బాపుసాహితి

2, 4, 6, 8 లలో ఏదో ఒకటి కావచ్చు. "మ" విలువ "ర" కి రెట్టింపు. "ర" విలువ 1, 2, 3, 4 లలో ఏదో ఒకటి.

కా న × య = మ ర ల

"మరల" అనే మూడు అంకెలసంఖ్యలో వందల స్థానంలో ఉన్న అంకె పదుల స్థానంలో ఉన్న అంకెకు రెట్టింపు అయి ఉండాలి. ఉదాహరణకు "కా" విలువ 1 అనుకుందాం. "య" కు 2, 4, 6, 8 అనే విలువలు వరుసగా ఇచ్చి, గుణించి పైన చెప్పిన లక్షణాలు గల "మరల" అనే సంఖ్య వస్తుందేమో చూద్దాం. 15 × 2 = 30; 15 × 4 = 60; 15 × 6 = 90; 15 × 8 = 120. ఇందులో ఏ ఒక్కటీ నప్పదు. కనుక "కా" విలువ ఒకటి అవడానికి వీలులేదు. ఇల్లాగే "కా" కి 1 నుంచి 9 వరకూ అన్ని విలువలూ ఇచ్చుకుంటూ, గుణించి చూచుకుంటూ పోతే కా=3; య =6 అయితేనే నప్పుతుందని తెలుస్తుంది. అప్పుడు 35 × 6 = 210 ఇందులో వందల స్థానం పదుల స్థానానికి రెట్టింపు ఉంది కదా!

"కాన" విలువ తెలిసింది కనుక, దీనిని "న" పెట్టి గుణిస్తే 35 × 5 = 175 వస్తుంది. ఇదే "రతన" అనే సంఖ్య. కనుక ర 1; త 7 అని తెలుస్తుంది. ఇంతవరకూ తెలిశాక స=9అని సులభంగానే తెలుస్తుంది.

అక్షరాలలో ఉన్న భాగహారాన్ని మనకు తెలిసిన అంకెలలోకి మార్చితే, ఇల్లా ఉంటుంది.

35) 19775 (565
175
———
227
210
———
175
175
———

భాగహారంలో వాడిన ఎనిమిది అక్షరాల విలువలూ వరుసగా వ్రాద్దాం.


ల	ర	మ	కా	న	య	త	స
0	1	2	3	5	6	7	9

రహస్య లిపిలోని "తలకాయ" అనే మాటను తీసి, దాని స్థానంలో 7036 అనే సంఖ్యను వ్రాయాలి. ఈ సంఖ్య దూరాన్ని అడుగులలో సూచిస్తుందని గురవయ్యసెట్టి మునిమనుమడు సులభంగానే గ్రహించ గలిగేడు. అల్లాగే "కాలయమ" అంటే 3062 అనీ, "సరసన" అంటే 9195 అనీ "మరల" అంటే 210 అనీ గ్రహించాడు.

ఇప్పుడు ఆ రహస్య భాషను చదివితే ఇల్లా ఉంటుంది.

"మంత్రాల మర్రికి ఈశాన్యంగా 7036 (అడుగుల దూరం) లో రావిచెట్టు, దానికి ఆగ్నేయంగా 3062 (అడుగుల దూరం) లో చింతచెట్టు, దానికి 9195 (అడుగుల దూరం) తూర్పుగా నడిచి, 210 (అడుగుల దూరం) ఉత్తరంగా వెళ్ళి తవ్వాలి".

ఈ భోగట్టా తెలుసుకున్న నాటి రాత్రే గురవయ్యసెట్టి వారసుడు అడవికి వెళ్ళి, ఆ నిధిని తవ్వి బయటికి తీశాడు. అన్నట్లు ఆ నిధి విలువ 2 కోట్ల 76 లక్షల రూపాయలని తెలియవచ్చింది. ●



అమెరికా నూతన ఆహార సహాయవిధానం


ఆర్విల్ ఫ్రీమెన్
(అమెరికా వ్యవసాయశాఖ మంత్రి)

ఈనాడు ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అందరికీ చాలినంత ఆహారం లేకపోవటం.

ఏదో ఒక గట్టి చర్య జరుగకపోతే ఈ శతాబ్ది చివరకు జనాభా అమితంగా పెరిగిపోయి, పంటలు అందుకు తగినంతగా పెరగక తీవ్ర పరిస్థితి ఏర్పడుతుంది.

జనాభా పెరుగు తున్నది. అందుకు తగినట్లు పంటలు పెరగటం లేదు 1965లో ప్రపంచంలో పండిన ఆహారం 1964లో ఉన్నంతే ఉన్నది. కాని జనాభా మాత్రం ఆసంవత్సరంలో 6,30,00,000 పెరిగింది.

యుద్ధానంతర కాలంలో విజ్ఞాన శాస్త్ర వృద్ధి ఫలితంగా శిశు మరణాలు తగ్గిపోవటం, మొత్తం మీద ప్రజల ఆయుర్దాయం



శ్రీ ఆర్విల్ ఫ్రీమెన్ భారతప్రభుత్వంలోని ఉన్నతాధికారులను జూలై 15వ తేదీన కలుసుకొని భారతదేశంలో వ్యవసాయోత్పత్తి అభివృద్ధిని గురించి చర్చించారు. శ్రీయుతులు వి. ఆర్. ఆర్. వి. రావు, చెస్టర్ బౌల్స్, సి. సుబ్రహ్మణ్యం, ఆర్విల్ ఫ్రీమెన్, అశోక్ మెహతాలను ఫోటోలో చూడవచ్చు.

పెరగటం వంటి కారణాల చేత జనాభా అమితంగా పెరుగుతున్నది.

ఆది మానవుడు మొదలుకొని ఈశతాబ్ది వరకు పెరిగిన జనాభా 100కోట్లు మాత్రమే కాగా గడచిన సంవత్సరాలలోనే జనసంఖ్య అదనంగా 200 కోట్లు పెరిగింది. అంటే మూడు రెట్లు అయింది. కాగా వచ్చే శతాబ్ది ఆరంభానికి మళ్ళీ ఇప్పుడు ఉన్న జనాభా రెట్టింపు అయ్యే అవకాశం కనబడుతున్నది.

ఈ జనాభా పెరుగుదలలో 80 శాతం ఆహార కొరత గల దేశాలలో జరుగుతున్నది. ఉన్న ప్రజలకే చాలినంత ఆహారం పండించ లేకుండా ఉన్న ఈ దేశాలలో ఇట్లా పెరగటం పరిస్థితిని మరింత క్లిష్టపరుస్తున్నది.

ఏ నాగరికత గాని తన ప్రజలకు తిండి పెట్టలేనప్పుడు నశించి పోతుందన్నది చరిత్ర మనకు నేర్పుతున్న పాఠం. అట్లా పతనమై పోయిన నాగరికతల శిథిలాలు ఈ లోకంలో ఎన్నో చూస్తున్నాము.

మరి, ఈనాడు ఆధునిక నాగరికతకు ఎదురైన ఈ విపత్తు ఏ ఒక్క దేశ ప్రజలకో, ఏ ఒక్క జాతికో, ఏ ఒక్క ఖండానికో పరిమితం కాదు. సమస్త ప్రపంచం ఆధునిక వార్తా, ప్రయాణ సౌకర్యాల వల్ల అనుబంధించుకొన్న, 'ఏకప్రపంచ' నాగరికతకే ఈ ప్రమాదం ఎదురవుతున్నది. ఆకలితో అలమటించే ప్రపంచంలో తన ప్రజలకు చాలినంత పండించుకొంటున్న దేశాలకు సైతం శాంతి లేదు, సౌఖ్యం లేదు; భద్రత లేదు.

ఇప్పటికే ప్రపంచ ప్రజలలో మూడింట రెండు వంతుల మంది ఆకలితో అర్ధాకలితో కాళ్ళు ముడుచుకొని పడుకొంటున్నారు. కాగా మిగతా మూడోవంతు మంది అజీర్ణంతో బాధ పడుతున్నారు. ఈ రోజుల్లో రోగాలవల్ల, తిండి చాలనందువల్ల రోజూ 10,000 మంది అయినా కాలగర్భంలో కలిసి పోతున్నారు.

ఆహార కొరత ఉన్న దేశాలలో పుట్టిన పిల్లలకు సగం మంది దాకా ఆరేళ్ళు నిండక ముందే నూరేళ్ళు నిండిపోతున్నాయి. కాగా ఉన్నవారిలో మూడింట రెండు వంతుల మందికి సరైన తిండి పోషణ లేక అవిటి వారుగానో, అనారోగ్య వంతులుగానో ఉండి పోతున్నారు.

ఈ పరిస్థితుల్లో ఆశాకిరణం ఏదైనా ఉన్నదా? ఉన్నది. అంతేకాదు. మంచి కాలం వస్తుందన్న ఆశాభావం కూడా లేకపోలేదు.

నిండైన ఆర్థికాభివృద్ధికి— అంతేకాదు, ఒక దేశం మనుగడకు— ఆరోగ్య ప్రదమైన, పుష్కలమైన, స్వయంసంపూర్ణమైన వ్యవసాయం మొట్టమొదట అవసరమని చరిత్ర చెబుతున్నది సత్యం. ఈసత్యాన్ని నేటి ఆర్థిక వేత్తలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు.

బస్తీల వారికి, పొలాలలో పండించే వారికి కూడా వ్యవసాయమే ఆహారానికి ఆధారం. దేశంలో చాలినంత పండించుకొంటే, ఉన్న బంగారు నిల్వలు ఖర్చు పెట్టి ఇతర దేశాల నుంచి కొని తెచ్చుకోకుండా బస్తీ జనాభాకు కూడా దేశం

తిండి పెట్ట గలుగుతుంది. ఈ నిల్వలను— దీనినే విదేశీ ద్రవ్యం అంటారు— దేశ ఆర్థికాభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

దేశంలో పరిశ్రమలకు కావలసిన ముడి సరకులనేకం వ్యవసాయ రంగం నుంచే లభిస్తాయి.

వ్యవసాయ రంగం సుభిక్షంగా ఉంటే దేశంలో తయారయ్యే వస్తువులు కొనేవారి సంఖ్య హెచ్చుగా ఉంటుంది. అందుకు కారణం గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి హెచ్చుగా ఉండటం. వ్యవసాయ పంటల వల్ల దేశానికి విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించుకో వచ్చు. దేశంలో రకరకాల పంటలు పండించుకొంటే ఎగుమతులను పెంచుకొని ఈ ద్రవ్యాన్ని మరింత హెచ్చుగా సంపాదించుకోవచ్చు.

దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి గల ఆధిక్యతను, ప్రాముఖ్యాన్ని గుర్తించినట్లయితే, అందుకు అవలంబించవలసిన మార్గం ఒకటే.

ఆహార కొరతను జయించాలంటే వ్యవసాయాభివృద్ధికి అన్నిటి కంటే హెచ్చు ప్రాధాన్యం ఇచ్చి తీరాలి.... సాంఘిక, ఆర్థిక అభివృద్ధి ద్వారా సుస్థిర శాంతిని ఈ ప్రపంచానికి ప్రసాదించుకోవాలంటె అది అవసరం.

ఆహార కొరత గల దేశాలు ఈ కొరత తీర్చుకోటానికి స్వయంగా పూనుకోవటం అవసరమని ఈనాడు ఎవరికైనా స్పష్టంగా తెలిసిన విషయమే.

ఈ దేశాలు తమ పొలాలలో పంటలని ఎక్కువగా పండించి, ఇందుకు సొంత శక్తి యుక్తులను, అవకాశాలను వినియోగించుకోవాలి.

అయితే వారికై వారే చేసుకో లేక పోవచ్చు. కాని ఈ కొరతను తీర్చటానికి అందరు చేసి తీరవలసిన పనులివి:

1. వ్యవసాయ సౌకర్యాలను వృద్ధి పరచుకోవాలి.

2. పంటలకు, వాటి పంపిణీకి సంబంధించిన ప్రభుత్వ శాసనాలను అభివృద్ధి కృషికి అనుగుణంగా మార్చుకోవాలి.

3. గ్రామీణ ప్రజలను జాతీయ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో భాగంగా సమన్వయ పరచుకోవాలి.

4. దేశంలో ఆహార అవసరాలకు తగినట్లు, అంటే ఇప్పటి ఆహార కొరత తీర్చటానికీ, ఇక ముందు ఏర్పడగల ఆహార కొరత తీర్చటానికీ అనుగుణంగా పంటల ఉత్పత్తి జరగాలి.

అయితే ఈ దేశాలు వాటికై అవే ఈ పోరాటంలో జయించజాలవనేది తెలిసిన విషయమే. ఒక్క రోజులోనో, ఒక సంవత్సరంలోనో ఇది సాధ్యం కాదని కూడా తెలిసిన విషయమే.

ఇందుకు కొంత కాలం పడుతుంది. ఇందుకు కొంత ప్రోత్సాహం కావాలి. ఈలోగా ఆహార సహాయం, సాంకేతిక సహాయం అవసర మవుతుంది.

ఈ దేశాలు తమకు కావలసిన ఆహారం అంతా తామే పండించుకొన గలిగే వరకు మిగులు ఆహారం, బట్ట ఉన్న దేశాలు అన్నివిధాలా వీటికి సహాయపడాలి.

అమెరికా ఈ విషయంలో తన శక్తి వంచన లేకుండా చేయటానికి సిద్ధంగా ఉన్నది. అయితే అమెరికా చేయగలిగింది కొంత వరకే.

ఆహార కొరత గల ఇతర దేశాలకు అమెరికా తన అదనపు నిల్వలను పంపించి సహాయ పడుతున్నది. గత 11 సంవత్సరాలలో అమెరికా 15 కోట్ల టన్నుల ఆహారం ఇట్లా కొరత గల దేశాలకు పంపింది. వీటి ఖరీదు కడితే ఎంతలేదన్నా 1500 కోట్ల డాలర్లు ఉంటుంది.

1942 నుంచి ప్రపంచంలో కరువులు లేవు. ఎక్కడెక్కడ విపత్తు సంభవించినా అక్కడికి ఆగమేఘాల మీద అమెరికా సహాయం ఉరికిస్తున్నది.

ఈ సంవత్సరం అమెరికా తన సాధారణ నిల్వల నుంచి కూడా ఆహారం ఇతర దేశాలకు పంపిస్తున్నది. ఇప్పటి వరకు ఆహార పంటలు వేయకుండా ఉన్న పొలాలలో కూడా అమెరికా ఈ సంవత్సరం ఇందు నిమిత్తం ఆహార పంటలు పండిస్తున్నది.

అమెరికాలో అదనపు నిల్వలు అనేవి పూర్తిగా కరిగిపోవటం, అమెరికా వగైరా అదనపు పంటలు గల దేశాలు ఎల్లకాలం అందరికీ కావలసినంత అందించజాలవన్న గుర్తింపు, ఈ కొత్త దేశాలు స్వయం సహాయ కృషికి పూనుకొనటమే ఈ సమస్యకు సరైన పరిష్కార మార్గమన్న గుర్తింపు కారణంగా అమెరికా ఆహార విధానంలో కొన్ని మార్పులు అవసరమైనాయి.

కొందరు పొరపాటుగా అనుకొంటున్నట్లు అమెరికా కొత్త ఆహార విధానం అంటే అమెరికా వైఖరి అననుకూలంగా మారడం కాదు. ఆహార కొరత లేకుండా చేసే పోరాటంలో విజయానికి ఎటువంటి సహాయం అవసరమో అటువంటి సహాయమే అందజేయాలన్న కృత నిశ్చయం ఈ కొత్త విధానంలో కనుపిస్తున్నది.

ఈ కొత్త కార్యక్రమం క్రింద అమెరికా ముందు కంటె హెచ్చుగా సాంకేతిక, ధన సహాయం, ఆహార సహాయంతో పాటు అందజేస్తుంది. సొంత ఆహారోత్పత్తులను హెచ్చించుకొని ఆహార రంగంలో స్వయం సమృద్ధిని సాధించటానికి సమర్థంగా, పట్టుదలతో కృషి చేసే దేశాలకు అమెరికా నుంచి ఈ సహాయం లభిస్తుంది. ఇది వరకటి 'శాంతికి ఆహారం' పథకంలోని మంచి నిబంధనలన్నీ అట్లాగే ఉన్నాయి; వాటిని మార్చలేదు. అయితే, రెండు ముఖ్య అంశాల విషయంలో కొత్త కార్యక్రమానికీ, పాతదానికీ తేడా ఉన్నది.

మొదటిది, ఈ ఆహార సహాయం పొందే దేశాలు స్వయం సమృద్ధి సాధనకు కృషి చేయాలని కొత్త కార్యక్రమం కోరుతున్నది.

రెండవది, ఇదివరకు అమెరికా తన వద్ద నిల్వలో ఉన్న సరకులనే శాంతికి ఆహారం పథకం క్రింద ఇతర దేశాలకు పంపిస్తుండేది. ఇప్పుడీ కొత్త కార్యక్రమం అట్లా కాదు. మానవ అవసరాల దృష్ట్యా అవసరమైన వాటిని పండించి పంపించటం జరుగుతుంది. ఇది మరింత క్రియాశీలంగానూ, పట్టువిడుపులకు అనుకూలంగానూ ఉంటుంది.


ఈ కార్యక్రమంలో చేసిన ఈ మార్పు పరంగా హెచ్చు పండించటం ఒక్కటే ధ్యేయం కాదు. ఆహారం కొరతగల దేశాల వారికి ఏ ఆహారం అవసరమో అది, ఎంత కావాలో అంత పండించి అందజేయటానికి అవకాశం కల్పించటం జరిగింది. వ్యాపార రీత్యా అమ్మటానికి, సహాయం రూపేణా అందజేయటానికి కూడా ఇది వర్తిస్తుంది.

ఆహార కొరత సమస్యను తీర్చటంలో అమెరికా గతంలో తన శక్తి వంచనలేకుండా కృషి చేసింది. ఇక ముందు కూడా అమెరికా అట్లానే తన శక్తి కొలది కృషి చేస్తుంది. అయితే ప్రపంచంలో ఆహార కొరతలేకుండా చేయటానికి చిన్న, పెద్ద, ధనిక, పేద అనే తారతమ్యాలు లేకుండా అన్ని దేశాలూ సాధ్యమైనంత హెచ్చు సహకారంతో కృషి చేయవలసి ఉంటుంది. ●

[ఆంధ్రసచిత్రవారపత్రికకు ప్రత్యేకం]

నవ్వు

కొడవంటి కాశీపతిరావు



మంజుల నవ్వింది.

మృదు మధురంగా, మనోజ్ఞంగా, మంజులంగా నవ్వింది. అంతకన్న ఆ నవ్వు అందం చెప్పలేం. ఎక్కడ ఎప్పుడు ఎలా నవ్విందోయ్ మంజులా? అని అడగవచ్చు.

కాలేజీలో ప్రవేశిస్తూ నవ్వింది.

సుమారు పదిన్నర గంటల వేళ నవ్వింది.

ఎలాగంటే చెప్పాం...... అలా నవ్వింది.

అయితే మన పెద్దలు కొన్ని సిద్ధాంతాలూ, జనరలైజేషన్‌లూ చేసేసారు. వారు చెప్పనే చెప్పారు... లక్ష్మణుడి నవ్వులా, ...నవ్వు నాలుగు విధాల చేటులా....అలానే మంజుల నవ్వేసింది. పెద్దలనెంత ఎదిరిద్దామనుకున్నా ఇలాంటి విషయాల్లోనే కష్టమనిపిస్తుంది.

కాకపోతే సుమారు ఆ పదిన్నర గంటల వేళ రాంబాబు సైకిలు మీద ఎదురు రావడ మేమిటి? బెల్లు కాలేదని అందర్నీ రిసీవ్ చేసుకుందుకు అటూ యిటూ తిరుగుతున్నాడు పాపం. ఎంత లేదన్నా ఫైనలియర్ స్టూడెంటు. అందగాడు. తనని చూసే నవ్విందని మురిసిపోడూ మరి? హేండిల్‌బార్ మీద ఒక చేతితో జేబులోని రుమాలుతో ముఖం మీది పాత ఫీలింగ్స్ చెరిపేసుకుని సరికొత్త ఫీలింగ్ పులుపుకున్నాడు.

ఆ సైకిలుకే ఎదురౌస్తూ ఆ సుమారు పదిన్నర గంటల వేళ సుబ్రమణ్యం రావడ మేమిటి? పాపం మరి రాడూ? కాలేజీ వేళాయే.... అందులోనూ బుద్ధిమంతుడు టైముకి రాడూ మరి. వస్తాడు. అయితే రాంబాబు తాలూకా ఒంటి చేత్తో నడపబడుతున్న సైకిలు ఇతనెదురౌస్తే అదరదూ మరి. అదురుతుంది. అందులోనూ మంజుల నవ్విందని ఆ ఒంటి చేయి కూడా అదిరే వుంటుంది. పాపం సైకిలు అదరడం కాదు గాని మన సుబ్రమణ్యం బెదిరి పోయాడు. అవునయ్యా మరి.... ఆ సైకిలు అటూ ఇటూ తిప్పేస్తుంటే ఎటు వెళ్ళాలో ఎలా తెలుస్తుంది. పోనీ బెదిరాడనుకో ఆ బెదిరినప్పుడే తన బెదురు ఎవరైనా చూసారేమోనని అటూ ఇటూ చూడ్డం దేనికి? చూడడూ మరి.... స్టూడెంటు! ఇసుమంత చెడు జరిగినా ఏదో పెద్ద అవమానం కింద లెక్క కట్టే బాపతు. మంజుల నవ్వడం చూసాడు. చూస్తాడు. ఆనాడు ద్రౌపది మయసభలో నవ్వినందుకు దుర్యోధనుని కెంత కోపం వచ్చింది? అయితే సుబ్రమణ్యాన్ని దుర్యోధనునితో పోల్చం. పాపం చాలా బుద్ధిమంతుడు. అంత కోపం వచ్చిందన్న మాట. గడ్డి పోచలా కన్పించానా తను.... ఏదో బెదిరాడు.. ఆలోచిస్తూ చూడలేదు... అయినా దానికి కాదులే నవ్వు... తానేదో పెద్ద... మిస్ కాలేజీనని... గర్వం.... ఎప్పుడూ గిరగా ఉంటాయి చూపులు... అయినా ఆడదానికి అంత అహంకారం పనికి రాదు... తోటి వాళ్ళు మనుషులే గాని గడ్డి పోచలుకారు.

ఆ పదిన్నర గంటల వేళ ఇంకా బెల్లు కాలేదని సదరు కాలేజీలోనే తన డిపార్టుమెంటు బయటి వరండాలో తచ్చాడుతున్నాడు ఆనందరావు. ఆనందరావు ఎవరో అనుకునేరు. ఆ కాలేజీలోనే పని చేస్తున్న లెక్చరరు. ఇంకా చెప్పాలంటే ఈ సోకాల్డ్ మంజుల తండ్రికి మంచి దోస్తు. అయితే కావచ్చు. పాపం పిల్ల నవ్వింది కదా.... ఎందుకు నవ్వింది? ఎలా నవ్వింది? ఎవరిని చూసి నవ్వింది? అని పరిశీలించాలా? పరిశీలించడూ మరి... ఎంత లేదన్నా వాడూ తనూ కావలసిన వాళ్ళు. మంజుల నవ్వడమూ, రాంబాబు కర్చీఫ్‌తో ముఖాన్ని తుడిచి మేఘాల చాటునున్న చంద్రుడిని బయటికి తెచ్చి చూపించినట్లు ముఖం చూపడం... ఆ పరవశంలో చెయ్యి వణకడం.. అన్నీ చూసాడు ఆనందరావు. అన్న దొంగ పిల్లా... ఈ రాంబాబుగాడసలే కేడీవాడే— వాడితో నేమిటి? ఇలా కాదీ అమ్మాయికి, వీళ్ళ నాన్నతో చెప్పి చదువు మాన్పించి,

ఫెర్టిలైజేషన్ చేయించేయాలి.ఆ అందులోనూ తనకు తెలిసిన బుద్ధిమంతుడొకడున్నాడు...

ఆ పదిన్నర గంటల వేళే..."చిరునవ్వు నవ్వుతావు కాని హలో అని పలకరించవు కదా! పలకరిస్తే ముత్యాలు రాలిపోతాయి కాబోలు." ఎదురైన సుమలత పలకరిస్తూనే అలక చూపింది. ఆ అలకకు సమాధానంగా మరో చిరునవ్వు విసిరి క్లాసుకు తీసుకు వెళ్ళింది మంజుల.

క్లాసులో కూర్చుందన్నమాటే గాని మంజులకు పాఠం మీద ధ్యాస లేనేలేదు. ఎలా వుంటుంది? ఉండదు. బోడిపాఠం.... ఇకనామిక్స్ ఈజ్ ఇకనామిక్స్.... ఇది లెక్చరరు గారు చెప్పేది. ఇకనామిక్స్ ఇకనామిక్స్ కాకపోతే ఇంకేమవుతుంది? అబ్బబ్బ... ఏదో ఉద్దేశ్యంతో ఏదో చెప్పబోతారు వీళ్ళు......

అవునూ..చిరునవ్వు నవ్వితే.. తేరిపార చూడనైనా చూడడేం అతను? హు ... గొప్ప సిగ్గు పాపం... ఆడపిల్లలంటే మరీ సిగ్గు.... స్త్రీని చూసి సిగ్గు పడే మగవాడంటే స్త్రీకి మక్కువ లని సోమర్ సెట్‌మామ్ అననే అన్నాడు... అలాగా నాకు కూడా అతనంటే అంత ఇష్టమా? అమాయకంగా చూస్తాడు.. తల దించుకుంటాడు ఎదురైతే... ఎప్పుడు నవ్వి మామూలుతో పలకరిద్దామన్నా వీలు కల్గించడు... ఇవాళ చూసాడు.. కాని ఏదోలా కొరకొరా చూసాడు.. నామీద ఏమైనా కోపమా?.. అబ్బే నామీద కోప మేమిటి? తననీ ప్రేమ జంజాటంలో కీడ్చవద్దని కాబోలు... ఆ చూపుల కర్థం... పిచ్చివాడు... గొప్పసిగ్గు... ఆడ పిల్లల కుండవలసిన సిగ్గు పోయింది ఈ కాలం... మగ పిల్లలు సిగ్గు పడుతున్నారు... అయితే అందరి విషయంలోనూ కాదు. ఒక్క సుబ్రమణ్యం విషయంలోనే తనింత వరకూ చూసింది. లేబరేటరీలో ఫైనలియర్ వాళ్ళు కలిసినపుడు ఎప్పుడు తన పక్క చూసినా పలకరించ బోతుంది. వెంటనే తల దించుకుంటాడు తను.... లేబొరేటరీలో ఉన్న మూడు గంటల లోనూ కళ్ళతో ఎన్నో మాటాడుతుంది తను... అబ్బే ఒక్కటీ అర్థమై చావదు కదూ.. ఇంత తెలివైనవాడూ... కళ్ళలోని మాటలు అర్థం చేసుకోడేం? ఖర్మ!

"ఇకనామిక్స్ డెఫినిషన్ ఏమిటో సరిగా బోధపడలేదు. కొంచెం చెప్పవోయ్" వెయిటింగ్‌రూంలో అడిగింది సుమలత.

"నేనూవినలేదోయ్" మర్యాదగా చెప్పింది మంజుల.

"మరికొయ్యకోయ్...ఇంత క్లవర్ హెడ్డు నేను వినలేదూ, నాకు రాదూ అంటే ఎవరు నమ్ముతారు?"

"అబ్బబ్బ నేను వినలేదంటే నీక్కాదూ ఏదో చికాకుల గురించి ఆలోచిస్తుంటే"

"అవును తెలుసులే అమ్మా...చెప్తేనాకె క్కడ వచ్చేస్తుందో. ఇవాళరాత్రి ఎంత వరకూ చదవడమో..... ఏవిటేవిటీచదవడమో ఆలోచిస్తుంటావ్. ఏవేవి ఎంత వరకూ చదివేవని మర్నాడడిగితే అబ్బే ఏడు గంటలకే పడుకున్నానంటావ్....చెప్తేతప్పేనట్టూ....ఆలోచించటానికి ఇంతకన్నా, చికాకులేమున్నాయ్ నీకూ.... డబ్బున్నవారి అమ్మాయివి."

సాగిపోతోంది ధోరణి. వినడం ఎప్పుడో మానేసింది మంజుల. సాధారణంగా మనకు కావలసిన మాటలే విన్పిస్తుంటాయ్.

వాళ్ళనాన్నతో చెపుదాం అనుకుంటూనే పాపం తీరుబాటు లేక కలవడం పడలేదు ఆనందరావుకి.....ఈ సందర్భంలో పెద్దలు మరో జనరలైజేషన్ వదిలేస్తారు. ఆలస్యం అమృతం విషం.

ఆనందరావుకి తీరుబాటు లేని ఈ చాలా కాలంలో ఎన్నో జరిగాయి మంజులకు హాయిగా......

సుబ్రమణ్యం ఎదురైనప్పుడు రెండు మూడు సార్లు చిరునవ్వు నవ్వింది, మంజుల ఎవ్వరూ చూడకుండా. మొదట్లో గాభరా పడ్డాడు. రెండోసారి జరిగిన అవమానాన్ని గుర్తు చేస్తోంది కాబోలను కున్నాడు. మూడోసారి నాలుగోసారి అయోమయావస్థలో పడ్డారు. రానురాను అర్థం చేసుకోవటంతో ఆమెమీద దురభిప్రాయం పోయినట్టనిపించింది. నీటుగా గోటుగా ట్రిమ్‌గా చిరునవ్వు నవ్వడం ప్రారంభించాడు. ఎవరూ? సుబ్రమణ్యం! సుబ్రమణ్యమేనా అనిపించింది మంజులకు. అన్నా సీజనే మారిపోయిందే అనుకుంది. సంతోషించింది. కళ్ళతో ఇప్పుడు ఫ్రీగా మాట్లాడు కుంటున్నారు. నోటిమాటల కింకా ధైర్యం రాలేదుగా మరి.

"సుమా! ఇవాళ ఫస్ట్ షోకు మినర్వాకు వెళ్దామే" అర్థం చేసుకుని మినర్వాలో వాలేవాడు సుబ్రమణ్యం. "ఒరేయ్ ఇవాళ పౌర్ణమిరోయ్ బీచికి వెళ్దాం. కెరటాలు ఎంత ఎత్తుగా వస్తాయో...." అంటూంటే అబ్బా ఇతనికి ప్రకృతి అంటే ఎంత ఇష్టం అని చెప్పేసేసి సుమతో వెళ్ళేది మంజుల.

రంగు, రుచి, వాసన చూసి దాని సంగతే విటో పసిగట్టేవాళ్ళల్లో సుమ ఒకర్తె. ఒకరోజున ఉన్న మాటను కక్కేసింది సుమలత.

"ఏమోయ్..సుబ్రమణ్యం అంటే యిష్టంలాగుంది.." సాధారణంగా నిజాలైనా ఒప్పుకోరు ఆడాళ్ళు. అమ్మో అందరికీ తెలిస్తే ఎలా? అందులోనూ సుమలత లాంటి సిసింద్రీకి తెలిసిందంటే ఇంకేమైనా వుందీ?

"చచ్చ సుబ్రమణ్యమా! ఆడపిల్లని చూస్తేనే తలకాయవంచుకునేంతసిగ్గు. అయితే ఆడదేం ఇష్టపడుతుందోయ్" అలాంటివాళ్ళంటే ఆడాళ్ళు ఇష్టపడతారన్న సంగతి మంజులకు బాగా తెలుసు.

పాపం మోసపోయిందో, నమ్మినట్టుగా అలా నటించిందో గాని మరో ప్రశ్న వేసింది సుమలత.

"పోనీ రాంబాబంటె ఇష్టమా?"

"రాంబాబా?"

సినిమాల్లో ఒక్కోసారి కొట్టేసారేస్తారు ఇలాంటి సమయంలో ఆవెయిటింగ్ రూం ప్రక్కనుంచి వస్తారా? వచ్చి సినిమాల్లోలాగా, అద్దంమీదనీడ, చెవి ఒగ్గి వినడం......మిగతా వన్నీ అవాస్తవికం అనుకోండి..

కాని ఇక్కడ ఆనందరావు వెయిటింగ్ రూమ్ ప్రక్కనుండి అదె సమయానికి రావడం మాత్రం జరిగింది.. ఇందాకనే చెప్పుకున్నాం. కావలసిన మాటలు ఎంత దూరానున్నా విన్పిస్తాయి. రాంబాబన్న మాట లేడీస్ వెయిటింగ్ రూమ్‌లోంచి రావడమేమిటా అని ఆశ్చర్యపడి.. అన్న వారెవరా అన్న ఉత్సుకతతో లోపలికి చూసాడు ఆనందరావు. సాక్షాత్తూ మంజుల.

అన్నా! శ్రుతిమించిరాగానపడుతోందే. అని చెప్పేసి ఆవేళసాయంత్రమే వాళ్ళ నాన్నని కలుసుకోవాలను కున్నారు. సాయంత్రానికి తాను మరచి పోనవచ్చు.. అదీగాక మంజుల

ఇంటిదగ్గరే ఉంటుంది.. అని ఆలోచించి వెంటనే కాజువల్ లీవు పెట్టి కాలేజి దాటిపోయాడు ఆనందరావు.

"మంచిపనయింది మంజులకి. ఆనంద రావులాంటి పెద్దలుండబట్టి ఈలోకం ఇలా నడుస్తుందిగానీ" ఇంతవరకూ చదివినపెద్దలు అనుకుంటారలా. "యువతీ యువకులపాలిట ఈపెద్దలే బ్రహ్మరాక్షసులుసుమా.. లేక పోతే మధ్యలో ఈవిలనేవిటి?" అనుకుంటారు యూత్.

లోకంలో ఎవరూ మంచివాళ్ళుకారు, ఎవరూ చెడ్డవాళ్ళుకారు. ఒక్కొక్కరి ఆలోచనలను బట్టి వాడు మంచి వీడు చెడు నిర్ణయించుకుంటారు. దొంగ మనకు దొంగ. మన ఆలోచనలకు దొంగ వాడితరపున ఆలోచిస్తే...కడుపు జరక్క, పని దొరక్క దొంగతనం తప్పేంలేదే అంటారు. నిజమే మరి. అలాగే హంతకుడు మన ఆలోచనలకు హంతకుడు. వాడితరఫున ఆలోచిస్తే....ఏదో బలవత్తరమైన కారణం ఉండబట్టి హత్య చేసాడు. నువ్వే ఆస్థిలో వుంటే ఉద్రేకం ఆపుకోలేక నువ్వూ చేస్తావు. అంటారు. అదీనిజమే.

అయితే ఇక్కడ జరగవలసింది మాత్రం జరిగింది. "ఏరా! కూతుర్ని అలానేపెంచుకుంటావట్రా........" అంటూనే గుమ్మం ఎక్కాడు ఆనందరావు.

నవ్వు

"ఒహో! ఎంతకాలానికిరా! వూళ్లో ఉండి రావటం లేదేవిట్రా...... ఒసేయ్ కాఫీ పట్రా.....కూర్చోరా......"

ఈగాభరాతో ఆనందరావు గాభరా కొంత తగ్గింది. తాపీగా చెప్పారు. "మంజులపనేం బాగా లేదురా. కాలేజి చదువుమాన్పించి సుబ్బరంగా రేపు ఆషాఢ మాసం దాటంగానే మూడుముళ్ళు వేయించేయ్. నీకూ వయసు దాటుతోంది. అందులోనూ ఒక్కర్తే ముద్దుబిడ్డ.. ఆలోచించేచెప్తున్నా... ఊఁ... ఏవంటావ్"

పెద్దలమాటలు భలే తమాషాగా ఉంటాయి. వింటున్నకొద్దీ వినాలనిపిస్తుంది. ఈమూడు ముక్కల్లో చెప్పిందేవీ లేక పోయినా ఆపెద్దాయనకి కూడా అంతా అర్థమైపోతుంది. ఆకాలేజీలోనే పని చేస్తున్నాడు. తన క్షేమంకోరేవాడు. మంజుల గురించి ఉత్తినే చెడుగా చెప్తారా?

అదేకుర్రాళ్ళయితే ఆయనతో ఎలా చెప్తారూ? "ఏవండోయ్! మీ మంజుల సంగతేం బాగా లేదు. రాంబాబుకి సైట్లు కొడ్తోంది. పావురాలు కూడా నడుస్తున్నట్టున్నాయి."

ఇంతా ఆలోచించి "సరేన్రా! ఆనందరావ్. నీకుమాత్రం తెలియదా? నీ ఎరికనేవైనా మంచి సంమ్మంధాలుంటే చెప్పు. తప్పకుండా చూద్దాం. ఈపెళ్ళికార్యం కూడా నువ్వే బాధ్యత వహించాలిరా.."

అంతపెద్ద పని అప్పగించి అమాంతం పెద్దమనిషిని చేసేసి తైరుకొడ్తే ఎవరైనా చేసేస్తారు. వెంటనే మహా ఇదయి పోయి తన ఎరికనున్న ఒక సంమ్మంధం, ఆ ఒక సమ్మంధం తాలూకు పుట్టుపూర్వోత్తరాలు ఏకరువు పెట్టేసి అగ్గిరాజేసి వెళ్ళిపోయారు ఆనందరావు.

అగ్గి భగ్గుమంది మంజులరాగానే.

"అమ్మాయ్...నీ సంగతేం బాగాలేదని ఆనందరావు చెప్పారు."

"అవునునాన్నా. ఇవ్వాళంతా నాకు తలనొప్పిగా వుంది"

"హాస్యం కాదమ్మాయ్... కాలేజీలో నీప్రవర్తన ఏం బాగా లేదటగా...ఇంకెన్నాళ్ళలే......నీకు పెళ్ళి నిశ్చయించేసాం."

సినిమాల్లోలాగా పిడుగు పడలేదు. తాపీగా అడిగింది.

"ఎవరు నిశ్చయించారు నాన్నా?"

"ఆనందరావూ, నేనూ"

కాలేజీలో తన సంగతంతా ఆనందరావు గమనించి ఉంటారు. అయితే సుబ్రమణ్యం అంటే ఆనందరావుకి చాలా యిష్టంలే. అందుకోసమే కాబోలు నాన్న చేత చివాట్లు పెట్టించబోయారు. అయినా ఆనందరావు నిశ్చయించాడంటే ఏదో అనుమానం వేసింది మంజులకు.

"ఎవరికివ్వాలని నిశ్చయించారు?"

ఎక్కడ ఏడ్చేసి మారాం చేసి గందరగోళం చేసేస్తుందో కూతురు అని భయపడ్డ ఆయన విస్తుపోయారు. అయినా అన్నీ విని నాకొద్దు ఈ సంబంధం అని కుండ బ్రద్దలేసిందంటే బ్రహ్మదేవుడుకూడా చేయలేడీ పెళ్ళి. తనంత అశక్తుడు కూతురి దగ్గర.

బెరుకుతోనే చెప్పారు.

"సుబ్రమణ్యం అని మీకాలేజీలోనేచదువుతున్నాడటగా ..అతని గురించి ఆనందరావు చాలా..........."

ఇంకేం వినలేదు మంజుల, మహాసిగ్గుపడిపోయింది. కుంచించుకు పోయింది, వరిగి పోయింది. పారి పోయింది.

ఈ ఏక్షన్లన్నీ చూసి పెళ్ళంటే ఆడపిల్లలకెంత సిగ్గు అని అమాయకంగా అనుకున్నాడాయన. ●


రాగగీతి

నింగిని మేఘములల్లెను హేలగ
నెమళ్ళు పురులను విప్పెను లీలగ
చంద్రుడు కరములు చాపెను తిన్నగ
కలువలు కన్నులు విచ్చెను మిన్నగ
వెన్నెలభూమిని నింపెను సొంపుగ
కోమలిరాగము తీసెను ఇంపుగ
చేతులు వీణను మీటెను మృదువుగ
సప్త సర్వములు చిలికెను మధువుగ
మద్దెల మ్రోతలు మ్రోగెను మెల్లగ
కాలిని గజ్జెలు కదలెను పెల్లుగ
మదిలో తలపులు కలిగెను కొల్లగ
గొంతుక వాటిని పాడెను చల్లగ.

'జయప్రియ'



కొన్ని చూడదగిన
చిత్రాలు
ఆత్మగౌరవం
తోడూ-నీడా (?)
పరమానందయ్య శిష్యుల కథ
చిలకా గోరింగా
మారని మనసులు


బలము మరియు శక్తి కోసం!
పాలు
కోకో
మాల్ట్
పంచదార
Cadbury's
Bournvita
THE IDEAL FOOD DRINK FOR STRENGTH AND VIGOUR
బోర్న్‌విటా పోషకత్వమునకు సముచితమైనది.
కండరములు మరియు టిస్యూలను బలపరచుటకు ప్రోటీన్లు
బలము మరియు శక్తి కోసం కార్బొహైడ్రేట్లు, ఎముకలను
దృఢముగా చేయుటకు ఖనిజ లవణములు మరియు ఆరోగ్యమునకు
అతి ముఖ్యమైన విటమిన్‌లు మీకు లభించును. బోర్న్‌విటా,
తయారు చేసుకోవడం సులభం మరియు అది రుచిగా కూడా నుండును!
క్యాడ్‌బరీస్ బోర్న్‌విటా
BENSONS/I-CF-25

శ్రీమతి సాధనమూర్తి

సేండ్‌విచ్‌లు - పుడ్డింగ్‌లు

సేండ్‌విచ్‌లకు సరియైన తెలుగు పదము ఏమిటో గాని సేండ్‌విచ్‌లను గూర్చి కొద్దిగా తెలియ చేస్తాను.

బ్రెడ్ (డబుల్‌రొట్టెను) పలచని నలుచదరపు ముక్కలను కోయాలి. అలాంటి రెండేసి ముక్కల (స్లయిసుల) మధ్య వండినవి కాని పచ్చివి కూరలు లేదా పచ్చళ్ళు లేదా వెన్న జామ్‌లు పెట్టే దాన్ని సేండ్ విచ్ అంటారు. సాధారణంగా బేకరీలలో వాళ్లే ఈ బ్రెడ్‌ను ముక్కలుగా కోసి ఇస్తారు. లేదా మనమే బ్రెడ్ కోసే కత్తి (అని విడిగా ఉంటుంది) తో పలచగా కోసుకోవచ్చు. ఈ బ్రెడ్‌ను చాలారకాలుగా తినడానికి ఉపయోగించుకో వచ్చును.

(1) ఈ ముక్కలను వట్టివే పెనం మీద కాల్చుకుని తినవచ్చును.

(2) కొద్దిగా 'డాల్డా'గాని నెయ్యిగాని వేసి ముక్క ముక్క విడిగా రెండు వేపులా ఎర్రగా కాలేటట్లు చూడాలి. తరువాత తీయాలి.

(3) ఒక కోడిగుడ్డు, సగంగ్లాసు పాలు, నాలుగు చెంచాల పంచదార బాగా కలిపి అందులో ఈ బ్రెడ్‌ను ముంచి రెండు వేపులా పెనంమీద నెయ్యికాని, డాల్డా గాని వేసి (నూనె వాడరాదు) రెండు వేపులా ఎర్రగా కాల్చి తీసి తినడానికి ఉపయోగించుకోవచ్చు.

(4) లేదా పాలు లేకుండా కోడిగుడ్డు సొనలోనే బ్రెడ్ ముక్కలు ముంచి తీసి పెనం మీద నేయితో కాల్చవచ్చు.

తరువాత ఇక కూరలు పెట్టేటప్పుడు:

(1) బ్రెడ్ ముక్కలను ఇష్టమున్నవారు కాల్చిగాని పచ్చిగా కాని వాడవచ్చు.

(టమాటో కూరతో)

పచ్చి టమాటాలను రింగులుగా కోసి రెండేసి ముక్కల మధ్య ఉంచవచ్చు. లేదా కూరగా కావాలనుకుంటే రెండు టమాటాలు పచ్చి మిరప ముక్కలు ఉప్పువేసి కూరగా వండి ఆ కూరను ఆ బ్రెడ్ మధ్య పెట్టవచ్చు. వీటితోపాటు ఇష్టమున్న వాళ్ళు ఉల్లిపాయ ముక్కలు కూడా పెట్టుకోవచ్చు.

బంగాళాదుంపలు రింగులుగా కోసి ఉప్పువేసి ఉడకపెట్టి దానిని ఈ బ్రెడ్ మధ్యలో పెట్టుకుని తినవచ్చు. ఇలాగే మీ దగ్గర ఏ వైన మీ కిష్టమున్న వండిన కూరలు వీటి మధ్య పెట్టుకు తినవచ్చు.


పచ్చళ్లతో: మనం మామూలుగా వాడుకునే ఆవకాయి, మాగాయి, చింతకాయ నిమ్మకాయ ఏది నచ్చితే అది పలచగా రాసుకుని తినవచ్చు. ఇదికాక కొత్తిమీర పచ్చడితో చేసిపెట్టే చాలా రుచిగా ఉంటాయి. ఒక పెద్ద కొత్తిమీరకట్ట నాలుగు కాని ఎనిమిది కాని పచ్చిమిరప కాయలు (మీరు తినే కారాన్ని బట్టి) ఉప్పు వేసి ముద్దగా నూరి అందులో ఒక నిమ్మకాయ పిండి దాన్ని పల్చగా ముక్కలకు అంటించి తినవచ్చు. ఇదే విధంగా పుదినా తోను కరివేపాకుతోను కూడా పచ్చళ్ళు చేసి పెట్టవచ్చు. ఇష్టమున్నవాళ్ళు అల్లం పచ్చడి కూడా పెట్టవచ్చు. ఒక చిన్న అల్లం ముక్కను కొంత ఉప్పువేసి కాటుకలా రుబ్బి నిమ్మరసం పిండి చేసి చూడండి. అల్లం ఘాటు కనుక కారం అక్కర్లేదు.

ఇక తీపిగా కావాలనుకున్నవారు కావలసినంత వట్టి వెన్న కాని లేదా వెన్న ఉప్పుతో గాని వెన్న పంచదారగాని రెండు వేపులా పూసి తినవచ్చు.

తరువాత బజార్లలో సీసాలల్లో డబ్బాలల్లో రకరకాల పండ్ల జామ్‌ల దొరుకుతున్నాయి. ఇంట్లో తయారయినవి అయినా సరే వాటిని బ్రెడ్ ముక్కలకు రెండు వేపులా పట్టించవచ్చు. ఇది పిల్లలకు బడికి కూడా ఇవ్వవచ్చు. ఆరు నెలలు నుండి పిల్లలకు అన్నం పెట్టాలని చూస్తారు. వాళ్ళు ఆ అన్నం తినలేని పక్షంలో బ్రెడ్ ముక్కలు చేసి పాలల్లో నానవేసి ఉప్పుగాని పంచదార గాని కలిపి తినిపించవచ్చు. ఇలా రోగులకు మాత్రమే పెడ్తారని అనుకోవద్దు. అసలు పిల్లలకు అన్నమే గాదు ఏది అడిగితే అది పెట్టడం మంచిది.

ఇక నాన్ వెజిటేరియన్ వాళ్ళు తమకు ఇష్టమున్న మాంసం కూరను వండినది పచ్చిది కాదు ఆ రెండు ముక్కల మధ్య పెట్టవచ్చు. లేదా ఉడకబెట్టిన కోడు గుడ్డను రింగులుగా కోసి ఉప్పువేసి పెట్టవచ్చు. కోడు గుడ్డు కూరగాకావాలనుకున్నవారు ఒక గుడ్డు ఒక ఉల్లిపాయ రెండు మిరపకాయలు ఉప్పువేసి వండాలి. తరువాత బ్రెడ్‌ను నేతిలో ఎర్రగా వేయించి దానిమీద ఈ కూరను పెట్టి తినవచ్చు. ఇలాగే చేపల కూరను ముల్లు తీసేసి బ్రెడ్ ముక్కల మధ్య పెట్టి తినవచ్చు. అలాగే కోడి కూరకూడా పెట్టవచ్చు.

ఈ బ్రెడ్ మధ్యలో ఏది పెట్టినా మార్పు కోసమే కనుక మీకు నచ్చినది మారుస్తూ ఉండవచ్చు. ఈ బ్రెడ్ ఉదయం టిఫిన్‌గానే కాక రాత్రి భోజనంగా కూడా వాడవచ్చు. ఇంగ్లీషు భోజనం అంటే రెండు సేండ్‌విచ్‌లు ఒక గ్లాసు సూప్ప, పచ్చి కూరలు కొన్ని, మాంసం, ఒక గుడ్డు



షాపింగ్‌కు ఉపయోగించే ఈ కారును జర్మనీ ఉత్పత్తిచేయ దలచింది. మూడువేల జర్మన్‌మార్కుల ఖరీదుగల దీనిలో 50 మైళ్ల వేగంతో ఒక్కరు ప్రయాణం చేయవచ్చు.

వనితాలోకం

ఉంటాయి.

పుడ్డింగులు:—

పుడ్డింగు అంటే కూడా సరియైన తెలుగు పదం ఉన్నట్లు లేదు. ఈ పుడ్డింగును చాలా రకాలుగా చేయవచ్చు. ఇది భోజనంగా కాక భోజనం తరువాత తినే తీపి పదార్థం. దీనిని కోడిగుడ్లతో కాని కోకో, బోర్నవిటా, పండ్లు, బ్రెడ్ ఏది ఇష్టముంటే దానితో చేసుకోవచ్చును. ముందు పుడ్డింగు చేయడం చెప్తాను.


రెండు కోడిగుడ్లు, ఒక గ్లాసు పాలు, ఆరుచెంచాల పంచదార.

రెండు గుడ్లను నురుగు వచ్చేవరకు బాగా కలపాలి. పాలల్లో పంచదార నాన వేసి దాన్ని దీంట్లో వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో నిళ్ళుపోసి దాని మధ్య ఈ మిశ్రమ గిన్నెను పెట్టి రెండింటికి మూతలు పెట్టి పొయిమీద 10 నుండి 15 ని. వరకు ఉడకనివ్వాలి. ఆ సమయం చాలు. ఇది జున్ను ముక్కలా తయారవుతుంది. ఇది చల్లార్చి గాని వేడిగా గాని తినవచ్చు. సువాసనకు ఏలకుల పొడి వేయవచ్చు. ఇలా చేసిన దానిని పుడ్డింగు అంటారు. ఇక మార్పు కోసం దీంట్లో ఇష్టమున్న దానిని కలుపుకో వచ్చు.

అంటే రెండు గుడ్లను కలిపికొట్టాక పాలు పంచదార కలిపాక రెండు చెంచాలు కోకో గాని, బోర్నవిటా గాని వేయవచ్చు. ఇది కాదనుకుంటే రెండు అరటిపండ్లు ముక్కలుగా గాని గుజ్జుగా గాని లేదా ఒక ఏపిల్‌ను ముక్కలుగా గాని లేదా రెండు సపోటా పళ్ళ ముక్కలు కాని లేదా ద్రాక్ష, బత్తాయి, కమలా పండ్ల తోలు తీసి గింజలు తీసి కాని కలుపుకుని చేయవచ్చు. ఇలాకాక ఎండు ద్రాక్షగాని, జీడిపప్పులుకాని ఇంకా బజార్లో దొరికే చాలా రకాల ఎండు పండ్లు ఒకటిగా కాని రెండు మూడుగా కలిపి కాని తయారు చేసుకోవచ్చు. అయితే కోడిగుడ్లు పాలు పంచదార మటుకు తప్పనిసరి. మిగతావి కలిపేటప్పుడు మీ ఇష్టమున్నవి వాడవచ్చు.

ఈ పుడ్డింగులను చిన్న పిల్లల నుండి పెద్దవాళ్ళు పండ్లు లేని వాళ్ళు కూడా తినవచ్చును. ఇది తిన్నందువల్ల బలం కూడా ఉంటుంది. ●





అవసరంలేదు. నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావో కూడ తెలుసు."

"ఎందుకొచ్చానంటావు?" ఎదురుప్రశ్న వేశాను.

"అదీ నాతోనే చెప్పించాలా?"

ముసుగులో గుద్దులాట లాభంలేదని తెలిసిపోయింది. సూటిగా అడిగాను.

"ఆ శశినే ఎందుకు పెళ్ళాడాలిరా?"

"ఏం నువ్వెందుకు శాంతి అత్తయ్యనే పెళ్ళి చేసుకున్నావు?" కాసేపటి దాకా సమాధానం ఏం యివ్వాలో నాకు తోచలేదు.

"శాంతి క్లబ్బుల్లో డాన్సు చెయ్యదు" అన్నాను ఆఖరుకి.

"శశి క్లబ్బుల్లో డాన్సు చేస్తుందని అమ్మ చెప్పిందా? ఒక్క నాతోనే ఒక్కసారి డాన్సు చేసింది" గర్వంగా చెప్పాడు.

నేనేం మాట్లాడలేదు.

"ఇదుగో మామయ్యా నువ్వు మౌనం వహించి ఈ విషయాన్నేదో పెనుభూతంలా తయారు చేద్దామని ప్రయత్నించకు. శశి ప్రొఫెషనల్ డాన్సర్ కాదు—నీ మనసులోది అదవుతే. ఇక ఫ్యాషనబుల్‌గా వుండా అది తప్పుకాదు. ఈ కాలంలో కూడ అమ్మాయి అని వంటింట్లో కూర్చోమంటే ఎలా? పైగా శశికి వంటింట్లో కూర్చుంటే కుదరదు. కాన్వెంట్‌లో చదివే ఓ తమ్ముడు కుంటి తల్లీ వున్నారు. మరి ఉద్యోగం చెయ్యకపోతే ఎలా?"

ఈ మాటూ నాకు మౌనమే శరణ్యం అయింది. ప్రకాశం కాసేపు ఆగాడు. ఆవేశం అణచుకొంటున్నట్లు స్పష్టంగా అగుపడుతోంది.

నమస్కార పరిష్కారం

(12వ పేజీ తరువాయి)

"నాకు తెలీక అడుగుతాను కాని డాన్సు చేస్తే ఏమిటి తప్పు?" అన్నాడు.

"సరియైన గృహిణిగా రూపొందలేదని అమ్మ భావం."

"అమ్మ భావం మాత్రం అయి నీ భావం కానందుకు సంతోషిస్తున్నాను మామయ్యా. క్లబ్‌లో ఒకసారి డాన్సు చేసినంతమాత్రాన సరియైన గృహిణిగా రూపొందలేదనటం నాకు సమంజసంగా గోచరించదు. నీకు తెలీదేమో. శశివల్లే నేను పేకాట మానేశాను. నువ్వు నమ్మవుగాని క్లబ్బుల్లో డాన్సులు చేయటం, రాత్రింబగళ్ళు అక్కడే వుండటం ఎంత అసహ్యంగా వుంటుందో నాకు తెలియజేయడానికే ఆమె డాన్సు చేసింది. అమ్మ నేను మారానని నీతో అని వుండదు. అసలు ఆమె నమ్మితేగా? అయినా ఈ మంచికి అంతెక్కడిది మామయ్యా? నాతో అంతా మంచే వుందా—శశిలో అంతా మంచినే కోరటానికి?"

"శశిలోని చెడు ఏమిటి?"

ప్రకాశం కోపంగా చూశాడు నావంక. "మనుష్యులని ఇరుకులో పెట్టి ప్రశ్నలడగటంలో నువ్వు దక్షుడివి మామయ్యా. పోనీగాని, అమ్మతో నువ్వు చెప్పకపోయావా?"

"ఏమని"

ప్రకాశం మొహం అటు త్రిప్పుకొని అన్నాడు "ఆ చాదస్తం మానమని."

"చాదస్తమేముంది ఇందులో?"

నన్ను విచిత్రంగా వీక్షిస్తూ అన్నాడు ప్రకాశం "మైగాడ్! ఆమాత్రం తెలీదూ నీకు? పాతకాలం వాళ్ళలా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్ళని అనుకోవటం!"

"ఆకుందేటికి మూడేకాళ్ళున్నాయేమో?" అన్నాను.

"అమ్మలా మనుష్యులని చూడకుండానే మాట్లాడకు. శశిని చూశాక చెప్పు నీ అభిప్రాయం. నేను తొందరపడి జీవిత భాగస్వామిని నిర్ణయించుకోబోతూంటే సావధానంతో సలహా యిచ్చే అధికారం నీకుంది."

"సలహా యిచ్చే అధికారం మాత్రమేనా?"

"అంతే. ఎందుకంటే ఇది నా జీవిత సమస్య—నీదికాదు, అమ్మదీ కాదు..." కాస్త ఆగి అన్నాడు "ఎనిమిదింటికే కాలేజి వుంది సాయంకాలం చూపెడతాను శశిని."

* * *

అన్నట్లుగానే సాయంకాలం బీచిలో పరిచయం చేశాడు శశిని ప్రకాశం నాకు.

"నమస్తే" అంది చేతులు జోడిస్తూ.

ప్రతినమస్కారం చేస్తూ ఆమెని పరికించి చూశాను. శశి చక్కటి అందగత్తె అనటం మాత్రం నిస్సందేహమైన విషయం. అక్కయ్య చెప్పినట్లుగా పూర్తిగా ఆంగ్లోయిండియన్‌లా లేదు. కనీకనబడనట్లుగా వున్న నుదటి మీది ఎర్రబొట్టు ఆమె శరీరచ్ఛాయ ముందు వెలవెలా బోతోంది. రెండు జడలు వేసుకొని వుంది. ఆకుపచ్చని టెర్లిన్ చీరలో ఆమె విగ్రహం హుందాగా కనబడుతోంటే, ఆమె కళ్ళు చిలిపితనాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఆమె ప్రతి కదలికా ఆలోచించి చేస్తున్నట్లు వుంది. మొహం మీద, తన స్థితిగతులతోను, చుట్టుపట్ల పరిసరాలతోను సమన్వయించుకొనే వ్యక్తిత్వం గల సంతృప్తి గోచరిస్తోంది.

ఇసకలో కూలబడ్డాము.

ఏం మాట్లాడాలో, ఎలా విషయాన్ని కదల్చాలో నాకు అవగాహన అవటంలేదు.

"ఎన్నిమార్కులు వేశారు?" అంది శశి.

"ఏమిటి?" అన్నా ఆశ్చర్యంగా.


"నన్ను పరీక్షింపటానికి వచ్చారుగా. ఉత్తీర్ణురాలి నవగలుగుతానా అని అడుగుతున్నాను." అంది.

చిన్నగా నవ్వాను.

"నువ్వింత గుంభనగా వుండాల్సిన అవసరంలేదు మామయ్యా. అసలు విషయంలోకి దిగు. వెళ్ళేలోగా తాడో, పేడో తేల్చి వెళ్ళు" అన్నాడు ప్రకాశం.

"నేనెవర్నిరా తేల్చటానికి? తేల్చుకోవలసింది, అక్కయ్య, నువ్వు, శశిమా."

"మరి నువ్వెందుకు వచ్చినట్లు?"



"ఆ డ్రైవర్లిద్దరూ ఇంకా-ఎంతసేపు మాట్లాడుకుంటారో అర్థంకాకుండా వుంది."

"అదే నాకూ అర్థం కావటంలేదు..." అన్నాను.

ప్రకాశం మాట్లాడలేదు.

"ఆవిడ ఏమన్నారు?" అంది శశి.

"ఎవిడ?"

"మా కాబోయే అత్తగారు" అంది శశి చిన్నగా నవ్వుతూ.

"అంత నిశ్చయంగా చెబుతున్నావే— క్షమించాలి నా ఏకవచన సంబోధనకి"

"ఫరవాలేదులెండి" అంటూ మళ్లీ చిన్నగా దరహాసం చేసింది. ఆ నవ్వు చూస్తుంటే ప్రకాశం ఆమెని పెళ్లాడతానని పట్టుపట్టడంలో తప్పు లేదనిపించింది.

మళ్లీ తనే అంది "మీరు నా ప్రశ్నకి సమాధానం యివ్వలేదు." అని. అసాధ్యురాలే అనిపించింది నాకు.

"ఏమని వుంటుందో తెలుసుకోలేని అమాయకురాలివిలా కనిపించటం లేదు నువ్వు. కాని ఇంత తెలిసీ ముందుగా కాస్త సర్దుకోకపోయా రెందుకని విచారంగా వుంది నాకు." అన్నాను.

"ఏమా ఉద్దేశ్యం?" అంది.

"ఏమీలేదు. కొద్దిగా ఫ్యాషన్లు—అవీ తగ్గించి సనాతన యువతిలా మా అక్కయ్యకి కనబడకూడదూ? ఆమెతో పరిచయం చేసుకొని ఆమె అభిమానాన్ని సంపాదించుకోవటానికి ఎందుకు ప్రయత్నించి వుండకూడదు? అప్పుడీ విషయం ఇంతదాకా వచ్చేదే కాదుగా..."

"చూడండి. పెద్దాళ్లంటే గౌరవం నాకుంది. వారి అభిప్రాయాలని సానుభూతితో పరిశీలించాలనీ తెలుసు. కాని నా వ్యక్తిగత విషయాలని, ఇష్టాయిష్టాలని— అందులోనూ వారికే విధంగా సంబంధించని వాటిని మార్చుకోవాలన్న వాదం నాకు నచ్చదు. పోతే అలా నటించటమంటారా, అది నాకు అసహ్యం."

నొక్కి చెప్పకపోయినా ఆ మాటల్లో నిశ్చయం స్ఫుటంగా వినిపించింది నాకు.

"నా గురించి ఆమె అభిప్రాయం విన్నారు. ఆమె గురించి నా అభిప్రాయం వింటారా?"

"చెప్పు. వినటం మినహా నేను చేస్తున్న పనేమీ వున్నట్లులేదు" అన్నాను.

"నా ఉద్దేశ్యంలో ఆమెకి ప్రకాశం నన్ను వివాహమాడటమేకాదు మరెవరిని వివాహమాడటం కూడ ఇష్టంలేదని..."

"శశీ!" అన్నాడు ప్రకాశం.

"నన్ను చెప్పనివ్వండి. ఒకవ్యక్తి నా గురించి తన అభిప్రాయాలని వెలిబుచ్చినపుడు ఆ వ్యక్తి గూర్చి నా అభిప్రాయం వ్యక్తం చెయ్యటానికి నాకు హక్కు అధికారం వున్నాయి." అని ప్రకాశంతో అని నావేపు తిరిగి అంది "నా మాటలు కరకుగా వుంటే క్షమించాలి."

—"ఫరవాలేదు కానివ్వు" అన్నాను.

"ప్రకాశం అంటే ఆమెకి అమిత ప్రేమ. భర్త పోయినప్పటి నుంచి వారినే ప్రాణంగా చూసుకొంది. ప్రకాశం కోసమే జీవించింది, జీవిస్తోంది. అలాంటి సమయంలో ఒక యువతి అతని జీవితంలో ప్రవేశిస్తే అతనికి తన ఎడగల ప్రేమ తగ్గిపోతుందేమోనని, తన కతను దూరమైపోతాడేమో అన్న భావం ఆమెలో వుంది. ఈ అసంబద్ధ భావం ఆమె నరాలని తినివేస్తూ కుమారుడు ఎప్పటికేనా వివాహితుడు కావాలనే వాస్తవికతను ఆమె విస్మరించేలా చేయిస్తోంది."

శశి అభిప్రాయం వెంటనే ఆమోదించలేకపోయాను నేను. అసలా భావమే వెగటుగా తోచింది. కానీ ఏమో! ఎవరు చెప్పగలరు! అక్కయ్య ప్రకాశాన్ని అమితంగా ప్రేమి

సమస్యా పరిష్కారం

పోయిందని, ఆమె జీవితమంతా వాడి కోసమే నని నాకు తెలుసు. మనసు అంగీకరించినా, అంగీకరించకపోయినా శశి చెప్పిన విషయం నిజం కావటానికి కనీసం అవకాశమేనావుంది.

"సరే. ఇంతకీ ఏం నిర్ణయించారు?" అన్నాను.

"నిర్ణయించటానికి ఇందులో ఏముంది మామయ్యా. నువ్వు ప్రయత్నించి ఏదో విధమైన పరిష్కారం చేస్తావని ఆశిస్తున్నాను. నీ ప్రయత్నాలు కూడ విఫలమయ్యాయా....."

"విఫలమవుతే?"

ప్రకాశం కాసేపటి దాకా మౌనం వహించి తరువాత అన్నాడు

"ఇంతవరకు సున్నితంగా ప్రయత్నించాను. లాభంలేకపోతే కష్టమైన మార్గం అనుసరించక తప్పదు."

"అలాంటి తొందరబాటు పనులు చేయకు. అటు నీ చదువు పాడవటమేకాక నీ భావిజీవితపు పునాదులు కూడ సరిగ్గా పడవు." అన్నాను.

ప్రకాశం మాట్లాడలేదుకాని, శశి మాత్రం నిశ్చలంగా నా వంక చూస్తూ అంది "ఫరవాలేదు. నేను ఉద్యోగం చేస్తూ ఆయన్ని చదివించగలను."

అర్థమైంది నాకు వారి నిర్ణయం.

*   *   *

పోస్టాఫీసులోంచి శాంతికి ట్రంకాల్ చేశాను. శాంతికి అసలు విషయం చెప్పేటప్పటికి మూడు నిముషాలయింది. సంభాషణ అయ్యేలోగా రెండుమాట్లు ఎక్స్టెండ్ చెయ్యాల్సి వచ్చింది.

అంతా విన్న శాంతి గలగలా నవ్వింది ఫోనులో. "వారిద్దరి నిశ్చయం మారదా?" అంది.

"అలానే వుందిమరి" అన్నాను.

"మీరీ సమస్యకి ఏదేనా నాటకీయమైన పరిష్కారం లభిస్తుందేమోనని ప్రయత్నిస్తున్నారా?"

"అలా జరిగితే బాగుంటుంది శాంతి".

మళ్లీ నవ్వింది శాంతి "అసలు మీ ముందు సమస్యే లేదు—మీరు ఆలోచించటానికి, పరిష్కరించటానికి" అంది.

"నువ్వంటున్నదేమిటి శాంతి?"

"వాళ్లిద్దరూ ఏం జరిగినా పెళ్లి చేసుకోదల్చుకొన్నారని స్పష్టమవుతోంది. ఆ వివాహాన్ని ఆపలేరు. అందుకు ప్రయత్నించటం కూడా హర్షింపదగ్గ విషయం కాదు. మరి అలాంటప్పుడు మీ బుర్ర బద్దలు కొట్టుకోవటం అనవసరం. అలా చేసినా మీకు తోచే పరిష్కార మార్గం ఏమీ వుండదు."

"మరి అక్కయ్య?"

"మీ అక్కయ్య తను నిర్మించుకున్న ఊహాలోకం నుంచి బయటపడి చేదు నిజాన్ని ఎదుర్కోవటం నేర్చుకోవాలి. కఠోర వాస్తవికతను తెలుసుకొని భరించటం అలవర్చుకోవాలి. మొదట్లో కాస్త షాక్ ఫీలవవచ్చు. కాని కాలమే ఆమె గాయాలని మాన్పాలి."

"అంతేనా శాంతి? అక్కయ్య ఓడిపోవలసిందేనా?"

"ఇందులో ఆమె గెలుపు, ఓటమీ ఏమీ లేదు. ఇది జీవితం అని ఆమె అన్న మాటని ఆమెకే చెప్పండి. ఈ జీవన పథంలో పరిస్థితులను అనువుగా మలచుకో ప్రయత్నించటమే మానవ ధర్మంకాని, పరిస్థితులు మారనప్పుడు వాటికి తలఒగ్గటం కూడ నేర్చుకోవాలని మీ అక్కయ్యని గ్రహింపజేయండి."

మవునంగా శాంతి మాటలు వింటూండిపోయా. ఆమె చెప్పింది నిజమే. బుర్ర బద్దలు కొట్టుకొన్నా లేని ఈ సమస్యకు సమాధానం లభించదు. అందరికీ అనువయ్యే పరిష్కారం లభించటం అంతకంటే అసాధ్యం.

"ఉన్నారా?" అంది శాంతి.

నవ్వాను. "అక్కయ్యకు ఎలా చెప్పాలో ఆలోచిస్తున్నాను శాంతి" అన్నాడు.

"ఎలా చెప్పటమేమిటి! మామూలుగా చెప్పెయ్యండి. మీరు బాధపడకండి..... అన్నట్లు బాబిగాడి గోల ఎక్కువైపోయింది. మీరు వచ్చేదాకా స్కూల్‌కి వెళ్లాలేడు. త్వరగా వస్తారుగా?"

"అలాగే శాంతి" —

ఫోను వుంచేసి బయటికి నడిచాను. శాంతి చెప్పింది గుర్తుకొచ్చింది.

అవును—ఇది జీవితం.

జీవితం లాగే ఎదుర్కోవాలి దీన్ని! ●

పుస్తకాలు

వీగిన కలలు

(నవల: రచయిత: శ్రీ జవమంచి రామకృష్ణ. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో, మద్రాసు: మచిలీ పట్టణము, సికిందరాబాదు. ప్రాప్తిస్థానం, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు. రాష్ట్రపతి రోడ్డు. సికిందరాబాదు. పేజీలు 146. వెల: రూ. 1—75.)

ఈ నవలలో కథానాయకుడు కిరీటిరావు, ఉఫ్ కిట్రాఫ్ నవల అంతటా కనిపిస్తాడు. అక్కడక్కడా ఇతరేతర పాత్రలు కనిపిస్తాయి. నవలలోని సంఘటనలు అన్నీ అతనికోసమే జరుగుతాయి ఎక్కడో తప్ప. కథ కిరీటిరావు పాత్ర పోషిస్తున్నంతసేపు సామాన్యంగా సాగిపోతూ వుంటుంది. నవల మధ్య నుంచి కనిపించే ఇతర పాత్రల మనోభావాలు, భావ పరిణామాలు హృదయం కదిలిస్తాయి.

కిరీటిరావు ఏకపాత్రాభినయం చేయగల వ్యక్తి. నవ్వు పుట్టించ గలడు. ప్రేమించ గలవాడు, పెళ్ళాడ గలవాడు. అందులోనూ ఎండకన్నూ, వానకన్నూ, ఉప్పూ కారం కన్నూ ఎరుగని అనూరాధను మహా గడుగ్గాయిని పెళ్ళాడాడు. ఇంకా ఆడాడు. శోభతో డాన్సు ఆడాడు. అంతేనా? ఇల్లు విడిచి పారి పోయాడు. కారణం చిత్రకళ! బొమ్మలు గీయ గలడు. గీశాడు. గీసి కొంప ముంచుకొన్నాడు. అది ఎరుగడు. అనుకోవటమే తడవుగా సైన్యంలో చేరాడు. సంవత్సరంలో మేజర్ అయ్యాడు. అప్పైన చాలా అయ్యాడు. రచయిత అయ్యాడు. నటుడయ్యాడు. బహుపాత్రాభినయం తర్వాత ఏమయ్యాడు? మిగతా కథ ఈ నవలలోని వెండి పేజీలపై బ్లేక్ అండ్ వైట్‌లో చూడండి.

అనూరాధ కథే అన్యాయంగా వుంది. ప్రప్రథమంగా విశ్వవిద్యాలయ కళాశాల సాంస్కృతికోత్సవాలలో ఆనందరావు ప్రక్కనే కనిపిస్తుంది. (అప్పటి కామె అక్కడ చదువుకోవటం లేదు. ఎప్పుడూ అక్కడ చదువుకోలేదు. నవల మధ్యే బెనారస్ మెట్రిక్ పరీక్ష వ్రాస్తుంది. ఆనందరావు బంధువై వుండి, అతను తీసుకురాగా, హైస్కూలులో చదువుకోనే లేక చదివే వయస్సులో వున్న ఆమె వచ్చి వుంటుంది. ఇదంతా పాఠకులు వూహించుకోవాలి. అలా వూహించుకొంటే మరో కష్టం వుంది. అక్కణ్ణుంచి ఆమె వయస్సుకు మించిన పనులు చేస్తుంది) ఆమె కృష్ణారావు కుమార్తె. పెళ్ళీడు కెదిగింది. సంబంధాలు వచ్చాయి. తపే తపే మని తేల్చిపారేసింది. తర్వాత కిరీటిరావును పెళ్ళాడింది. ఆప్పైన ఆనందరావును పెళ్ళాడింది. అవస్థల పాలయింది.

కృష్ణారావు తొట్టి వైద్యం కూతురు జీవితం మీద చాలా ప్రభావం చూపింది. తల్లి మాటకూ అనూరాధకూ ఆమడ దూరం!

అన్ని పాత్రలూ— అన్ని సంఘటనలు రచయిత సృష్టించింది కిరీటిరావు కోసమే! అతను సెంట్రీపీటల్ పాత్ర.

రచయిత అత్యవసరంగా సృష్టించిన పాత్ర శోభ, ఆనందరావు, జమాలుద్దీన్. ఇవి కిరీటిరావును తీర్చిదిద్దటానికి ఉపయోగపడాలని రచయిత ఉద్దేశం. అయితే ఆ పాత్రలు ధిక్కరించాయి. అకస్మాత్తుగా తల యెత్తాయి. స్వాతంత్ర్యం పొందాయి. సజీవపాత్రలయ్యాయి. ఈ విషయంలో రచయిత అభినందనార్హత పొందినట్లే!

సంఘటనలలో బలం తక్కువగా కన్పిస్తుంది. కిరీటిరావు, అనూరాధల సంసార జీవితం రెండు జీవిత విధానాల సంఘర్షణ.

శోభ చిత్రం గీయుటంతో ప్రారంభమయిన దశ జాలితో నిండి వుంది.

ఆనందరావు భార్య అనూరాధను, కిరీటిరావు వాన వచ్చిన రాత్రి అనుకోకుండా కలుసుకొన్న సంఘటన, దాని పూర్వాపరాలు, అక్కడ పాత్రల మనః పరిణామాలు పాఠకులు ఉత్సుకతతో చదువుతారు.

శిక్ష తలదాల్చే కిట్రాఫ్‌ను చూస్తుంటే గుండె కరుగవచ్చు. నవల ముగిసే ముందు పాఠకులు భావశాబల్యంలో మునిగిపోతారు.

నవల చివరి సంఘటనలు చదువుతూ పాత్రల మనోభావాలతో పాఠకులు తాదాత్మ్యం చెంది, ఐక్యం అయిపోతారు.

కిరీటిరావు ఉన్నతంగా ఉంచాలనుకొన్న సంఘటనలు వాస్తవానికి దూరంగా వున్నాయి.

రచయితకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పరిచయంలేని సంగతులు, అందులోనూ వివరాలు చెప్పవలసిన విషయాలు వీలైతే వ్రాయటం తప్పించుకోవాలి లేకపోతే సేకరించాలి గానీ, సహజంగా, అసంగతంగా, వాస్తవానికి దూరంగా వ్రాయ కూడదు. మిలటరీ విషయంలో రచయిత వ్రాసిందంతా అసహజం.

అంతే కాదు. హాస్యం కోసం అసహజత నవలకు ఆపాదించుకోకూడదు.

కిరీటిరావు ఇల్లు విడిచి పారిపోవటం, కోర్టులో శిక్ష తలదాల్చటం హేతుబద్ధంగా లేవు. ప్రశ్నించుకొంటే సరైన సమాధానం రాదు.

కిరీటిరావు చాలా అసహజమయిన పనులు చేశాడు. దానికి సమన్వయం—

ఇటువంటివారు లోకంలో చాలా మంది ఉన్నారు. వాళ్లే పని ఎందుకు చేస్తారో ఆలోచించరు. వాళ్ళకు త్యాగం చేయుటమే తెలుసు. అందులోనే ఆనందం వుందనుకొంటారు. అవ్యవస్థతతో వుంటారు. ఆలోచించరు. ఇతరులు ఏమనుకొంటారో అని, తమకుతామే ఇతరులు అనుకోనిది అనుకొని, శిక్షించుకొంటారు. కిరీటిరావు ఆకోవకు చెందిన వ్యక్తి అనుకొన్నా, ఏదో వెరితివుంది.

నవలలో ఆత్మీయతా, అభిమానం వున్నాయి. శోభాత్మక కారుణ్యం వుంది. ప్రేమ భావంతో, తదభావంతో దందహ్యమానమయ్యే హృదయాలూ ఉన్నాయి. సమర్పణతో అర్థం చేసుకోవాలని, అర్థం చేసుకోబడాలని తాపత్రయం చూపే పాత్రలూ ఉన్నాయి.

ఇంకా హాస్యం వుంది. కొన్ని చోట్ల హాస్యం తెచ్చి పెట్టుకొన్నట్లుగా వుంది. నవ్వించిన పాత్ర కిరీటిరావు. నవ్వుల పాలయిన పాత్ర కృష్ణారావు.

జీవితంలో ఎదురు దెబ్బలు తిని, దెబ్బ దెబ్బకూ గుండె గాయం పడి, గాయం లోంచి రక్తం రాక పోగా రాగోదయం అయి, గుండె బరికి విషాద మూర్తులుగా మిగిలి పోయిన పాత్రలు రెండు. ఆ పాత్రల చుట్టూ చూపవలసిన జీవితం చూప లేదు.

కథా పథకం సగం నుంచి ఉదాత్తంగా వుంది కాని, రచన తదనుగుణంగా సాగలేదనే చెప్పాలి.

పద రూపమూ, అర్థమూ సరిగా తెలుసుకోకుండా కొన్ని ప్రయోగాలున్నాయి. శైలిలో సమత్వం సద్యంకాదు.

నేటి యువకుల అవ్యవస్థకు రేఖా చిత్రం గీయబోయి, స్పష్టత సొందలేదీ నవల.

మంచి రచన చేసే సామర్థ్యం వున్న ఈ రచయిత, అవకాశం వున్న ఇతి వృత్తం ఎన్నుకొని, తదనుగుణంగా చేసిన రచనకోసం, ఈ రచన చదివిన తర్వాత ఆశిస్తుంది పాఠకలోకం.

—మనోరాణి

సుచరిత :

తొంభై తొమ్మిది పేజీల నవలిక. శ్రీ పి.ఎస్.వి. రమణరావు రచన, ప్రచురణ: నవజ్యోతి పబ్లికేషన్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ— 2. వెల: రెండు రూపాయలు.

సుచరిత, చలపతి యువతీ యువకులు. ప్రేమించు కుంటారు. పెళ్లి చేసుకుందా మనుకుంటారు. పిల్లతండ్రి సుదర్శనరావు తన పరువు మర్యాదల కోసం కూతుర్ని రాజారావు కిచ్చి బలవంత పెళ్ళి చేస్తాడు. గతి లేక సుచరిత మూడు ముళ్లకూ తల ఒగ్గినా, మనసు విడిచి తన బాధ గాథను రాజారావుతో వెలపోసుకుంటుంది. రాజారావు సహృదయుడు, కార్యశూరుడు. సుచరిత కష్టాన్ని అర్థం చేసుకుని, జరిగిన వివాహం కోర్టులో రద్దు చేయిస్తాడు. సుచరితనూ చలపతినీ మళ్ళీ కలపాలని రాజారావు పట్టు.

పరిస్థితులకు లొంగిపోయిన చలపతి స్వగ్రామం చేరుకుంటాడు. అతనికి తల్లీ, మేనమామా వేరే సంబంధం నిశ్చయిస్తారు. చలపతి పెళ్ళి ముహూర్తం నాటికి రాజారావూ, సుచరితా సపరివార సమేతంగా పందిట్లోకి దిగుతారు.

తరువాతి కథ?—

మీరు వూహిస్తున్నదే—

చలపతీ, సుచరితా ఒకటయ్యారు. పీటలమీది పెళ్ళి ఆగిపోకుండా, చలపతికి నిశ్చయమయిన పార్వతిని రాజారావు చేసేసుకున్నాడు!

సస్పెన్సు ఎక్కువ లేకుండా — కొద్ది పాటి చిక్కులతో— కథ కంచికి వెళ్లింది. ఒడుదుడుకులు లేని రచన. సినీనటులు శ్రీ రమణరావు రచయితగా మనకి పరిచయం కావటానికి ఈ నవలిక సింహద్వారం. అచ్చుతప్పులు తక్కువగా, ముద్రణ మరింత ముచ్చటగా వుంటే ఇంకా బాగుండేది. ముఖచిత్రం మంచి ఆకర్షణగా ఉంది.

—శివకుమారి

గీతాంజలి



సీతారామ కల్యాణం చిత్రం ద్వారా ఆంధ్ర ప్రేక్షకులకు సుపరిచితురాలయిన కుమారి గీతాంజలి యింతవరకు నలభయి చిత్రాలలో నటించింది. ఈ నలభయి చిత్రాలలోను తెలుగుతోపాటు, తమిళ, హిందీ చిత్రాలు కూడ ఉన్నవి. వీటిలో వైవిధ్యంగల భూమికలు అనేకం ధరిం



"శ్రీమతి" లో సత్యనారాయణ గీతాంజలి

చింది. వాంప్‌గా కొన్నింటిలోను, హాస్య నటిగా మరి కొన్నింటిలోను, నర్తకిగా యింకొన్నింటిలోను నటించింది.

సాత్వికమయిన వేషాలు కూడా గీతాంజలి వీటిలో వేసింది. సీతారామకల్యాణంలో సీత, డాక్టరు చక్రవర్తిలో లక్ష్మి, ఇల్లాలులో రాధ—యీ కోవకు చెందినవి, ఆమె పోషించిన వేషాలలో చెప్పుకో దగినవీను... ముఖ్యంగా యిల్లాలులో రాధ పాత్ర పోషణకు— కుమారి గీతాంజలి విశేషమయిన కృషి సలిపిందని ఆ చిత్రం చూసిన వారికి అర్థం అవుతుంది. నటనలో తన ప్రగతిని ఇల్లాలు చిత్రం ద్వారా ఋజువు చేసుకున్నది.

గీతాంజలి రాజమండ్రిలో జన్మించినా స్వస్థలం మాత్రం కాకినాడ. కాకినాడ లోని జగన్నాథపురాన గల సెంట్‌జోసఫ్ కాన్వెంటులో చదువుకున్నది. సంగీతమన్నా, నృత్యాలన్నా బాల్యం నుంచీ గీతాంజలికి ఎంతో మోజు. ఆమె ఉత్సాహాన్ని గమనించి తల్లిదండ్రులు నృత్యంలో శిక్షణ యిప్పించి ప్రోత్సహించారు. ఎంతో పట్టుదలతో నిర్విరామ కృషి చేసి నృత్యంలో చక్కటి పరిచయాన్ని పొందింది. ఓరియంటల్, కథాకళి, భరతనాట్యం, ట్విస్ట్, షేక్ మొదలయిన ఏ తరహాకు చెందిన నృత్యం అయినా గీతాంజలి అవలీలగా చేస్తుంది.

భక్త ప్రహ్లాద, అవేకళ్ళు, రాము, శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న, పార్వతీశపథం, పార్వతీ పరమేశ్వరులు, రక్త సిందూరం, సతీ అరుంధతి (కన్నడం కూడ) అంబికా ఫిలిమ్స్, శ్రీమతి, రహస్యం, ఖడ్గతిక్కన చిత్రాలలో యిప్పుడు కుమారి గీతాంజలి నటిస్తున్నది. ఇవికాక రెండు హిందీ చిత్రాలలోను, రెండు తమిళ చిత్రాలలోను పాల్గొంటున్నది.

'బలరామ శ్రీకృష్ణ' హిందీ వర్ణ చిత్రంలో బొంబాయి నిర్మాతలు—గీతాంజలి ప్రజ్ఞను గుర్తించి, రుక్మిణి వేషం యిచ్చారు. పాత్ర పోషణలో మంచి నేర్పు కనపరుస్తుంది. "మీరు యిన్ని చిత్రాలలో నటించారు కదా, వాటిలో మీకు నచ్చిన వేషం ఏది?" అని అడిగినప్పుడు— తడుముకోకుండా టపీమని "ఇల్లాలులో రాధ వేషమండీ! అది నాకెంతగానో నచ్చింది." అంటుంది కుమారి గీతాంజలి.

మర్యాద, మాట నెమ్మది, సంస్కారం గల కుమారి గీతాంజలి అందగత్తె అని వేరే చెప్ప నక్కరలేదను కుంటాను. ఆమెకు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. అక్క పేరు స్వర్ణ. ఈమె కూడా నటి. కొన్ని చిత్రాలలో నటించింది. ఇప్పుడు సినిమారంగానికి ఉద్వాసన చెప్పి— వివాహం చేసుకుని భర్తతో కాపురం చేస్తున్నది. చెల్లెళ్ళిద్దరూ చదువుకుంటున్నారు.

తీరిక వేళల్లో సినిమాలు చూస్తూ ఉండడం, నృత్యాలు ప్రాక్టీసు చేయడం, ఏవైనా పుస్తకాలు తిరగేస్తూ ఉండడం, అభిమానుల ఉత్తరాలకు జవాబులు రాయడం— కుమారి గీతాంజలికి అలవాటు.

—మోహన్ కుమార్




"శ్రీమతి"లో గీతాంజలి

చిత్రసమీక్ష:

చెమ్మీన్

తకళి శివశంకరపిళ్ళై నవల (మలయాళం) 'చెమ్మీన్' అంతర్జాతీయ ఖ్యాతి పొందుకుంది. దాన్నే కణ్మణి ఫిలింస్‌వారు ఈస్ట్‌మన్ కలర్‌లో మలయాళంలో చిత్రీకరించారు. 1965వ సంవత్సరంలో ఉత్తమ (ఫీచర్) చిత్రంగా చెమ్మీన్ రాష్ట్రపతి బంగారు పతకాన్ని అందుకోడం దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకే గర్వకారణమైంది. రాష్ట్రపతి బంగారు పతకాన్నందుకున్న మొట్టమొదటి దక్షిణాది చిత్రం 'చెమ్మీన్' కావటం మరొక విశేషం.

జాలరుల జీవితాలు, వారి నమ్మకాలు, కష్టనిష్ఠురాలు, మూఢవిశ్వాసాలు అత్యంత



'చెమ్మీన్'లో మధు, షీలా.

సహజంగా చిత్రీకరించబడ్డ, విభిన్న మతతత్వాల మధ్య సంఘర్షణను పాత్రల ద్వారా ప్రతిబింబితం చేసే విషాదాంతం చెమ్మీన్.

చిత్రంలో పరీకుట్టిగా మధు, కరుతమ్మగా షీలాల నటన హృదయాన్ని కదిలించేలా ఉంది. పళనిగా సత్యన్ ప్రశంసనీయమైన నటనను ప్రదర్శించాడు. చెంబన్ కుంజుగా కొట్టారక్కర శ్రీధరన్‌నాయర్ నటన చిత్రానికి జీవం పోసిందంటే అత్యుక్తి లేదు. చక్కిగా అదూర్ భవాని, పంచమిగా లత చక్కని నటనను ప్రదర్శించారు. మిగిలిన వారు వారి వారి పాత్రలకు తగినట్లు నటించారు.

చిత్రంలో ముఖ్యంగా చెప్పుకోదగినవి: నూతన పంథాలో, వాస్తవానికి దగ్గరలో ఉండి హృదయాన్ని కదిలించే సంఘటనలతో రూపొందించిన కథ, చక్కని ఛాయాగ్రహణం, ప్రతిభావంతమైన దర్శకత్వం, వీనుల విందైన సంగీతం.

ఈ చిత్రానికి దర్శకుడు రాము కారియత్, ఛాయాగ్రహణం మార్కస్ బారట్లీ, యు. రాజగోపాల్, సంగీతం సలీల్ చౌదరి, కూర్పు హృషికేశ్ ముఖర్జీ, కె. డి. జార్జి, నిర్మాత బాబు ఇస్మాయిల్ (బాబు).


—మాధవ్ ●

నాటకసమీక్ష:

సత్యహరిశ్చంద్ర

ఇటీవల శ్రీ వెంకటసాయి రాజేశ్వరి నాట్యమండలి వారు మద్రాసు కృష్ణ గాన సభ హాలులో 'సత్య హరిశ్చంద్ర' నాటకాన్ని ప్రదర్శించారు. పౌరాణిక నాటకాన్ని నియమాత్మంగా ప్రదర్శించిన నాట్య మండలి కృషి ఎంతైనా ప్రశంసించ తగింది. బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి నాటకానికి ఈ నటులు వన్నె తీసుకు వచ్చారనే చెప్పాలి. "హరిశ్చంద్ర పాత్రధారి కె. శివయ్యగారు నటించినంతగా మరి ఏ యితర ప్రఖ్యాత నటుడూ నటించి వుండలేద"ని సినిమా రంగాద నటుకులు విసిరిన ఒక సినిమా ప్రముఖులు సెలవిచ్చినట్లుగా శివయ్యగారి నటన, వాక్శుద్ధి ప్రతిభావంతమైనవే. కె. శివయ్యగారితో పాటు ఇంకా ఇందులో నటించిన వారు శ్రీయుతులు వి. కంఠాక్షరి, వి.బాలాజీ, టి. పార్థసారథి, సుబ్బరామయ్య, అంజనేయులు, మునిరత్నం, జయకుమార్, యం.మనోహర్, శ్రీమతులు భాగ్యశ్రీ, కళా, కుమారి సురేఖ, కుమారి ఇందిర, చిరంజీవి రమణ. శ్రీ మోహనరంగ నాయుడు దర్శకత్వం వహించిన ఈ నాటకానికి సంగీతం శ్రీ యస్.హనుమంతరావు కూర్చారు. నేపథ్య గాయకులు: శ్రీ యస్.వి. మూర్తి, శ్రీమతి బాలత్రిపుర సుందరి, పార్వతి. పాటలు: రాజశ్రీ, పద్యాలు: దాసరి రామారావు, బాజ్జీ, నృత్య దర్శకులు: పి.వి.ఎం. చలపతిరావు. మేకప్: వనమాలి. పలువురు సినిమా కళాకారులు, పురప్రముఖులు హాజరైన ఈ నాటకం ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నది.

—సి. కనకాంబరరాజు. ●



జమున, గుమ్మడి, మధుసూదనరావుగార్లకు మాస్కో వెళుతున్న సందర్భంలో — విమానాశ్రయంలో వీడ్కోలు చెబుతున్న శ్రీ జగ్గయ్య, శ్రీ కాంతారావు యీ చిత్రంలో చూడవచ్చును.

మాస్కో చలనచిత్రోత్సవానికి 'పదండి ముందుకు'

జమున, గుమ్మడి, వి. మధుసూధనరావుల పయనం.

జాగృతి చిత్ర తరపున నటుడు శ్రీ కె. జగ్గయ్య సమర్పించిన "పదండి ముందుకు!" చిత్రం, మాస్కోలో జరిగే చలన చిత్రోత్సవంలో ప్రదర్శింపబడుతున్నది. ఆ చిత్రంతోపాటు అందులో ముఖ్య భూమికలు నిర్వహించిన జమున, గుమ్మడి, ఆ చిత్ర దర్శకుడు వి. మధుసూదనరావు నవంబరు 13, 14తేదీలలో మాస్కో వెళ్లారు. వెళ్లేముందు వారికి యు. యస్. యస్. ఆర్. సాంస్కృతిక సంబంధాల శాఖ అధికారి శ్రీ ఎల్. ఏ. జాయింకోవ్, మద్రాసులోని తమ నివాసంలో ఆతిథ్యం యిచ్చారు. దక్షిణాది నుంచి యీ ఉత్సవానికి వెళ్ళిన రెండు చిత్రాలలోను "పదండిముందుకు!" ఒకటయితే, చెమ్మీన్ మళయాళం మరొకటి. ఈ సందర్భంలో నటులు శ్రీ జగ్గయ్యను కలిసి "మరి, దర్శ్య మీరెందుకు వెళ్లలేదు?" అని అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ఆయనిలా అన్నారు: "ప్రభుత్వం, వెళ్ళే తేదీలు ముందుగా యివ్వలేదు. నిర్మాతలకు షూటింగుల కాల్ షీట్స్ యిచ్చాను. అదీగాక, గతసారి "కీలుబొమ్మలు" చిత్రప్రదర్శనోత్సవానికి నేను వెళ్ళి వచ్చాను." "పదండి ముందుకు" లాంటి అద్భుతమయిన చక్కటి చిత్రాలు యిప్పుడు నిర్మించే సంకల్పం ఏదయినా ఉన్నదా?" అడిగాను. "ఇప్పటికైతే అలాంటి ఆలోచన ఏమీలేదు. అలాంటిది ఏదయినా ఉంటే బహుశా వచ్చేసంవత్సరం ఉండవచ్చు" అన్నారు శ్రీ జగ్గయ్య—తన సహజ గంభీరమయిన గొంతుతో.

నవ్వులు-పువ్వులు

ఉదయ భాస్కర్ పిక్చర్స్ వారి హాస్యరసభరిత చిత్రం "నవ్వులు — పువ్వులు" యింతవరకు అయిదు రీళ్ళు తయారయింది. కృష్ణకుమారి, జగ్గయ్య, చలం, శారద, రాజబాబు, [illegible], రాజారెడ్డి, సూర్యకాంతం, ముఖ్య భూమికలు పోషిస్తున్నారు. అరుణ, యడవిల్లి రమ (కూచిపూడి) యీ చిత్రంలో చక్కని వేషాలలో పరిచయం కాబోతున్నారు. రచన: రాజశ్రీ, సంగీతం: వి.యస్. రెడ్డి, దర్శకుడు: పి. శ్రీనివాస్.

గౌతమిపిక్చర్స్

గౌతమి పిక్చర్స్‌వారు నిర్మిస్తున్న సాంఘిక చిత్రానికిగాను గత వారంలో కథానాయకుని యన్. టి. రామారావు యింటి సెట్టులో కొన్ని దృశ్యాలను చిత్రీకరించారు. కళాదర్శకుడు శ్రీ తోట వెంకటేశ్వరరావు రూపొందించిన ఆ యిల్లు ఎంతో అధునాతనంగా అందంగా ఉన్నది. ఈ

చిత్రలహరి

షెడ్యూలులో రామారావుతో పాటు సావిత్రి, అంజలీదేవి, ముక్కామల, బేబి శాంతికళ పాల్గొన్నారు. సి. నారాయణరెడ్డి రాయగా ఘంటసాల సంగీత దర్శకత్వంలో సుశీల పాడిన "విన్నారి కృష్ణయ్య రారా..నా కన్నులలో పున్నమి సేవేరా" అనే గీతం సావిత్రి అంజలీదేవిలపై చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రంలోని యితర ముఖ్యభూమికలలో పద్మనాభం, గీతాంజలి, సత్యనారాయణ కూడ ఉన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: దాదామిరాసి, నిర్మాత: యన్. రామబ్రహ్మం.

అపర్ణాపిక్చర్స్

వై సంస్థవారు తమ ప్రథమ చిత్రమైన సాంఘిక చిత్రానికి ఇటీవల ఏ.వి.యం. లో పాట రికార్డు చేశారు. పాడిన వారు శ్రీమతి వైదేహి.

ఈ చిత్రంలో ప్రధాన భూమికను శ్రీ జగ్గయ్య పోషిస్తారు. ఇతర ముఖ్య భూమికలకు పరిశ్రమలోని ముఖ్య నటీనటుల ఎన్నిక జరుగుతూంది. కొందరి కొత్తవారిని కూడా యీ చిత్రంలో పరిచయం చేస్తున్నారు.

ఎడిటరుగా ప్రసిద్ధిగాంచిన శ్రీ జి. యస్. కృష్ణమూర్తి దర్శకత్వం వహించే యీ చిత్రం త్వరలోనే సెట్సుకు వెళ్తుంది.

సంగీతం: శ్రీ అశ్వత్థామ. నిర్మాతలుగా పి.ఎస్. శాస్త్రి, కె. రామయోగి, జి. సుబ్బారావు, మిగిలిన సాంకేతిక నిపుణుల ఎన్నిక జరుగుతున్నది.

దర్శకుడయిన రచయిత

సినిమా రచయితగా శ్రీ జి. కృష్ణమూర్తి ఆంధ్రప్రేక్షకులకు పరిచితులు. విఠలాచార్యగారి స్వంత చిత్రాలన్నిటికీ ఆయన రచన చేశారు. అన్నాచెల్లెళ్ళు, ఖైదీ కన్నయ్య, జ్వాలాద్వీప రహస్యం మొదలయిన బయటి చిత్రాలకు కూడా ఆయన సంభాషణలు, పాటలు రాశారు. ఇప్పుడు శ్రీ కృష్ణమూర్తి కొత్తగా రాసిన భూలోకంలో యమలోకం, [illegible]

జయం చిత్రాలు త్వరలో విడుదల అవుతున్నాయి. జి.కె. మూర్తి సినిమా రచయితగానే కాక, శ్రీ విఠలాచార్యగారి వద్ద కొంత కాలం పాటు సహాయదర్శకుడిగా కూడ పనిచేసి విశేషమయిన అనుభవం గడించారు. ఆ అనుభవాన్ని పురస్కరించుకొని జయభారత్ ఫిలిమ్స్ అనే హైదరాబాద్ సంస్థ తాము నిర్మించబోయే జానపద చిత్రానికి ఆయనకు రచనతో పాటు, దర్శకత్వం వహించే అవకాశం కల్పించారు. రాజశ్రీ, కాంతారావు, సంధ్యారాణి, గుమ్మడి, రేలంగి, పద్మనాభం, నెల్లూరు కాంతారావు ముఖ్యపాత్రలు నిర్వహిస్తారు. సంగీతం: రాజన్—నాగేంద్ర, నిర్మాతలు: జె. యస్. గుప్త, లంకసత్యం.

నవజ్యోతి ఫిలిమ్స్ రెండవ చిత్రానికి మల్లిఖార్జునరావు దర్శకత్వం

గూఢచారి 116 చిత్రానికి దర్శకత్వం వహించి, ఆంధ్రప్రేక్షకులకు ఆ చిత్రం ద్వారా ఒక కొత్తదనాన్ని చవిచూపిన యువ దర్శకుడు శ్రీ ఎం మల్లిఖార్జునరావు—నవజ్యోతి ఫిలిమ్స్ వారి రెండవ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఒక తమిళ చిత్రాన్ని అనుసరించి ఉత్కంఠ రేకెత్తించే విధంగా రూపొందించబడుతున్న యీ సాంఘికంలో గుమ్మడి, చలం, గీతాంజలి, సత్యనారాయణ ముఖ్యపాత్రధారులు. సంభాషణలు: భమిడిపాటి రాధాకృష్ణ, సంగీతం: టి. చలపతిరావు పాటల రికార్డింగ్ డిసెంబరు మొదటివారంలో జరుపుతారు. జనవరి నుంచి షూటింగు ప్రారంభించి మార్చి మాసాంతానికి నిర్మాణం పూర్తి చెయ్యాలని సంకల్పించారు నిర్మాతలు. ఈస్టిండియా ఫిలిం కంపెనీ వారు యీ చిత్రానికి పంపిణీదారులు.

భువనసుందరి కథ

శ్రీదేవీ ప్రొడక్షన్స్‌వారి "భువనసుందరి కథ" చిత్రాన్ని నవంబరు 14న వీనస్ స్టూడియోలో ప్రారంభించారు. మధ్యాహ్నం 2—30 గం.లకు శ్రీ యన్. త్రివిక్రమరావు పూజచేసి కొబ్బరికాయ కొట్టారు. శ్రీ కామరాజు (పూర్ణాపిక్చర్స్) కెమెరా స్విచ్ ఆన్ చేయగా, యీ చిత్రంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యన్. టి. రామారావు క్లాప్ కొట్టారు. నిర్మాత శ్రీ తోట సుబ్బారావు చిత్రంలో నటిస్తున్న నటీ



"చిన్నమ్మ"లో దేవిక, సూర్యకాంతం, విజయనిర్మల

నటులకు, సాంకేతిక నిపుణులకు పూలమాలలు వేసి, ఫల, శీతల పానీయాలతో సత్కరించారు

యన్. టి. రామారావు, కృష్ణకుమారి, యస్. వి. రంగారావు, ఉదయకుమార్, మిక్కిలినేని, ధూళిపాళ, అల్లురామలింగయ్య, సత్యనారాయణ, వాణిశ్రీ, జయశ్రీ, ఛాయాదేవి, సబితాదేవి, కొత్తనటి ఉషాకుమారి యిందులో నటిస్తున్నారు. పి. నారాయణరెడ్డి రాయగా, ఘంటసాల సంగీత దర్శకత్వంలో పి సుశీల పాడిన "నా వయసు రమ్మందిరా, నీ మనసు రమ్మందిరా—మనసాగిందిరా, తను వాడిందిరా" అనే గీతాన్ని మాయామోహినిగా పాల్గొంటున్న నర్తకి జయశ్రీపైన మొదటి షూటింగ్ షెడ్యూల్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ నృత్యంతో పాటు కొన్ని ట్రిక్ సీన్లు కూడ యీ షెడ్యూలులో తీశారు. సంభాషణలు: బి. ఎల్. ఎన్. ఆచార్య, కెమెరా సి నాగేశ్వరరావు, దర్శకుడు. సి పుల్లయ్య.

ఆ మా య కు డు

హైదరాబాద్‌లో నెలకొల్పబడిన ఉదయశ్రీ పిక్చర్స్ అనే కొత్తసంస్థ హిందీలో విజయవంతంగా సాగిన "అనాడి" చిత్రాన్ని తెలుగులో పునర్నిర్మిస్తున్నది. ఈ చిత్రంలో జమున, కృష్ణ నాయకీ నాయకులుగా నటిస్తున్నారు. నవంబరు 14 నుంచి శ్రీసారధి స్టూడియోలో షూటింగు ప్రారంభిం



"సతీసావిత్రిశపథం"లో పద్మిని, హరనాథ్



"శ్రీకృష్ణమహిమ'లో కుమారి

చారు. గుమ్మడి, జి. వరలక్ష్మి, ముక్కామల, రేలంగి, గిరిజ, కళ్యాణి యితర ముఖ్యపాత్రధారులు. సంగీతం: బి. శంకర్, కెమెరా: ఎం. కె. రాజు, దర్శకుడు: అడ్డాల నారాయణరావు, నిర్మాతలు. వెంకటనర్సయ్య, శంకరయ్య.

తమిళ చిత్రాలకు తెలుగు రచయిత కథలు!

తెలుగు రచయితల్ని కూడా తమిళ నిర్మాతలు ప్రోత్సహిస్తున్నారు. సంభాషణ రచయితగాను, గేయ రచయితగాను ఆంధ్ర ప్రేక్షకులకు పరిచితుడయిన రాజశ్రీ—యిటీవల రెండు తమిళ చిత్రాలకు కథలు రాశారు. ఈ రెండు చిత్రాలు యిపుడు షూటింగు జరుగుతున్నది. ఒకటి: (ఎంగిరుంధో వందాన్ (శరవణా స్క్రీన్స్) రెండవది: కాదల్ పరవయ్ (శ్రీ శ్రీ ఫిలిమ్స్) మొదటి దాన్లో రాజశ్రీ, రవిచందర్, రెండవదానిలో భారతి, జయశంకర్ ముఖ్యభూమికలు పోషిస్తున్నారు. కాదల్ పరవయ్ చిత్రానికి తెలుగు దర్శకుడు అమంచర్ల శేషగిరిరావు దర్శకత్వం వహిస్తున్నారు.

"మధురభక్తి" గీతాలు


భక్తుడు తాను నాయకి భావం వహించి, భగవంతుణ్ణి నాయకునిగా చేసి ఉపాసించటాన్ని "మధురభక్తి" అంటారు. ఇందుకు ఉదాహరణగా వైష్ణవ ఆళ్వార్లలో ఆండాళ్, నమ్మాళ్వార్, తిరుమంగాళ్వార్, ఉత్తర హిందూస్థానంలో మీరాబాయి, జయదేవుడు మొదలయిన వారి గీతాలను పేర్కొనవచ్చును. అట్టి పద్ధతిలో శ్రీ వి. జి. కె.



"సతీసుమతి"లో కాంచన

చిత్రలహరి

చారి రచించిన రెండు గీతాలను యిటీవల గ్రామఫోన్ కంపెనీలో రికార్డు చేశారు. మొదటిది: ఎవరే ఓ చెలియా, నా కలలోన కనిపించి చలమును చేసెనే. రెండవది:చిలుకా ఓ రామచిలుకా, పులుగులకు తిలకమే బంగారు మొలకా. తొలి గీతం షణ్ముఖప్రియరాగంలోను, మలి గీతం ఆనంద భైరవిలోను చేశారు, సంగీత దర్శకుడు శ్రీ పెండ్యాల. ఆలపించిన కంఠం పి. సుశీలది. పెండ్యాల మధుర సంగీత ఝరికి సుశీల మృదు స్వరం తోడయితే, ఆ పాటలు రసపుష్టితో హృదయాలను స్పందింప చేయకుండా ఉంటవా? జనవరిలో యీ గీతాలు 'కొలంబియా' ద్వారా బేసిక్ రికార్డులుగా వెలువడుతవి.



నవంబర్ 1 నుంచి 24 దాకా ఇంగ్లండ్‌లోని "యాష్‌గేట్‌గాలరీ"లో ప్రదర్శింపబడినవి.
ఎస్. వి. రామారావుగారి తైలచిత్రం—"భీతరసము"

శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న

రేఖా అండ్ మురళీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ వారి "శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న" చిత్రం షూటింగు నవంబరు 17 నుంచి ప్రసాద్ స్టూడియోస్‌లో ప్రారంభించారు. గార్డెన్ సెట్‌లో సుశీల, జేసుదాసు పాడిన యుగళ గీతం—వెన్నెల ఉంది, వేడిమిఉంది—చిత్రంలో ప్రధానపాత్రలు పోషిస్తున్న పద్మనాభం గీతాంజలిలపై మొదటి షెడ్యూలులో చిత్రీకరించారు. రాజనాల, ముక్కామల, ప్రభాకరరెడ్డి, రాజ్ బాబు కూడ తారాగణంలో ఉన్నారు. రచన: వీటూరి, కెమెరా: సత్యం, సంగీతం: కోదండపాణి, దర్శకుడు: కె. హేమాంబరధరరావు.

రతీమన్మథ

ఇందిరా ప్రొడక్షన్స్‌వారి "రతి మన్మథ" చిత్రం గోల్డెన్ స్టూడియోలోని "ఏ" ఫ్లోర్‌లో షూటింగు జరుగుతున్నది. ఇందులో నారదుడుగ రామ్మోహన్ నటిస్తున్నాడు. కాంతారావు, కృష్ణకుమారి, యస్. వి. రంగారావు, రఘురామయ్య, శారద, రాజ్ బాబు, రమాప్రభ, ఆదోని లక్ష్మి ముఖ్య తారాగణం. దర్శకుడు ఏ. నాగయ్యనాయుడు.

—మోహన్ కుమార్ ●

అవీ...ఇవీ


వివాహం

ప్రఖ్యాత నర్తకి, నటి కుమారి యల్. విజయలక్ష్మి సోదరుడు డాక్టర్ యల్. రామకృష్ణన్‌కు సౌ. పద్మసానికి వెల్లాఫూర్‌లోని రాజేశ్వరీ కల్యాణమండపంలో ఘనంగా వివాహం జరిగింది. పలువురు సినిమా నటులు, పురప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

విదేశాలలో శ్రీ ఎస్. వి. రామారావు చిత్రాలు

శ్రీ ఎస్. వి. రామారావుగారి చిత్రాలు భారత దేశంలోనే కాక, 'మ్యూసియం ఆఫ్ మాడరన్ ఆర్ట్స్', న్యూయార్క్: 'నేషనల్ గాలరీ', న్యూజిలాండ్; లిన్క్స్ హవుస్ ఫవుండేషన్, బ్రిటన్, అమెరికా, సిలాన్, జార్డాన్, ఈజిప్టు, పోర్చుగల్, సియర్రా లియోన్ మొదలయిన దేశాలలో రసజ్ఞులవద్ద ఉన్నాయి. '67 లో' అరండేల్ అనే చోట 'వన్‌మాన్‌షో' ఒకటి ఏర్పాటు చేశారు.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.



శివకుమార్

పరిశుభ్రతకు, ప్రకాశవంతమైన కేశ సౌందర్యమునకు

రెమి ®

షాంపు

ఉపయోగించండి.

Manufacturers: REMY PERFUMS PRIVATE LIMITED.
263, Thambu Chetty St., Madras-1.